


# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

16.09.2025

మంగళవారం| అనంతపురం

సంపుటి : 10 | సంచిక: 140

పేజీలు : 12 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## యూరియా వాడకం తగ్గిస్తే

# ప్రోత్సాహకాలు

## సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటన

- వచ్చే ఏడాది నుంచి అమలుకు నిర్ణయం
- తగ్గించే ప్రతి కట్టకు రూ.800 నేరుగా రైతుకు
- రైతు నష్టపోకూడదనేది మా లక్ష్యం
- ప్రజారోగ్యం బాగుండాలనేది మా తాపత్రయం
- కలెక్టర్ల సదస్సులో సాగు రంగంపై చర్చ
- యూరియా ఎక్కువ వాడితే క్యాన్సర్ వస్తుంది
- రైతుల్లో చైతన్యం తీసుకురావాలి
- క్యాన్సర్ టాప్5లో ఏపీ ఉందని ఆందోళన





అమరావతి, సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్

ఏపీ సీఎం చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. వచ్చే ఏడాది నుంచి యూరియా వాడకం తగ్గించే రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. తగ్గించే ప్రతి కట్టకు రూ.800 నేరుగా రైతుకు అందిస్తామని చెప్పారు. రైతు నష్టపోకూడదు, ప్రజారోగ్యం బాగుండాలని పేర్కొన్నారు. కలెక్టర్ల సదస్సులో వ్యవసాయ రంగంపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. "యూరియా ఎక్కువ వాడటం వల్ల క్యాన్సర్ వస్తుంది. దీని వాడకంపై రైతుల్లో చైతన్యం తీసుకురావాలి. ఏపీలో క్యాన్సర్ టాప్-5 రోగాల జాబితాలో ఉంది. వాడకం ఇలాగే కొనసాగితే క్యాన్సర్‌లో నంబర్-1కి వెళ్లిపోతాం. వచ్చే ఏడాది నుంచి ఎంతవరకు అవసరమో అంతే వినియోగించాలి. మైక్రో న్యూట్రియంట్స్ సప్లిమెంట్స్ కింద ఇవ్వాలి. యూరియా ఎక్కువ వాడితే ఎక్కువ పంట వస్తుందనుకోవడం సరికాదు. దీని అతివాడకంపై పంజాబ్‌ను కేస్ స్టడీగా చూడాలి" అని చంద్రబాబు తెలిపారు. 9లో..

## రాష్ట్రానికి 41,170 టన్నుల యూరియా

- అచ్చెన్నాయుడు వెల్లడి
- నేడు రాష్ట్రానికి చేరుకుంటాయని వెల్లడి

2లో..



## మరోసారి ఐఏఎస్‌ల బదిలీ

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈవోగా ధాత్రి రెడ్డి

2లో..



## మహిళలే ఆర్కిటెక్ట్‌లు

- సమాజ నిర్మాణానికి వాళ్లే నిర్మాతలు
- గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్
- సమాజాన్ని వృద్ధి పథంలో నడిపిస్తున్నారు
- మహిళా సాధికార కమిటీల జాతీయ సదస్సుకు హాజరు
- మహిళలను ప్రతి ఒక్కరు గౌరవించాలి

2లో..



తిరుపతి, సెప్టెంబర్ 15, అనంతజనశక్తి న్యూస్

మహిళా సాధికారత కేవలం మహిళలనే కాదు.. సమాజాన్నీ వృద్ధి పథంలో నడిపిస్తుందని ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. తిరుపతిలో నిర్వహిస్తున్న మహిళా సాధికార కమిటీల జాతీయ సదస్సు రెండోరోజు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

## మహిళల నాయకత్వాన్ని ప్రోత్సహించాలి

- గ్రామీణ స్థాయి నుంచే మార్పు రావాలి
- లోక్‌సభ స్పీకర్ బిర్లా
- వికసిత్ భారత్‌లో మహిళల పాత్ర కీలకం
- వాళ్లు లేనిదే అభివృద్ధి సాధించలేం
- కొందరు చదువుకు దూరం అవుతున్నారు

2లో..



## మహిళలు ముందుకు వస్తేనే ఏదైనా ప్రాంతం అభివృద్ధి

- మహిళలను విద్యావంతులు చేయాలి
- శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

తిరుపతి, సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్

మహిళలు ముందుకు వస్తేనే ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందుతుందని ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. తిరుపతిలో నిర్వహిస్తున్న మహిళా సాధికార కమిటీల జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. మహిళలను విద్యావంతులను చేయాలని, వారిని ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఈ సదస్సులో చర్చించిన అంశాలు కొత్త దిశను చూపిస్తాయన్నారు. 2లో..



## సీఎంగా పని చేసినప్పుడు అప్పుడే హ్యాపీ అనిపించింది

- ఐదు మెడికల్ కాలేజీలు ప్రారంభించినప్పుడే
- మాజీ సీఎం వైఎస్ జగన్ వెల్లడి

2లో..



## టీడీపీ ఎంపీలే పార్లమెంట్‌లో ఎక్కువ ప్రశ్నలు వేశారు

- పార్లమెంట్ సెషన్‌లో కృష్ణన్లు
- వెల్లడించిన పాలిటిక్స్ ఫర్ ఇంపాక్ట్ సంస్థ
- ఎంపీల్లో కలిశెట్టి అగ్ర స్థానంలో ఉన్నారు
- అత్యుత్తమ పనితీరు కనబర్చినవారిలో లావు శ్రీకృష్ణ దేవరాయలు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15, అనంతజనశక్తి న్యూస్

దేశ రాజధాని ఢిల్లీలో తెలుగువాణి బలంగా వినిపిస్తోంది. పార్లమెంట్ సమావేశాల్లో మన ఎంపీలు వివిధ సమస్యలపై ప్రశ్నలు సంధిస్తున్నారు. తమ గళం వినిపిస్తున్నారు. గత ఏడాది కాలంలో జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ ఎంపీలు మొత్తం 1576 ప్రశ్నలు లేవనెత్తారు. ఇందులో అత్యధికంగా తెలుగుదేశం పార్టీ ఎంపీలు 1081 ప్రశ్నలు లేవనెత్తగా.. ఆ తర్వాతి స్థానంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉంది. వైసీపీ తరుపున ఆ పార్టీ ఎంపీలు 267 ప్రశ్నలు పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించారు. ఏపీలోని బీజేపీ ఎంపీలు 134, జనసేన పార్టీ ఎంపీలు 94 ప్రశ్నలు సంధించారు. ఏపీ ఎంపీలు సగటున 71.6 ప్రశ్నలు లేవనెత్తగా.. జాతీయ సగటు కంటే ఈ మొత్తం ఎక్కువ కావటం విశేషం. 2లో..

## దోశ మారిందని అడిగినందుకు కస్టమర్‌పై కత్తితో దాడి



2లో..

## నిధులు ఎటు దారి మళ్లించాలో సమాధానం చెప్పాలి

- రాజమండ్రిలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు
- మెడికల్ కాలేజీ చూసి ఆహా అనలేం
- రాజమండ్రిలో ఓహో అనిపించేలా వైసీపీ పార్టీ

అమరావతి, సెప్టెంబర్ 15, అనంతజనశక్తి న్యూస్

మెడికల్ కాలేజీల వివాదంపై టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఘాటుగా విమర్శలు చేశారు. మాజీ సీఎం జగన్ అన్నట్లుగా రాజమండ్రి మెడికల్ కాలేజీ చూసి ఆహా అనలేమని.. రాజమండ్రిలో ఓహో అనిపించేలా వైసీపీ పార్టీ కార్యాలయం మాత్రం కట్టుకున్నారని ఆరోపించారు. గత జగన్ ప్రభుత్వం మెడికల్ కాలేజ్ నిర్మిస్తామని రూ. 5 వేల కోట్లు అప్పు చేసిందని అన్నారు. 2లో..

## శ్రీవారి సేవలో జడేజా సతీమణి

తిరుమల శ్రీవారిని టీమ్‌ఇండియా క్రికెటర్ రవీంద్ర జడేజా సతీమణి, గుజరాత్ ఎమ్మెల్యే రివాబా జడేజా దర్శించుకున్నారు. సోమవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో స్వామివారి సేవలో ఆమె పాల్గొన్నారు. తితిదే అధికారులు ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను ఆమెకు అందజేశారు.





# రాష్ట్రానికి 41,170 టన్నుల యూరియా

అమరావతి, సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్

రాష్ట్రానికి 41,170 మెట్రిక్‌టన్నుల యూరియాను కేంద్రం కేటాయించిందని ఏపీ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ నెల 16న యూరియా రాష్ట్రానికి చేరుకుంటుందని చెప్పారు. ఎరువుల కొరత లేకుండా చర్యలు చేపడుతున్నామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. రైతు సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

# దోశ మారిందని అడినందుకు కస్టమర్‌పై కత్తితో దాడి

- విజయవాడ వైఎస్సార్ కాలనీలో ఘటన
- వెల్ కమ్ హోటల్ సిబ్బంది నిర్వాకం
- ఉప్మా దోశ పార్సిల్ చెప్తే.. ప్లెయిన్ దోశ
- ఇదేంటని ప్రశ్నించినందుకు కత్తితో దాడి



విజయవాడ, సెప్టెంబర్ 15, అనంతజనశక్తి న్యూస్

ఆర్డర్ ఇచ్చిన దోశ కాకుండా వేరే దోశ ఇచ్చారేంటని ప్రశ్నించినందుకు హోటల్ సిబ్బంది ఓ కస్టమర్‌పై కత్తితో దాడి చేశాడు. విజయవాడ వైఎస్సార్ కాలనీ సర్కిల్‌లోని వెల్‌కమ్ హోటల్‌లో ఈ ఘటన జరిగింది. శనివారం రాత్రి వెల్‌కమ్ హోటల్‌కు టిఫిన్ కోసం వెళ్లిన అబ్దుల్ కరీం.. ఉప్మా దోశ పార్సిల్ కావాలని ఆర్డర్ చేశాడు. కొద్దిసేపటి తర్వాత.. వాళ్లు ఇచ్చిన దోశ పార్సిల్ తీసుకుని కరీం వెళ్లిపోయాడు. తీరా ఇంటికి వెళ్లి చూసిన తర్వాత పార్సిల్‌లో ఉప్మా దోశ బదులు.. ప్లెయిన్ దోశ ఉంది. ఇదేంటని తిరిగి హోటల్‌కు వచ్చిన అబ్దుల్ కరీం.. హోటల్ సిబ్బందిని ఇలా ఎందుకు చేశారని నిలదీశాడు. ఈ క్రమంలోనే హోటల్ సిబ్బందితో కరీంకు.. మాటామాట పెరగింది. అది గొడవకు దారితీసింది. సహనం కోల్పోయిన హోటల్ సిబ్బంది అబ్దుల్ కరీంపై కత్తితో దాడి చేశారు. దీంతో ఆయన మెడపై తీవ్ర గాయం అయ్యింది. ఈ క్రమంలోనే తీవ్ర రక్తస్రావం అయ్యింది. వెంటనే ఆయన్ను బంధువులు ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. అయితే, కరీం బంధువులు హోటల్ యజమానులను నిలదీశారు. దీంతో వారు.. తప్పు జరిగింది.. మేం ఏం కావాలని చేయమనలేదని వివరణ ఇచ్చారు. దీనికి సంబంధించి ఓ వీడియో బయటకు వచ్చింది.

అయితే, కరీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న కొత్తపేట పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఏదేమైనప్పటికి..

గొడవ జరిగితే కత్తితో దాడి చేస్తారా అని నెటిజెన్లు ప్రశ్నిస్తున్నారు. తీవ్ర రక్తస్రావంతో మనిషి ప్రాణాలు పోతే పరిస్థితి ఏంటని అంటున్నారు. ఇలాంటి సంఘటనలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# మరోసారి ఐఏఎస్‌ల బదిలీ




- ఏపీ ఫైబర్ నెట్ ఎండీగా గీతాంజలి శర్మ
- పెట్టుబడులు శాఖ ఎండీగా శౌర్యమాన్ పటేల్

అమరావతి, సెప్టెంబర్ 15, అనంతజనశక్తి న్యూస్

ఏపీ ప్రభుత్వం మరోసారి ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీ చేపట్టింది. గత కొన్ని రోజులుగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీ ప్రక్రియ చేపడుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. సోమవారం మరోసారి పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను బదిలీ చేసింది. సోమవారం ముగ్గురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఉన్న ధాత్రి రెడ్డిని.. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈవోగా నియమించింది. కృష్ణా జిల్లా జేసీగా ఉన్న గీతాంజలి శర్మను ఏపీ ఫైబర్‌నెట్ ఎండీగా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. పాడేరు సబ్ కలెక్టర్‌గా ఉన్న శౌర్యమాన్ పటేల్‌ను మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ ఎండీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

మరోవైపు ఐపీఎస్ అధికారి ఐపీఎల్ రాహుల్ దేవ్ శర్మకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా పూర్తిస్థాయిలో అదనపు బాధ్యతలను అప్పగించారు. రాహుల్ దేవ్ శర్మకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డైరెక్టర్, ఏపీఎస్‌బీసీఎల్ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే డిస్టిలరీస్ అండ్ బ్రేవరీస్ కమిషనర్‌గా పూర్తి స్థాయి బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు ఏపీ ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా జీవో జారీ చేశారు.

మరోవైపు ఏపీ ఫైబర్ నెట్ ఎండీగా గీతాంజలి శర్మను నియమించింది ప్రభుత్వం. ప్రవీణ్ ఆదిత్య స్థానంలో గీతాంజలి శర్మను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కొన్ని నెలల కిందట ఏపీ ఫైబర్ నెట్ వ్యవహారం రాష్ట్రస్థాయిలో సంచలనం రేపిన సంగతి తెలిసిందే. ఫైబర్ నెట్ ఛైర్మన్‌గా ఉన్న జీవీ రెడ్డి.. ఫైబర్ నెట్ ఎండీ దినేష్ కుమార్ మీద సంచలన ఆరోపణలు చేయడం కలకలం రేపింది. ఆ తర్వాత పరిణామాల్లో జీవీ రెడ్డిని సీఎం చంద్రబాబు పిలిపించుకుని మాట్లాడటం.. కొన్ని రోజులకే జీవీ రెడ్డి ఏపీ ఫైబర్ నెట్ ఛైర్మన్ పదవికి, టీడీపీ సభ్యత్వానికి రాజీనామా చేయడం రాజకీయంగా సంచలనం రేపింది. ఆ తర్వాత ఫైబర్‌నెట్ ఎండీ దినేష్ కుమార్‌ను సైతం బదిలీ చేసింది. ఆయన స్థానంలో ప్రవీణ్ ఆదిత్యను నియమించగా.. తాజాగా ప్రవీణ్ ఆదిత్య స్థానంలో ఐఏఎస్ ఆఫీసర్ గీతాంజలి శర్మను ఫైబర్ నెట్ ఎండీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# మహిళలే ఆర్కిటెక్ట్‌లు

తిరుపతి, సెప్టెంబర్ 15, అనంతజనశక్తి న్యూస్



మహిళా సాధికారత కేవలం మహిళలనే కాదు.. సమాజాన్నీ వృద్ధి పథంలో నడిపిస్తుందని ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. తిరుపతిలో నిర్వహిస్తున్న మహిళా సాధికార కమిటీల జాతీయ సదస్సు రెండోరోజు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సతీ సహగమనం, బాల్య వివాహాలు పురాణాల్లో కనిపించవని చెప్పారు. మన వేదాలు, ఉపనిషత్తులు మహిళలను గౌరవించాలని చెబుతున్నాయన్నారు. వారికి గౌరవం లేని చోట ఎన్ని గొప్ప కార్యక్రమాలు చేసినా ఫలితం లేదని పేర్కొన్నారు.

‘‘కుటుంబ సంతోషం ఆ ఇంట్లో మహిళల ఆనందంపై ఆధారపడి ఉంటుంది. ఇదే రాష్ట్రానికి, దేశానికి వర్తిస్తుంది. మొల్ల రామాయణం రాసిన కవయిత్రి మొల్లకు తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానం ఉంది. కేవలం ఆస్తుల్లో భాగస్వామ్యం లేకపోవడం వల్ల మహిళలు చాలా సార్లు తండ్రి, సోదరుడు, భర్తపై ఆధారపడతారు. పురుషాధిక్యత సమాజంలో వారికి రెండో స్థానం ఇచ్చారు. కానీ సమాజ నిర్మాణానికి మహిళలే సరైన ఆర్కిటెక్ట్‌లు. భారత రాజ్యాంగం అందరినీ సమానంగా గుర్తిస్తుంది. లింగ సమానత్వానికి రాజ్యాంగంలో ప్రాధాన్యత ఉంది. మహిళలు ఎన్నో సవాళ్లను దాటి రాజకీయ, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో పురుషులకు గట్టి పోటీ ఇస్తున్నారు. సుప్రీంకోర్టు అనేక తీర్పుల్లో వారి హక్కులను కాపాడేలా తీర్పులు ఇచ్చింది. ఆయా తీర్పులు హక్కులను కాపాడటంలోనే కాదు, సమాజ నిర్మాణంలోనూ కీలక పాత్ర పోషించాయి. ఛత్తీస్‌గఢ్‌లో అత్యధికంగా 14 శాతం మంది మహిళా ఎమ్మెల్యేలు ఉన్నారు. రువాండాలో 30 శాతం పార్లమెంటరీ సీట్లు కేటాయిస్తూ చట్టం చేసిన కొద్ది కాలానికే అక్కడ వృద్ధి పెరిగింది. భారత రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం తక్కువ. విద్య ద్వారానే వారికి సాధికారత సాధ్యం అవుతుంది’’ అని గవర్నర్ అన్నారు.

# మహిళల నాయకత్వాన్ని ప్రోత్సహించాలి

తిరుపతి, సెప్టెంబర్ 15, అనంతజనశక్తి న్యూస్



మహిళల భాగస్వామ్యం లేకుండా వికసిత్ భారత్ సాధించలేమని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. కొన్నిచోట్ల పాఠశాలలు దూరంగా ఉండటం వల్ల కొందరు చదువుకు దూరమవుతున్నారని చెప్పారు. అలాంటి చోట సాంకేతిక సహాయంతో బాలికలు విద్యావంతులు అయ్యేలా చూడాలన్నారు. తిరుపతిలో నిర్వహిస్తున్న జాతీయ మహిళా సాధికారత సదస్సులో రెండో రోజు ఆయన మాట్లాడారు. మహిళలను సామాజిక, ఆర్థిక, రాజకీయ, క్రీడా రంగాల్లో మరింత ముందుకి తీసుకువచ్చేలా రెండు రోజుల పాటు చర్చలు జరిగాయన్నారు.

‘‘ప్రతి మహిళకు భద్రత, ఆత్మ నిర్భరత అందించాలి. పంచాయతీ స్థాయిలో కంప్యూటర్ సెంటర్ ఉండేలా చూడాలి. ప్రపంచ వ్యాప్తంగా ఐటీ, ఎకనామిక్ రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు. మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యం సాధిస్తే.. భారత్ ఆర్థికంగా వృద్ధి చెందుతుంది. గ్రామంలోని ప్రతి మహిళకు పని కల్పించి, ఆర్థికంగా స్వతంత్రులను చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు, ఈ కమిటీలు ప్రణాళికలు రూపొందించాలి. దేశంలోని ఆఖరి మహిళకు కూడా ఫలితాలు అందేలా ప్రణాళికలు ఉండాలి. పంచాయతీ, మున్సిపాలిటీ నుంచి పార్లమెంట్ వరకు ప్రతి ఒక్కరూ మహిళల వృద్ధి కోసం కృషి చేయాలి. గ్రామీణ స్థాయి నుంచే మహిళల నాయకత్వాన్ని ప్రోత్సహించాలి. అన్ని రాష్ట్రాల్లో విమెన్ కమిటీలు ఏర్పాటు చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థిక, సామాజిక స్వావలంబన సాధించకపోతే మనం వికసిత్ భారత్ కల సాకారం చేసుకోలేం’’ అని ఓం బిర్లా అన్నారు.

# టీడీపీ ఎంపీలే పార్లమెంట్‌లో ఎక్కువ ప్రశ్నలు వేశారు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15, అనంతజనశక్తి న్యూస్

దేశ రాజధాని ఢిల్లీలో తెలుగువాణి బలంగా వినిపిస్తోంది. పార్లమెంట్ సమావేశాల్లో మన ఎంపీలు వివిధ సమస్యలపై ప్రశ్నలు సంధిస్తున్నారు. తమ గళం వినిపిస్తున్నారు. గత ఏడాది కాలంలో జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ ఎంపీలు మొత్తం 1576 ప్రశ్నలు లేవనెత్తారు. ఇందులో అత్యధికంగా తెలుగుదేశం పార్టీ ఎంపీలు 1081 ప్రశ్నలు లేవనెత్తగా.. ఆ తర్వాతి స్థానంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉంది. వైసీపీ తరుపున ఆ పార్టీ ఎంపీలు 267 ప్రశ్నలు పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించారు. ఏపీలోని బీజేపీ ఎంపీలు 134, జనసేన పార్టీ ఎంపీలు 94 ప్రశ్నలు సంధించారు. ఏపీ ఎంపీలు సగటున 71.6 ప్రశ్నలు లేవనెత్తగా.. జాతీయ సగటు కంటే ఈ మొత్తం ఎక్కువ కావటం విశేషం. ఈ విషయంలో జాతీయ సగటు 46.8గా ఉంది.

ప్రశ్నల సగటు పరంగా కూడా టీడీపీ తొలిస్థానంలో ఉంది. టీడీపీ ఎంపీలు 77.2 ప్రశ్నలు అడిగితే, బీజేపీ ఎంపీలు 67.0 , వైసీపీ 66.8, జనసేన 47.0 ప్రశ్నలు లేవనెత్తారు. పాలిటిక్స్ ఫర్ ఇంపాక్ట్ నివేదికలో ఈ విషయం వెల్లడైంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ఎంపీలు 217 పార్లమెంట్ చర్చల్లో పాల్గొన్నారని.. టీడీపీకి చెందిన 14 మంది ఎంపీలు 125 డిబేట్లలో పాల్గొనగా.. వైసీపీ నలుగురు ఎంపీలు 42 డిబేట్లలో, బీజేపీకి చెందిన ఇద్దరు ఎంపీలు 22 డిబేట్లలో పాల్గొన్నారని వెల్లడించింది. మరోవైపు పార్లమెంట్ సమావేశాలకు హాజరు విషయంలోనూ మన ఎంపీలు మెరుగ్గానే ఉన్నారు. ఏపీ ఎంపీల సగటు హాజరు శాతం 83.9గా ఉంది. ఈ విషయంలో జాతీయ సగటు 86.8గా ఉంది. బీజేపీ ఎంపీల హాజరు శాతం87.5గా ఉంటే.. టీడీపీ ఎంపీల హాజరు శాతం 86.2గా ఉంది. జనసేన 82.4 హాజరు శాతం, వైసీపీ ఎంపీల హాజరు శాతం 74.6గా ఉంది.

పాలిటిక్స్ ఫర్ ఇంపాక్ట్ సంస్థ అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఎంపీల జాబితాను కూడా వెల్లడించింది. సభ్యులు అడిగిన ప్రతి ప్రశ్నకు ఒక పాయింట్, పాల్గొన్న ప్రతి డిబేట్‌కు మూడు పాయింట్లు, హాజరుకు 0.5 పాయింట్లు కేటాయించారు. ఈ లెక్కన టీడీపీ పార్లమెంటరీ నేత , నరసరావుపేట ఎంపి లావు కృష్ణదేవరాయలు అగ్రస్థానంలో నిలిచారు, వైసీపీ ఎంపీ మద్దిల గురుమూర్తి రెండవ స్థానంలో, జనసేన ఎంపీ బాలశౌరి మూడవ స్థానంలో నిలిచారు. జీఎం హరీష్ బాలయోగి, కలిశెట్టి అప్పలనాయుడు , టి. కృష్ణప్రసాద్ ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు.



మరోవైపు ఏడాది పార్లమెంట్ సమావేశాల్లో ఏపీ ఎంపీలు 71.6 ప్రశ్నలు లేవనెత్తగా.. విజయనగరం టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అత్యధికంగా ప్రశ్నలు సంధించారు. ఆయన ఒక్కరే పార్లమెంట్ సమావేశాల్లో 89 ప్రశ్నలు అడిగారు. ఆ తర్వాతి స్థానంలో 84 ప్రశ్నలతో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఉన్నారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ 82 ప్రశ్నలు, వైఎస్ అవినాష్ రెడ్డి 80 ప్రశ్నలు అడిగినట్లు పాలిటిక్స్ ఫర్ ఇంపాక్ట్ నివేదిక వెల్లడించింది.

# నిధులు ఎటు దారి మళ్లించాలో సమాధానం చెప్పాలి

- మెడికల్ కాలేజ్ నిర్మిస్తామని రూ. 5 వేల కోట్లు అప్పు

అమరావతి, సెప్టెంబర్ 15, అనంతజనశక్తి న్యూస్

మెడికల్ కాలేజీల వివాదంపై టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఘాటుగా విమర్శలు చేశారు. మాజీ సీఎం జగన్ అన్నట్లుగా రాజమండ్రి మెడికల్ కాలేజీ చూసి ఆహా అనలేమని.. రాజమండ్రిలో ఓహో అనిపించేలా వైసీపీ పార్టీ కార్యాలయం మాత్రం కట్టుకున్నారని ఆరోపించారు. గత జగన్ ప్రభుత్వం మెడికల్ కాలేజ్ నిర్మిస్తామని రూ. 5 వేల కోట్లు అప్పు చేసిందని, ఆ నిధులు ఎటు దారి మళ్లించాలో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రాజమండ్రిలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మీడియాతో మాట్లాడుతూ ప్రైవేటీకరణకు పీపీపీకి మధ్య వ్యత్యాసం తెలియని జగన్ ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఎలా పనిచేశారని విమర్శించారు. పీపీపీ మోడ్ లోనే అనేక అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో మెడికల్ కాలేజీలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే వివరించారు. పీపీపీ మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా మెరిట్ సీట్స్ 42 నుంచి 50 శాతానికి కూటమి ప్రభుత్వం పెంచిందని తెలిపారు. జగన్ ఉన్నప్పుడు 42 శాతం మెరిట్ సీట్లు 50 శాతానికి ఎందుకు పెంచలేదో వైసీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ మాపై బురద చల్లేసి కడుక్కోమంటున్నారని అన్నారు. ఫ్యాక్షన్ తరహాలో మెడికల్ కాలేజీ కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో జగన్ ప్రజల మధ్య ఉండటం శ్రేయస్కరం కాదని, రాష్ట్ర శ్రేయస్సు కోసం జగన్ జైలుకు వెళ్లిపోవడమే మంచిదన్నారు. జగన్ లాగే ఆయన శిష్యులు ఫేక్ మాటలు మాట్లాడుతున్నారని, మాజీ ఎంపీ మార్గాని భరత్ రోజురోజుకీ దిగజారి పోతున్నారని విమర్శించారు.



# సీఎంగా పని చేసినప్పుడు అప్పుడే హ్యాపీ అనిపించింది

అమరావతి, సెప్టెంబర్ 15, అనంతజనశక్తి న్యూస్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సోమవారం ఓ ఆసక్తికరమైన ట్వీట్ చేశారు. 2019 నుంచి 2024 వరకూ వైఎస్ జగన్ ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన సంగతి తెలిసిందే. ఈ ఐదేళ్ల కాలంలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రారంభించారు వైఎస్ జగన్. అలాగే లబ్ధిదారులకు ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా సాయం అందించే ఎన్నో పథకాలను బటన్ నొక్కి నిధులు విడుదల చేశారు. ముఖ్యమంత్రిగా అభివృద్ధి పనులతో పాటుగా వైసీపీ అధినేతగానూ అనేక మరపురాని విజయాలను అందుకున్నారు. అయితే ఐదేళ్ల పాటు సీఎంగా పనిచేసిన సమయంలో తనకు అత్యంత సంతృప్తిని కలిగించిన రోజు ఆ రోజేనంటున్నారు వైఎస్ జగన్. ఈ విషయాన్ని వెల్లడిస్తూ సోమవారం ఓ ట్వీట్ చేశారు.

"ఆంధ్రప్రదేశ్ ప్రజారోగ్య రంగంలో 15 సెప్టెంబర్, 2023 ఒక గొప్ప రోజు. ఒక ముఖ్యమంత్రిగా పరిపాలనా కాలంలో నాకు అత్యంత సంతృప్తిని మిగిల్చిన రోజు. నేను ఒక మంచి పని చేయగలిగానన్న తృప్తి నాకు లభించింది. 1923 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వ రంగంలో కేవలం 12 మెడికల్ కాలేజీలు ఉంటే, ఒక్క మా హయాంలోనే ఒకేసారి 17 మెడికల్ కాలేజీలను సంకల్పించాం. ఇందులో భాగంగా 2023 సెప్టెంబర్ 15న విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల మెడికల్ కాలేజీలను ఒకేసారి ప్రారంభించి ప్రజల ఆరోగ్య పరిరక్షణలో గొప్ప అడుగు ముందుకేశాం."

"ఈ ఐదు కాలేజీల ద్వారా 750 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి తేవడం నాకు సంతోషాన్ని కలిగించింది. వీటితో పాటు పాడేరు, పులివెందుల కాలేజీలను అడ్మిషన్లకు కూడా సిద్ధం చేశాం. మిగిలిన పనులను పూర్తి చేయాల్సిన ఈ ప్రభుత్వం ఆ 10 కాలేజీలను ప్రైవేటుకు కట్టబెట్టేలా నిర్ణయం తీసుకోవడం అత్యంత దారుణం. ప్రజలంతా దీన్ని వ్యతిరేకిస్తున్నారు. తక్షణం ఈ ప్రయత్నాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం." అంటూ వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. ఏపీలో ప్రస్తుతం మెడికల్ కాలేజీల వ్యవహారం అధికార, విపక్షాల మధ్య హాట్ టాపిక్‌గా మారిన సంగతి తెలిసిందే. తమ హయాంలో 17 కాలేజీ నిర్మాణాలను ప్రారంభించామని వైసీపీ చెప్తుంటే.. వాటిలో చాలా పునాదుల దశ కూడా దాటలేదని అధికార టీడీపీ విమర్శిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పీపీపీ పద్ధతిలో మెడికల్ కాలేజీలను అభివృద్ధి చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో.. వాటిని ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారని వైసీపీ ఆరోపిస్తోంది. అయితే వైద్య కళాశాలల అభివృద్ధి కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం చెప్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో వైఎస్ జగన్ ట్వీట్ ఆసక్తికరంగా మారింది.

# మహిళలు ముందుకు వస్తేనే ఏదైనా ప్రాంతం అభివృద్ధి

తిరుపతి, సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్

మహిళలు ముందుకు వస్తేనే ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందుతుందని ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. తిరుపతిలో నిర్వహిస్తున్న మహిళా సాధికార కమిటీల జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. మహిళలను విద్యావంతులను చేయాలని, వారిని ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఈ సదస్సులో చర్చించిన అంశాలు కొత్త దిశను చూపిస్తాయన్నారు. ‘‘మహిళలకు అన్ని రాష్ట్రాల్లో సమాన హక్కులు కల్పించాలి. విద్య, ఉపాధి అవకాశాలు అందించాలి. వారు విద్యావంతులైతే వృద్ధి సాధించగలం. ఏటా ఇలాంటి సమావేశాలు జరగాలని కోరుకుంటున్నాను. 3 ఏళ్లలో ఏపీకి రాజధాని సిద్ధం అవుతుంది. అప్పుడు అమరావతిలోనూ ఈ సదస్సు నిర్వహించే అవకాశం ఇవ్వాలి. అందరం కలిసి నడిస్తేనే మహిళా సాధికారత కార్యరూపం దాలుస్తుంది.’’ అని అయ్యన్నపాత్రుడు తెలిపారు.



# ఎనీ ప్లేస్.. ఎనీ సిట్యుయేషన్ జై కపిధ్వజ్!

పర్వతాలు, అడవులు, నదులు, మంచు లోయలు, నీరు, ఎడారులు, చిత్తడి నేలలు.. ఇలా ఎక్కడికైనా ఆ వాహనం వెళ్లగలదు. ఇన్ని విభిన్న వాతావరణ పరిస్థితుల్లోనూ పనిచేసే సామర్థ్యమున్న ఈ వాహనం పేరు కపిధ్వజ్. ఇటీవలే ఉత్తరాఖండ్, జమ్మూకశ్మీర్, పంజాబ్ వరదల వేళ ఇది వందల మంది ప్రాణాలను కాపాడింది. సహాయక సామగ్రిని చేరవేసింది. మంచుతో కూడిన సియాచిన్, లద్దాఖ్ వంటి పర్వత ప్రాంతాలలో కపిధ్వజ్‌తో భారత సైన్యం ప్రస్తుతం గస్తీ నిర్వహిస్తోంది.



**కపిధ్వజ్‌ను జేఎస్‌డబ్ల్యూ గెకో మోటార్స్ సంస్థ తయారు చేస్తోంది. దీనిలో వినియోగిస్తున్న 90 శాతానికిపైగా భాగాలు భారత్‌లోనే తయారవుతుండటం విశేషం. ఇప్పటివరకు 120 కపిధ్వజ్ వాహనాలను భారత సైన్యం కొనుగోలు చేసింది.**

**కపిధ్వజ్‌లో డ్రైవర్, అసిస్టెంట్ డ్రైవర్‌తో పాటు వెనుక భాగంలో ఏడుగురు కూర్చోవచ్చు. సీట్లను తొలగించి, సామగ్రిని నింపుకోవచ్చు.**

**ఈ వాహనం మైనస్ 40డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతల్లోనూ సౌకర్యవంతంగా పనిచేయగలదు.**

**వెళుతున్న మార్గానికి అనుగుణంగా కపిధ్వజ్ టైర్లలోని గాలిని సర్దుబాటు చేసుకోవాలి. ఇందుకోసం వాహనం నుంచి డ్రైవర్ వెలుపలికి రానవసరంలేదు. లోపలే ఉన్న నాబ్‌తోనే ఈ పని పూర్తిచేయవచ్చు.**

**కపిధ్వజ్ 360డిగ్రీల కోణంలోనూ తిరుగగలదు.**

**ఈ వాహనం బాడీ కింది భాగం పడవలా ఉంటుంది. దీని టైర్లు నీటిలో తెడ్డులా పనిచేస్తాయి. ఇది డీజిల్‌తో నడుస్తుంది. దీని ఇంధన ట్యాంకు సామర్థ్యం 327 లీటర్లు.**

**దీని ఇంజిన్ హార్స్‌పవర్ 55. అంబులెన్స్, అగ్నిమాపక వాహన వెర్షన్‌లనూ జేఎస్‌డబ్ల్యూ గెకో సంస్థ సిద్ధం చేసింది.**

**మోటార్లు బోట్లు వెళ్లలేని చోట్లకూ..**

**"కపిధ్వజ్‌ను ఎడారులు, నదులు, పర్వతాలు, మంచులోయల్లోనూ విజయవంతంగా పరీక్షలు పూర్తిచేశాం. మోటార్ బోట్స్, ట్రాక్టర్లు వెళ్లలేని చోట్లకూ కపిధ్వజ్ వెళ్లగలదు. అందుకే దీని గురించి పారామిలిటరీ, జాతీయ విపత్తు స్పందన దళంతోనూ సంప్రదింపులు జరుపుతున్నాం" అని జేఎస్‌డబ్ల్యూ గెకో మోటార్స్ కంపెనీ డైరెక్టర్ జస్కీరత్ సింగ్ 'ఈటీవీ భారత్' ప్రతినిధికి వివరించారు.**

# డ్రైవర్ కిడ్నాప్.. మరో కేసులో తెరపైకి పూజా ఖేడ్కర్ పేరు

యూపీఎస్సీకి తప్పుడు పత్రాలు సమర్పించి ఐఏఎస్ ఉద్యోగం కోల్పోయిన పూజా ఖేడ్కర్ మరో వివాదంలో చిక్కుకున్నారు. ఓ ట్రక్కు డ్రైవర్‌ను కిడ్నాప్ చేసిన కేసులో ఆమె పేరు మళ్లీ బయటకు వచ్చింది. నవీ ముంబయిలోని ఎరోలీ సిగ్నల్ వద్ద కాంక్రీట్ మిక్సర్ ట్రక్, కారు ఢీకొన్నాయి. ఆ సమయంలో ప్రహ్లాద్‌కుమార్ అనే డ్రైవర్ ట్రక్కును నడిపాడు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే ప్రహ్లాద్‌ను ఇద్దరు వ్యక్తులు బలవంతంగా కారులో తీసుకెళ్లారని పోలీసులు తెలిపారు. విచారణ చేపట్టగా డ్రైవర్ పుణెలోని చతుశృంగి ప్రాంతంలో ఉన్నట్లు తేలిందని వెల్లడించారు. అతడి కోసం పూజా ఖేడ్కర్ ఇంటికి వెళ్లగా.. ఆమె తల్లి నుంచి తమకు ప్రతిఘటన ఎదురైందని పేర్కొన్నారు. మనోరమ ఖేడ్కర్ తమ విధులకు ఆటంకం కలిగించిందన్నారు. ఇంటి తలుపులు తెరవలేదని ఆరోపించారు. దీంతో ఆమెకు సమన్లు జారీ చేశారు. తదుపరి విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు రావాలని కోరారు.



పుణె లో ట్రైనీ సహాయ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో పూజా ఖేడ్కర్ పై అధికార దుర్వినియోగంతో పాటు యూపీఎస్సీలో తప్పుడు అఫిడవిట్ పత్రాలు సమర్పించారనే ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టిన యూపీఎస్సీ .. ఆమెను ముస్సోరిలోని లాల్‌బహదూర్ శాస్త్రి జాతీయ అకాడమీకి తిరిగి రావాలని ఆదేశించింది. నకిలీ పత్రాలతో పరీక్షను క్లియర్ చేసినట్లు గుర్తించిన యూపీఎస్సీ దానిపై వివరణ ఇవ్వాలని ఆమెకు షోకాజ్ నోటీసులిచ్చింది. తనపై ఫోర్జరీ కేసు నమోదు చేయడంతో పాటు అభ్యర్థిత్వాన్ని రద్దు చేయడంతో ఆమె హైకోర్టును ఆశ్రయించారు. తాను ఏ పత్రాలను ఫోర్జరీ చేయలేదని తెలిపారు. యూపీఎస్సీకి తనపై అనర్హత వేటు వేసే అధికారం లేదని వాదించినప్పటికీ.. ఆమెకు నిరాశే ఎదురైంది. గతేడాది ఆగస్టులో ఆమె ముందస్తు బెయిల్‌కు హైకోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం ఆమెకు మధ్యంతర రక్షణ కల్పిస్తూ వచ్చింది. ఈ కేసుపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.

# మావోయిస్టు సీనియర్ కమాండర్ సహదేవ్ ఎన్‌కౌంటర్..!

మావోయిస్టు లకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ సంస్థకు చెందిన ముగ్గురు మావోయిస్టులను ఝార్ఖండ్ లో హజారీబాగ్ జిల్లాలో భద్రతా దళాలు ఎన్‌కౌంటర్ చేశాయి. వీరిలో సీనియర్ కమాండర్ సహదేవ్ సోరెన్ కూడా ఉన్నారు.

209 బెటాలియన్ కోబ్రా దళాలు గోర్హర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పంతిత్రి అడవుల్లో జాయింట్ ఆపరేషన్ చేపట్టగా ఈ ఘటన చోటుచేసుకొంది. సహదేవ్ సోరెన్ ను మావోయిస్టు కేంద్రకమిటీ సభ్యుడిగా భావిస్తున్నారు. ఆయనపై రూ.1 కోటి రివార్డు ఉంది. ఇక మరో మావోయిస్టు రఘునాథ్ హేమంబరం స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడు. అతడిపై రూ.25 లక్షల బహుమతి ఉంది. ఇక జోనల్ కమిటీ సభ్యుడు విర్సెన్ గంజూ కూడా వీరిలో ఉన్నాడు. అతడిపై ప్రభుత్వం రూ.10లక్షల బహుమతిని ప్రకటించింది.

ఈ ఎన్‌కౌంటర్ సందర్భంగా తాము మూడు ఏకే 47 రైఫిళ్లను స్వాధీనం చేసుకొన్నట్లు వెల్లడించారు.



భద్రతా దళాలు ఆ ప్రదేశంలో కూంబింగ్‌ను కొనసాగిస్తున్నాయి.

జులైలో ఓ కోబ్రా జవాన్ హత్యలో సహదేవ్ పేరు వచ్చింది. నాడు బొకారో పోలీసులు చేపట్టిన సెర్చి ఆపరేషన్ సందర్భంగా తగిలిన తూటా గాయానికి అతడు మరణించాడు. తాజాగా ఈ ముగ్గురు మావో నేతలు ఏదో పెద్ద ఆపరేషన్‌కు ప్లాన్ చేస్తున్నట్లు ఎస్పీ హర్వీందర్ సింగ్ వెల్లడించారు.

సెప్టెంబర్ 7వ తేదీన జరిగిన ఓ ఆపరేషన్‌లో మావోయిస్టుల సీనియర్ నాయకుడు అమిత్ హన్స్‌డా మరణించాడు. జోనల్ కమాండర్ అయిన అతడిపై రూ.10 లక్షల రివార్డు ఉంది. మొత్తం 95 కేసుల్లో అతడు నిందితుడు. వీటిల్లో చాలామంది పోలీసులు, పౌరుల హత్యలు ఉన్నాయి.

మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లో కూడా మావోయిస్టుల ఏరివేత శరవేగంగా జరుగుతోంది. కొన్ని రోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో అగ్రనేతలు మోడెం బాలకృష్ణ, అల్వాల్ చంద్రహాస్ సహా 10 మందిని ఎన్‌కౌంటర్ చేశారు.

# ఏఐ కంటెంట్ క్రియేటర్లకు

## లైసెన్స్‌లు అవసరం: పార్లమెంట్ సంఘం

కృత్రిమేధ సాయంతో కంటెంట్ క్రియేట్ చేసేవారు కచ్చితంగా లైసెన్స్‌లు తీసుకోవాలని పార్లమెంటరీ ప్యానల్ సూచించింది. దీంతో ఏఐ ఆధారిత వీడియోలు, కంటెంట్‌కు అనుమతులు తప్పనిసరిగా మారే అవకాశం ఉంది. తీవ్రస్థాయిలో వ్యాపిస్తున్న తప్పుడు వార్తలను అడ్డుకోవడానికి ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఈ నివేదికను ఇచ్చింది. దీనికి భాజపా ఎంపీ నిషికాంత్ దుబే అధ్యక్షత వహిస్తున్నారు. ఇలాంటి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే సంస్థలు, వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకొనే మార్గాలను కోరింది. ఈ కమిటీ ఇటీవలే తమ ముసాయిదా నివేదికను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పించింది. వచ్చే సీజన్ సమావేశాల్లో దీనిని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. సమాచార, ఎలక్ట్రానిక్ఐటీ మంత్రిత్వశాఖలు సహా.. ఇతర మంత్రులు, విభాగాల మధ్య బలమైన సమన్వయం అవసరమని పేర్కొన్నారు. ఇప్పటికే డీఫ్ ఫేక్ టెక్నాలజీ నుంచి వచ్చే సమస్యలను అధ్యయనం చేయడానికి ఎలక్ట్రానిక్ఐటీ మంత్రిత్వశాఖ తొమ్మిది మంది సభ్యులతో కూడిన సంఘాన్ని ఏర్పాటుచేసింది. డీఫ్ ఫేక్ స్పీచ్, వీడియోలు, వాయిస్ గుర్తించేందుకు వీలుగా రెండు ప్రాజెక్టులు మొదలైనట్లు ఈ నివేదిక వెల్లడించింది. ప్రజలు, ప్రజాస్వామ్యానికి ఫేక్ న్యూస్ తీవ్రమైన ముప్పుగా మారాయని కమిటీ అభిప్రాయపడింది.



## ఆస్ట్రేలియాలో ఉద్యోగం ఇస్తామని చెప్పి..



# ఇరాన్‌లో భారతీయుడికి చిత్రహింసలు

ఆస్ట్రేలియాలో ఉద్యోగం వస్తుందనే ఆశతో వెళ్లిన వ్యక్తిని ఇరాన్‌లో ఓ ముఠా కిడ్నాప్ చేసింది. రూ.20 లక్షలు చెల్లించి అతడిని విడిపించుకున్నామని బాధిత కుటుంబం మీడియాకు తెలిపింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. కేరళకు చెందిన బాధితుడు హిమాన్షు మాథుర్ ఉద్యోగం కోసం తొలుత అమన్ రాఠీని కలిశాడు. హరియాణా లోని కర్నాల్‌లో ఇమిగ్రేషన్ సేవలు అందిస్తున్నట్లు అమన్ తనను తాను పరిచయం చేసుకున్నాడు. కంటిన్యూస్ డిశ్చార్జి సర్టిఫికెట్ కోర్సు చేస్తే షిప్పింగ్ జాబ్ వస్తుందని అమన్, మాథుర్‌ను నమ్మించాడు. దాంతో ఆస్ట్రేలియాలో వర్క్ వీసాకు మార్గం సుగమం అవుతుందని చెప్పాడు. ఈ మాటలు నమ్మి మాథుర్ నోయిడాలో కోర్సు కూడా పూర్తిచేశాడు.

ఆగస్టు ప్రారంభంలో మళ్లీ అమన్, మాథుర్‌ను సంప్రదించాడు. తాను ఇండోనేసియాలో ఉన్నానని, రూ.19 లక్షలకు వీసా ఇవ్వడానికి ఓ ఏజెంట్ సిద్ధంగా ఉన్నట్లు తెలిపాడు. దీంతో మాథుర్ దిల్లీనుంచి బయల్దేరి జకార్తా వెళ్లాడు. అక్కడ పానిపట్‌కు చెందిన మరో వ్యక్తి విశాల్‌ను కలుసుకున్నాడు. ఆగస్టు 9న కర్నాల్‌కు చెందిన తమ మనిషి వస్తాడని, అతడికి రూ.12 లక్షలు ఇవ్వాలని కోరారు. మిగిలిన రూ.7 లక్షలు తర్వాత ఇవ్వమని చెప్పారు. మూడు వారాల తర్వాత మాథుర్, అమన్, విశాల్ జకార్తా నుంచి దిల్లీకి తిరిగొచ్చారు. ఒప్పందం మేరకు ఆగస్టు 29న అమన్‌తో కలిసి మాథుర్ టెహ్రాన్ బయల్దేరాడు. అక్కడి నుంచి ఆస్ట్రేలియా కు పంపిస్తారేమోనని అతడు భావించాడు. అయితే, అనూహ్యంగా వీరిని ఓ గ్యాంగ్ కిడ్నాప్ చేసి చాబహార్ తీసుకెళ్లింది. మాథుర్‌ను అక్కడ పరిచయం చేసుకున్న ఏజెంట్ మిథు కూడా ఆ కిడ్నాప్ గ్యాంగ్‌లో ఓ భాగమని పోలీసులు తెలిపారు.



'మమ్మల్ని మెటల్ పైపులతో కొట్టారు. అడిగినంత డబ్బులు ఇవ్వకపోతే చంపి అవయవాలు విక్రయిస్తామని బెదిరించారు' అని మాథుర్ వాపోయినట్లు పోలీసులు పేర్కొన్నారు. మాథుర్‌ను హింసిస్తున్న సమయంలో కిడ్నాపర్లు అతడి సోదరుడు డింపీకి కూడా వీడియో కాల్స్ చేశారు. రూ.కోటి డిమాండ్ చేసి చివరకు రూ.20 లక్షలు తీసుకొని బాధితుడిని విడుదల చేయడానికి అంగీకరించారు. ఆ మొత్తాన్ని జలంధర్‌లో మరో వ్యక్తికి బాధిత కుటుంబం అందజేసింది. దీంతో కిడ్నాప్ గ్యాంగ్ మాథుర్, అమన్‌లను చాబహార్ ఎయిర్‌పోర్టు దగ్గర వదిలిపెట్టింది. సెప్టెంబర్ 7న వారు దిల్లీ చేరుకున్నారు. మాథుర్ ఘటన నుంచి కోలుకోలేకపోతున్నాడని పోలీసులు తెలిపారు.

## బెట్టింగ్ యాప్ కేసు.. ఈడీ విచారణకు

# హాజరైన మిమి చక్రవర్తి

బెట్టింగ్ యాప్స్ వ్యవహారం ప్రస్తుతం దేశవ్యాప్తంగా దుమారం రేపుతోంది. బెట్టింగ్ యాప్‌స్‌ను ప్రమోట్ చేసిన కారణంగా ఇప్పటికే పలువురు సెలబ్రిటీలు విచారణ ఎదుర్కొన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ కేసులో బెంగాల్ నటి, టీఎంసీ మాజీ ఎంపీ మిమి చక్రవర్తి ఈడీ ఎదుట విచారణకు హాజరయ్యారు. సోమవారం ఉదయం ఢిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయానికి వెళ్లిన మిమి చక్రవర్తి.. అధికారుల ముందు విచారణకు హాజరయ్యారు. మిమి చక్రవర్తితో పాటూ బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలాకు ఈడీ నోటీసులు జారీ చేసింది. మిమి చక్రవర్తిని ఈ నెల 15న, ఊర్వశిని ఈ నెల 16న ఢిల్లీలోని కార్యాలయంలో విచారణకు హాజరుకావలని ఆదేశించింది. వీరిద్దరూ ప్రముఖ బెట్టింగ్ యాప్ 1xBetకు ప్రచారం చేసినట్టు భావిస్తున్నారు. ఈడీ నోటీసుల మేరకు మిమి చక్రవర్తి ఇవాళ విచారణకు హాజరయ్యారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేంద్ర దర్యాప్తు సంస్థ నటి వాంగ్మూలాన్ని నమోదు చేయనున్నది.

అక్రమ బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన కేసులను ఈడీ దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. బెట్టింగ్ యాప్స్ చాలా మంది వ్యక్తులతో పాటు పెట్టుబడిదారులను రూ.కోట్లల్లో మోసం చేయడంతో పాటు భారీ మొత్తంలో పన్ను ఎగవేసినట్లు ఆరోపణలున్నాయి. ఇక నిషేధిక బెట్టింగ్ యాప్‌స్‌ను ప్రమోట్ చేసిన కారణంగా ఇప్పటికే పలువురు టాలీవుడ్, బాలీవుడ్ సెబ్రిటీలు కూడా విచారణకు హాజరైన విషయం తెలిసిందే. టాలీవుడ్ సినీ ప్రముఖుల పేర్లు వినిపించాయి. విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, ప్రకాశ్ రాజ్, మంచు లక్ష్మి సైతం విచారణకు హాజరయ్యారు. ఇదే కేసులో మాజీ క్రికెటర్లు శిఖర్ ధావన్, హర్భజన్‌సింగ్, యువరాజ్‌సింగ్, సురేశ్ రైనాలను సైతం ఈడీ విచారించింది. శిఖర్‌ను ఈ నెల 4న ఈడీ ఎనిమిది గంటల పాటు విచారించింది.


## 15 రోజుల పసికందును

# సజీవంగా పాతిపెట్టారు



లక్నో: రోజుల పసికందును సజీవంగా పాతిపెట్టారు. పసిబిడ్డ ఏడ్పు, చేయి కదలడాన్ని ఒక వ్యక్తి గమనించాడు. పోలీసులకు అతడు సమాచారం ఇచ్చాడు. దీంతో వారు అక్కడకు చేరుకుని ఆ పసిబిడ్డను కాపాడారు. ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం మధ్యాహ్నం గోడాపూర్ గ్రామంలోని చెట్ల పొదల్లో 15 రోజుల పసికందును సజీవంగా పాతిపెట్టారు. చెట్ల మధ్యలో ఉన్న నేల నుంచి కదులుతున్న శిశువు చేతిని ఒక వ్యక్తి గమనించాడు. ఆ పసిబిడ్డ ఏడుపు కూడా విన్నాడు. పోలీసులకు సమాచారం ఇచ్చాడు. కాగా, పోలీసులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. నేలలో సజీవంగా పాతిపెట్టిన ఆడ బిడ్డను బయటకు తీసి రక్షించారు. శ్వాస తీసుకోవడం గమనించి తొలుత స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి, ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌కు తరలించారు. దీంతో డాక్టర్లు ఐసీయూలో అడ్మిట్ చేసి చికిత్స అందిస్తున్నారు. పసిబిడ్డ ఆరోగ్యాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా డాక్టర్ల బృందాన్ని ఏర్పాటు చేశారు. మరోవైపు ఆడ బిడ్డను సజీవంగా పాతిపెట్టిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ రాజేష్ ద్వివేది తెలిపారు. ఆ శిశువు తల్లిదండ్రులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. పసికందును సజీవంగా పాతిపెట్టిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# అందుకే ఆ పెద్దాయన అప్లికేషన్ తీసుకోలేదు: కేంద్ర మంత్రి సురేశ్ గోపి



**ఇటీవల కేరళలో జరిగిన ఓ ర్యాలీలో ప్రముఖ నటుడు, కేంద్ర మంత్రి సురేశ్ గోపి ని సాయం కోరుతూ ఓ వృద్ధుడు అప్లికేషన్ ఇవ్వబోయాడు. కాగా తనకు ఇల్లు కావాలంటూ అతడు ఇచ్చిన అప్లికేషన్ పత్రాన్ని మంత్రి తిరస్కరించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సురేశ్ గోపిపై నెటిజన్లు విమర్శలు గుప్పించారు. తాజాగా ఈ విషయంపై కేంద్ర మంత్రి స్పందించారు. ప్రజాప్రతినిధిగా తాను ఎటువంటి పనులు చేయగలను, ఎటువంటివి చేయలేను అనే విషయాలపై తాను ఎల్లప్పుడూ స్పష్టతతో ఉంటానని అన్నారు.**

**అసలేమయ్యిందంటే?**

**సెప్టెంబర్ 12న త్రిసూర్‌లో జరిగిన ఓ బహిరంగ కార్యక్రమంలో కేంద్ర మంత్రి సురేశ్ గోపి పాల్గొన్నారు. ఆ సమయంలో వేలాయుధన్ అనే వృద్ధుడు ప్రభుత్వం నుంచి తనకు ఇల్లు మంజూరయ్యేలా సాయం చేయాలని అభ్యర్థిస్తూ.. కేంద్ర మంత్రికి అప్లికేషన్ ఇవ్వడానికి ప్రయత్నించాడు. అయితే వృద్ధుడి అప్లికేషన్‌ను తీసుకోవడానికి సురేశ్‌గోపి నిరాకరించారు. ఈ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అదికాస్త వైరల్‌గా మారింది. ప్రజల సమస్యలను పట్టించుకోవట్లేదని నెటిజన్లు ఆయనపై విమర్శలు గుప్పించారు.**

**తాజాగా ఈ విషయంపై సురేశ్ గోపి మాట్లాడుతూ.. తాను నిలబెట్టుకోలేని అబద్ధపు హామీలు ప్రజలకు ఇవ్వలేనని అన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించిన విషయాలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి వచ్చే అంశాలు కాబట్టి.. ఆ వృద్ధుడి నుంచి అప్లికేషన్ తీసుకోలేదని తెలిపారు. కొన్ని పార్టీలు ఈ వీడియోను రాజకీయ స్వార్థం కోసం ఉపయోగించుకుంటున్నాయని మండిపడ్డారు. అయితే ఆ వృద్ధుడి కుటుంబానికి ఇల్లు ఇప్పిస్తామని మరో పార్టీ ముందుకురావడం సంతోషకరమైన విషయమన్నారు. దానివెనక రాజకీయ ఉద్దేశాలు ఉన్నా వారికి సొంత ఇల్లు ఇవ్వడం ముఖ్యమన్నారు.**




# నెతన్యాహు... నేటికాలపు హిట్లర్!

కాల్పుల విరమణ ఒప్పందంపై ఖతార్‌లో చర్చలు జరుపుతున్న హమాస్ నేతల మీద ఇజ్రాయెల్ ఇటీవల దాడి చేయడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఇండియాతో పాటు ప్రపంచ దేశాలెన్నో దీన్ని ఖండించాయి. పాలస్తీనా విషయంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అత్యంత అమానవీయంగా ప్రవర్తిస్తున్నారు.

పాలస్తీనా పట్ల ఆది నుంచి ఇజ్రాయెల్ అన్యాయంగానే ప్రవర్తిస్తోంది. దాని దురాగతాలు మరింత పెరిగిపోవడంతో ఇప్పటిదాకా రాజకీయ గుర్తింపు కోసం పోరాడుతున్న పాలస్తీనీయులు ప్రస్తుతం తమ ఉనికిని నిలుపుకోవడానికి నానా అగచాట్లు పడాల్సి వస్తోంది. ఇజ్రాయెల్ సైనిక దళాలు ఇప్పటికే గాజాలో వేల మందిని పొట్టనపెట్టుకున్నాయి. ఇటీవల అవి నాసర్ ఆస్పత్రిపై చేసిన దాడిలో అయిదుగురు పాత్రికేయులు ప్రాణాలు కోల్పోవడం అందరినీ దిగ్భ్రాంతపరచింది. 2023 అక్టోబర్‌లో హమాస్‌పై యుద్ధం మొదలుపెట్టినప్పటి నుంచి ఇజ్రాయెల్ 270 మందికి పైగా పాత్రికేయులు, మీడియా సిబ్బంది ప్రాణాలు తీసింది. నాసర్ ఆస్పత్రి ఘటనను నెతన్యాహు ఒక దురదృష్టకర సంఘటనగా తేల్చేశారు. వాస్తవానికి హమాస్‌ను అంతమొందించే లక్ష్యంలో ఇప్పటిదాకా 64 వేల మందికి పైగా అమాయక పాలస్తీనీయులను ఊచకోత కోసిన నెతన్యాహు నుంచి పశ్చాత్తాపం ఆశించడం అమాయకత్వం అవుతుంది. ఆహార సరఫరాలను ఇజ్రాయెల్ నిర్దాక్షిణ్యంగా తొక్కిపట్టడం వల్ల గాజాలో అయిదు లక్షల మందికి పైగా ఆకలి కేకలతో అల్లాడుతూ చావుకు చేరువవుతున్నారు. ఇలాంటి దారుణ వాస్తవాలను బయటపెడుతున్న ఐరాస నివేదికలనూ నెతన్యాహు కొట్టిపారేస్తున్నారు.

**అమెరికా విపరీత వైఖరి**

గాజాలో ఎన్నో ఆస్పత్రులపై నెతన్యాహు బాంబులు కురిపించారు. అక్కడ దారుణమైన యుద్ధనేరాలెన్నింటికో పాల్పడ్డారు. వీటన్నింటిపై నెతన్యాహును ప్రశ్నిస్తున్నవారెవరూ లేరు. గాజాలో హతులైన వారిలో అత్యధికులు అన్నెంపున్నెం ఎరుగని చిన్నారులు, మహిళలు. తలలు లేని వారి శరీరాలు చెల్లాచెదురుగా పడి, శిథిలాల కింద కుళ్లిపోతూ స్థానిక వీధుల్లో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. ఇజ్రాయెల్ నిర్బంధకాండ వల్ల గాజా జనాభాలో 90శాతం ఇప్పటికే శరణార్థులయ్యారు. ఎప్పుడు ఎటువైపు నుంచి ఏ బాంబు వచ్చి మీద పడుతుందో తెలియని దయనీయావస్థలో వారికి ఎక్కడా కనీస భద్రతన్నదే కరవైంది. పాలస్తీనాను ప్రస్తుతం ఐరాస 193 సభ్యదేశాల్లో 147 గుర్తించాయి. తాజాగా పాలస్తీనాకు మద్దతుగా ఐరాస జనరల్ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానానికి అనుకూలంగా ఇండియాతో సహా 142 దేశాలు ఓటేశాయి. అది హర్షణీయమే కానీ, గాజాలో ఇజ్రాయెల్ ఎడతెగని రక్తపాతానికి పాల్పడుతుంటే శక్తిమంతమైన దేశాలు కొన్ని కిమ్మనకుండా ఉండటం మాత్రం దిగ్భ్రాంతి కలిగిస్తుంది. ముఖ్యంగా అమెరికా ఇజ్రాయెల్‌కు దండిగా ఆయుధ సాయం అందిస్తోంది. పాలస్తీనియన్లపై దురాగతాలకు టెల్‌అవీవ్‌ను మరింత ఎగదోస్తోంది. అగ్రరాజ్యం అలా నెతన్యాహుకు వెన్నుదన్నుగా ఉంటున్నప్పటికీ పాలస్తీనాలో ఆకలి కేకలు, దిగజారుతున్న పరిస్థితులను చూసి చాలా దేశాల్లో క్రమంగా చలనం వస్తోంది. వాటి రాతి గుండెలు కరగడం మొదలైంది. స్థానిక ప్రజా సమూహాల నుంచి వస్తున్న ఒత్తిళ్ల నేపథ్యంలో పలు దేశాలు పాలస్తీనా విషయంలో వాటి విధానాలను సవరించుకోవడానికి సిద్ధమయ్యాయి. ఐరాస సర్వసభ్య సమావేశంలో పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తిస్తామని ముందే చెప్పిన ఫ్రాన్స్- తాజా యూఎన్ భేటీలో 'న్యూయార్క్ డిక్లరేషన్'ను తానే ప్రవేశపెట్టింది. కాల్పుల విరమణకు అంగీకరించి, రెండు దేశాల పరిష్కారానికి ఇజ్రాయెల్ అంగీకరించాలని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ సైతం గతంలో స్పష్టం చేశారు. ఆస్ట్రేలియా, జపాన్, కెనడాలు కూడా అదే చెబుతున్నాయి. స్పెయిన్, ఐర్లాండ్, నార్వే, స్లొవేనియా వంటి ఐరోపా దేశాలు ఇప్పటికే పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించాయి. పాలస్తీనా విషయంలో ఫ్రాన్స్ తన వైఖరిని మార్చుకుంటే, అమెరికా మాత్రం ఐరాస సదస్సుకు ముందు పాలస్తీనియన్ లిబరేషన్ ఆర్గనైజేషన్, పాలస్తీనియన్ అథారిటీ సభ్యులకు వీసాలు తిరస్కరించడం విస్తుగొలుపుతోంది. పాలస్తీనీయుల స్వరాన్ని బలవంతంగా నొక్కేస్తున్న తీరుకు ఇది అద్దంపడుతుంది.

**చారిత్రక తప్పిదాల ఫలితం**

పాలస్తీనా సార్వభౌమత్వాన్ని గుర్తించడానికి పలు అగ్రరాజ్యాలు ఎందుకు వెనకడుగు వేస్తున్నాయి? అప్పట్లో యూదులపై నాజీల మారణకాండను నిలువరించలేకపోవడాన్ని దోషంగా భావించి ఇప్పుడు అవి ఇజ్రాయెల్ పట్ల సానుభూతి ప్రదర్శిస్తున్నాయా అన్న సందేహం కలుగుతుంది! గతంలో యూదుల మాదిరిగా పాలస్తీనీయులు ఇప్పుడు నరకబాధలు అనుభవిస్తుంటే, చూసీచూడనట్లు వ్యవహరించడాన్ని సంపన్న రాజ్యాలు ఎలా సమర్థించుకుంటాయి? మొదటి ప్రపంచ యుద్ధం అనంతరం ఒట్టొమన్ సామ్రాజ్యం కూలిపోయిన తరవాత పాలస్తీనా నియంత్రణను బ్రిటన్ తన చేతుల్లోకి తీసుకుంది. 1917లో బాల్ఫోర్ ఒప్పందం ప్రకారం పాలస్తీనాలో యూదులకు ప్రత్యేక భూభాగం కేటాయించడానికి బ్రిటన్ అంగీకరించింది. దాంతో యూదులు, అరబ్ ప్రజల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 1922 నుంచి 1947 దాకా పాలస్తీనా యూకే ఏలుబడిలో ఉంది. ఐరాస తీర్మానం మేరకు 1948లో పాలస్తీనాను విభజించి ప్రత్యేక యూదు, అరబ్ దేశాలు ఏర్పాటు చేయాలని యూకే నిర్ణయించింది. అది యూదులు, అరబ్బుల మధ్య యుద్ధానికి దారితీసింది. 1948 నుంచి ఇజ్రాయెల్ ఉనికిలోకి వచ్చింది. అయితే, ఐరాస నుంచి ప్రత్యేక దేశం గుర్తింపు కోసం పాలస్తీనా ఇప్పటికీ ఎదురు చూస్తోంది. 2012లో అది పరిశీలక హోదా పొందింది. స్వాతంత్ర్యం, అంతర్జాతీయ గుర్తింపు దక్కించుకోవాలన్న పాలస్తీనా ఆకాంక్ష నేటికీ సాకారం కాలేదు. ఇండియా, పాలస్తీనాల విభజన విషయంలో యూకే ఘోరమైన తప్పిదాలు చేసింది. ఆ భయంకర పరిణామాలను నేటికీ ఇరు ప్రాంతాలు చవిచూస్తున్నాయి.

పాలస్తీనా దుస్థితి మారాలంటే అందరూ దాన్ని ప్రత్యేక దేశంగా గుర్తించాలి. ఐరాసలో పూర్తిస్థాయి సభ్యత్వం కల్పించాలి. ఇజ్రాయెల్, పాలస్తీనా రెండు చోట్లా సామాన్యులు శాంతిని, తాము చట్టబద్ధంగా నివసించడానికి ఒక ప్రదేశాన్ని కోరుకుంటున్నారు. ఇవేవీ పట్టించుకోకుండా తన పదవిని కాపాడుకోవడానికి యుద్ధాన్ని పొడిగిస్తూ మరో హిట్లర్‌లా తయారైన నెతన్యాహును అన్ని దేశాల నేతలు నిలువరించాలి. గాజాలో దారుణాలకు ఆయననే బాధ్యుణ్ని చేయాలి.




# భారతావనిలో వాణిజ్య స్ఫూర్తి

చదువు పూర్తయ్యాక ఎక్కడ పని చేయాలనుకుంటున్నారని అడిగితే- అమెజాన్, మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్ వంటి సంస్థల పేర్లు చెబుతుంటారు విద్యార్థులు. వాటిలో భారతీయ కంపెనీలు పెద్దగా లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. అంతర్జాతీయ సంస్థలు తప్ప, ఉద్యోగం చేయడానికి మన దేశంలో వేరే కంపెనీలే లేవన్నట్లు భావిస్తోంది నవతరం. భారతదేశ వాణిజ్య చరిత్ర, పారిశ్రామిక పాటవం పట్ల సరైన అవగాహన లేకపోవడమే నేటి తరం ఆలోచనకు ప్రధాన కారణం. భారతావనిలో వాణిజ్య స్ఫూర్తి ఈనాటిది కాదు. ప్రాచీన కాలంలోనే భారతీయ వర్తకులు సముద్రాలను దాటి గ్రీస్, రోమ్, చైనా, అరేబియాలతో పాటు మధ్య, దక్షిణ, తూర్పు ఆసియా ప్రాంతాలకు వెళ్లి వాణిజ్య వ్యవహారాలు సాగించేవారు. తమిళనాడులోని అరికమేడు వంటి రేవుల దగ్గర ప్రాచీన రోమ్‌తో వాణిజ్యం జరిపిన ఆనవాళ్లే అందుకు నిదర్శనం. ఇప్పటి బహుళజాతి సంస్థల మాదిరిగా అలనాటి భారతీయ వర్తక సంఘాలు విదేశాల్లోనూ ఆర్థిక ప్రభావం చూపేవి. సొంతంగా సైన్యాన్ని సమకూర్చుకునేవి. ఐరోపా దేశాలు మనల్ని పాలించడానికి ముందే భారతీయ వ్యాపారులు అంతర్జాతీయ వాణిజ్యాన్ని నడిపించేవారని ప్రముఖ ఆర్థికవేత్త, చరిత్రకారుడు సంజీవ్ సన్యాల్ అంటారు. అలాంటి లోకవ్యాప్తమైన




**వాణిజ్యం కోసం దక్షిణ భారతంలో అద్భుతమైన నౌకా నిర్మాణ సంప్రదాయం సైతం ఉండేది. ఎక్కడా మేకులు వాడకుండా కేవలం కట్టె, తాళ్లతోనే ధృఢమైన ఓడలను నిర్మించే పద్ధతిని అనుసరించేవారు. అత్యాధునిక సాంకేతికతలు అందుబాటులో ఉన్న నేటి కాలంలో అటువంటి నౌకా నిర్మాణం అసంభవమనిపిస్తుంది.**

**దురాగతాలతో అడ్డగించినా...**

దేశంలో 19వ శతాబ్దపు తొలినాళ్లలో పార్సీ సమాజానికి చెందిన అర్దేషిర్ కర్సెట్జీ అనే వ్యాపారవేత్త ఆధునిక యుగపు భారతీయ నౌకా నిర్మాణానికి పునాది వేశారని చెప్పుకోవచ్చు. అలాగే 1906లో తమిళనాడుకు చెందిన చిదంబరం పిళ్లై అనే వ్యాపారి, స్వాతంత్ర్య సమరయోధుడు తూత్తుకుడిలో ఓడల సంస్థను స్థాపించాడు. నౌకాయానంలో బ్రిటిష్ ఆధిపత్యానికి ఎదురొడ్డిన ఆ సంస్థ వాణిజ్య రంగంలో ఆ రోజుల్లోనే 'ఆత్మనిర్భరత'కు సంకేతంగా నిలిచింది.

ఆంగ్లేయుల ఏలుబడిలో దుర్భర పరిస్థితుల్లోనూ కొందరు భారతీయ వ్యాపారులు ఎంతో పాటవాన్నీ దూరదృష్టినీ ప్రదర్శించి మన వాణిజ్య వైభవానికి గట్టి పునాదులు వేశారు. అలాంటి వారిలో ముందుగా చెప్పుకోవాల్సిన వ్యక్తి జంషెడ్జీ టాటా. నాటి కాలంలోనే ఎన్నో భారతీయ సమాజాలు బలమైన వాణిజ్య సంప్రదాయానికి బాటలు వేశాయి. టాటా, బిర్లా, బజాజ్, గోద్రెజ్, వాడియా, కిర్లోస్కర్ వంటి పేర్లు బ్రిటిష్‌కాలం నుంచీ భారతీయ వాణిజ్య రంగాన్ని ఏలిన వంశనామాలుగా చరిత్రలో నిలిచిపోయాయి.

భారతదేశానికి ఆంగ్లేయులు రాకముందు ప్రపంచ జీడీపీలో ఇండియా వాటా 27శాతంగా ఉండేదని ఆంగస్ మాడిసన్ అనే బ్రిటిష్ ఆర్థికవేత్త పేర్కొన్నారు. అంతటి వాణిజ్య వైభవం తాలూకా మూలాలు నేటికీ కొన్ని సంప్రదాయ ఉత్పత్తుల్లో కనిపిస్తాయి. వాటిలో ముఖ్యమైనవి చేనేత వస్త్రాలు. బెంగాల్ మల్సిన్ వస్త్రాలు ఎంత తేలిగ్గా, నాజూగ్గా ఉండేవంటే... వాటిని బ్రిటిష్ వారు 'అల్లిన అనిలం' అనేవారు. బ్రిటన్‌లో అప్పుడప్పుడే పారిశ్రామిక విప్లవం పుంజుకుంటున్న రోజుల్లో, అక్కడి వస్త్ర మిల్లులతో బెంగాల్ చేనేత కర్మాగారాలు పోటీ పడుతున్నాయని భయపడిన బ్రిటిష్ అధికారులు మన నేతకార్మికుల బొటన వేళ్లను నరికేశారు! ఇలాంటి దురాగతాలెన్నో సాగించి, భారతీయ వాణిజ్య సంస్థలనూ స్ఫూర్తినీ నాశనం చేయడానికి ప్రయత్నించారు. వాటన్నింటినీ ఎదుర్కొని భారతీయ సాంప్రదాయక వ్యాపారులు అనేక రంగాల్లో శతాబ్దాలపాటు ప్రతిభ కనబరుస్తూ వచ్చారు. అలాంటి వాటిలో అద్దకం(బెంగాల్, బిహార్, తమిళనాడు), తేయాకు(డార్జీలింగ్, అస్సాం, మున్నార్), కాఫీ(కూర్గ్), సుగంధ ద్రవ్యాలు(మలబార్), కంబళీ(రాజస్థాన్), దమాస్కస్ స్టీల్(డెక్కన్) వంటి రంగాలను ప్రముఖంగా చెప్పుకోవచ్చు.

**సదవగాహన కల్పించాలి**

భారత్ నేడు ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. ఒకటి రెండేళ్లలో మూడో స్థానాన్ని అందుకోనుంది. ఆర్థిక రంగంలో ఇప్పుడు మనం సాధిస్తున్న ప్రగతి వెనక శతాబ్దాల అనుభవైక చరిత్ర ఉందన్న విషయం నేటితరం తెలుసుకోవాలి. భారతదేశం అనగానే తక్కిన ప్రపంచానికి ప్రధానంగా ఆధ్యాత్మిక రంగమే గుర్తొస్తుంది. వాణిజ్య రంగంలోనూ మన దేశానికి శతాబ్దాల నాటి ఘన చరిత్ర ఉందన్న వాస్తవాన్ని బడిలోనూ, యూనివర్సిటీల్లోనూ బోధించాలి. ప్రాంగణ నియామకాల్లో భారతీయ కంపెనీల భాగస్వామ్యాన్ని పెంచాలి. ఆరు కోట్ల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు కలిగిన ఇండియాకు ఎంతటి విస్తృతమైన పారిశ్రామికశక్తి ఉందో నవతరానికి తెలియజెప్పాలి. అప్పుడే వారిలో భారతీయ వాణిజ్య చరిత్ర పట్ల, పారిశ్రామిక పాటవం పట్ల సదవగాహన ఏర్పడగలదు.

**లక్ష్యానికి దూరంగా...**

షెడ్యూల్డ్ తెగల పిల్లలకు వసతి కల్పిస్తూ ఉచిత విద్యను అందించడానికి కేంద్రం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లను (ఈఎంఆర్ఎస్) ఏర్పాటు చేసింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా నాలుగు వందలకు పైగా స్కూళ్లున్నాయి. అయితే, వాటిలో అత్యంత వెనకబడిన ట్రైబల్ గ్రూప్ పిల్లల నమోదు అరకొరగానే ఉంది. పైగా, చాలా చోట్ల ఆ బడుల్లో టీచర్ పోస్టుల్లో ఖాళీలు ఎక్కువగా ఉన్నాయి.

# జ్ఞాపకాలే బహుమతులు

**జ్ఞాపకాలు మంచివైనా.. చెడ్డవైనా ఎప్పటికీ గుర్తుంటాయనే సినిమా డైలాగు నిజమే కదా! మన జీవిత కథనానికి సబ్‌హెడింగ్స్ లాంటివి అవే. జ్ఞాపకాలు లేకపోతే జీవితమే ఉండదు. మనమంతా ఎప్పుడూ బిజీనే. చిన్నప్పుడు చదువుతో, తరవాత ఉద్యోగం, ఆ తరవాత కుటుంబ బాధ్యతలతో... ఈ ఉరుకులు పరుగుల్లో ఏ కాస్త ఖాళీ దొరికినా తినేయడానికి సోషల్ మీడియా ఉండనే ఉంది. అందుకే లైఫ్ కూడా ఫాస్ట్ ఫార్వర్డ్‌లో కదిలిపోతున్నట్లు ఉంటుంది. కానీ, ఇంత బిజీ సమయంలోనూ కొందరి మాటలు, కొన్ని క్షణాలు మాత్రం మెదడులో 'బుక్ మార్క్' అవుతాయి. అవే మనకు నచ్చే, మనసు మెచ్చే జ్ఞాపకాలు. గుండెల్లో పీఠం వేసుకుని కూర్చున్నట్లు ఎప్పటికీ మనతోనే ఉండిపోతాయి.**



హర్ష తన కాలేజ్ చివరి రోజు నచ్చిన వారందరికీ 'నీకంటే గొప్ప గేమ్ పార్ట్‌నర్ మరొకరు ఉండరురా' అని చిన్న కార్డుమీద అందంగా రాసిచ్చాడు. ఆ కార్డు ఇప్పటికీ వాళ్ల ఫ్రెండ్స్ వ్యాలెట్‌లలో ఉంటుంది. పర్స్ తెరిచినప్పుడల్లా దాన్ని చూస్తూ హర్షతో తమ స్నేహబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఉంటారు వాళ్లంతా. దీప్తి తన క్లోజ్ ఫ్రెండ్ డిప్రెషన్‌లో ఉందని తెలుసుకుని ఒక విహారయాత్ర ప్లాన్ చేసింది. మొదట అయిష్టంగానే బయలుదేరిన ఆ అమ్మాయి వారం తిరిగేసరికల్లా ఉత్సాహానికి మారుపేరులా తయారైంది. కుంగుబాటును కొండల్లో వదిలేసి బోలెడు మధురస్మృతులను మూటకట్టుకుని తిరిగి వచ్చింది. దీప్తి ఇచ్చిన ఒక్క సర్‌ప్రైజ్ ఆ అమ్మాయి జీవితాన్ని అందమైన మలుపు తిప్పింది. రమేష్‌కి ఫ్రెండ్‌తో గొడవైంది. కోపంగా ఇద్దరూ ఏవేవో మాటలు అనుకున్నారు. కానీ అదే రోజు రాత్రికి 'మనిద్దరం స్నేహితులమే... మిస్ యూ' అని స్నేహితుడికి మెసేజ్ పెట్టాడు. పొద్దున్నే మళ్లీ మామూలుగానే కలుసుకున్నారు. వారం తరవాత అదే గొడవ గుర్తొచ్చి నవ్వుకున్నారు. అది కూడా వాళ్లకో జ్ఞాపకంగా మిగిలిపోయింది. ఫోనులో నాలుగు మాటల సందేశమే కావచ్చు.. కానీ, జ్ఞాపకం మాత్రం మనసులో నిలిచిపోతుంది. మరి అలాంటి జ్ఞాపకాలను మీరెన్ని ఇవ్వగలుగుతున్నారు?

ఎవరికైనా బర్త్‌డే విషెస్ చెప్పాలంటే ఓ స్టోరీ పెట్టడం లేదంటే వాట్సప్‌లో ఒక జిఫ్ పంపడం... సాధారణమైపోయింది. కానీ, మన విషెస్ ప్రత్యేకంగా గుర్తుండాలంటే.. కాస్త సమయం వెచ్చించాలి. గ్రీటింగ్‌ని కస్టమైజ్ చేయాలి. ఒక చిన్న సర్‌ప్రైజ్ ఎలిమెంట్ జత చేయాలి. దాంతో ఈసారి ఎలా చెబుతామో అని మన విషెస్ కోసం ఏటా వాళ్లు ఎదురుచూడాలి. అంతకన్నా గొప్ప బహుమతి ఏముంటుంది? 'నీ వల్ల ఈరోజు ఆనందంగా ఉన్నాను', 'ఇలా ఎవరూ నన్ను నవ్వించలేదు', 'ఈరోజును నా జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను..' ఇలాంటి సమాధానాలే మనం ఇచ్చే జ్ఞాపకాలకు కొలమానాలు. అందుకే ఒక్క రోజైనా ఓ మాటతోనో, పనితోనో, సర్‌ప్రైజ్‌తోనో ఎవరో ఒకరికి జీవితాంతం గుర్తుండిపోయే జ్ఞాపకాన్ని ఇద్దాం. వాళ్ల డైరీలో మర్చిపోలేని ఒక పేజీని మనకోసం సృష్టించుకుందాం.

# నిద్ర అనే మాటే ఒక మత్తు



**నిద్ర అనే మాటే ఒక మత్తు, మహత్తు. అలసిన శరీరానికి హాయి... నిద్ర. గడిచిన దినానికి తీపి వీడ్కోలు... నిద్ర. నిద్ర పోవడం అనే దశ నుంచే శిశువు జీవితం ఆరంభమవుతుంది. రోజులో పదహారు గంటలు నిద్రపోతూనే దినదిన ప్రవర్ధమానమవుతాడు. ఏ పాటా రాని తల్లి కూడా పసివాడిని నిద్రపుచ్చడానికి 'ఉళుళుళు హాయి' అని లాలి రాగం తీస్తుంది. ఆ లెక్కన ప్రతి తల్లీ ఒక గాయనే అనుకోవాలి. నిద్ర అనేది మనిషికి ప్రకృతి ప్రసాదించిన చవకైన విలాసం.నిద్ర అనేది నిజమైన సమవర్తి కూడా! ఏ మనిషైనా తన దగ్గర అన్ని కిరీటాలనూ పక్కన పెట్టాల్సిందే. కేవలం శ్వాసించే మాంసపు బంతులుగా ఆడాల్సిందే. "ఈ నీడల నాటకరంగం మీద జీవితపు మెరకపల్లాల్లోంచి వచ్చిన వాళ్లందరూ ఒకే హోదాతో నిలబడతారు. ఇక్కడ విభేదాలు లేవు. ఈ కౌగిలి అందరికీ ఒకేరకపు శాంతినిస్తుంది. ఇక్కడ యాచన లేదు. లేదనటం లేదు. అవమానం లేదు.**

ఈ వాకిలి దగ్గరకు వచ్చినవాడెవ్వడూ ఉత్త చేతులతో తిరిగి వెళ్లడు'' అంటాడు కథక కవి ఆలూరి బైరాగి. నిద్ర అనేది దివ్యలోకాలకు తలుపులు తెరిచే సాధనం. ఏ మనిషికా మనిషి సమాంతర ప్రత్యేక లోకాలను ఆవిష్కరించుకోగలిగే తరుణోపాయం. కలల రెక్కల మీద ప్రతి జీవీ అక్కడ ఎల్లలు లేకుండా తిరుగుతాడు. తెల్లారేసరికి ఏమీ ఎరగనట్టే మామూలుగా ఉండిపోతాడు. మనిషికి ఉన్నవి రెండే స్థితులు: పగలు పని, రాత్రి నిద్ర. అవి తారుమారవ్వడం ఆధునిక పరిణామం. ఆకలి రుచెరగదు, నిద్ర సుఖమెరగదంటారు. నిద్రలోంచి లేవడమంటే దాదాపు చచ్చి మళ్లీ బతికినట్టే! అందుకే కొందరు నిద్ర లేవగానే కృతజ్ఞతగా దేవుడికి దండం పెట్టుకుంటారు. కానీ అదంతా కాయకష్టం చేసిన రోజుల్లో! ఇప్పుడు మనిషి స్థానాన్ని యంత్రం ఆక్రమించాక, నడుం వంచడం అనేదే పెద్ద పనైపోయింది. లక్షల ఏళ్ల మనిషి నాగరికతా ప్రస్థానంలో 10,000 ఏళ్ల నుంచే మనుషులు నగరాల్లో జీవించడం మొదలుపెట్టారు. పంతొమ్మిదో శతాబ్దం చివరలోనే కరెంట్ మనిషి జీవితంలోకి వచ్చింది. 1970ల తర్వాతే కంప్యూటర్లు ఇళ్లల్లోకి ప్రవేశించాయి. వీటన్నింటికీ మనిషి మెదడు సర్దుకుపోతూ వచ్చింది.ఈ క్రమంలో చరిత్ర పూర్వ మనుషులు ఎలా నిద్దరోయారు అనేది ఒక ఆసక్తి. చెట్టు కొమ్మలనే పాన్పులుగా చేసుకుని అదే చెట్ల మీద పడుకోవడమూ ఉండేది. ఎటో జారిపోతున్న భావన కలిగి ఉన్నట్టుండి మనం ఇప్పుడు నిద్రలోంచి మేల్కొనడం అనేది మన పూర్వీకుల చెట్ల నిద్ర తాలూకు అవశేషం మన రక్తంలోకి ఇంకిపోవడం వల్ల జరుగుతున్నదని నిద్రా నిపుణులు చెబుతుంటారు. అలా జారిపోతున్న సంవేదన ఆ ఆదిమ మానవులకు ఒక రక్షాకవచంలా పనిచేసి, క్రూర మృగాల పట్ల అప్రమత్తతతో ఉంచింది. అయితే, రెండు లక్షల ఏళ్ల క్రితమే మనుషులకు 'మంచం' లాంటిది ఏర్పాటు చేసుకోవడం తెలుసు అంటారు 'హౌ టు స్లీప్ లైక్ ఎ కేవ్‌మ్యాన్: ఏన్షియెంట్ విజ్‌డమ్ ఫర్ ఎ బెటర్ నైట్స్ రెస్ట్' రచయిత డాక్టర్ మెరిజిన్ వాన్ డెలార్. పట్టు పాన్పు, మబ్బు దుప్పట్లు లేకపోయినా, మట్టిని బల్లపరుపుగా చేసుకొని, దాన్ని మరిన్ని పొరలుగా ఉబ్బుగా దిద్దుకుని, దాన్ని కొమ్మలు, గడ్డి, ఆకులతో మెత్తబరుచుకొని పడుకునేవాళ్లు. పురుగూ పుట్రను తరిమికొట్టే మొక్కలను అక్కడ ఉంచేవాళ్లు. పక్కనే క్యాంప్ ఫైర్ ఉండనే ఉంటుంది. అదే మంటతో ఆ మంచాన్ని నియమిత సమయాల్లో కాల్చుతుండేవాళ్లు. దానివల్ల కూడా పురుగూ పుట్రా ఆ దరికి చేరకుండా ఉండేవి. అవే మంచాలను బహుముఖంగా పని ప్రదేశాలుగానూ, పని ముట్లను సాపుచేసుకోవడానికీ వాడుకునేవాళ్లు. అందుకే చరిత్ర పూర్వ మనుషులనగానే అనాగరికమైన ఊహ రావడాన్ని వ్యతిరేకిస్తారు వాన్ డెలార్. నిద్ర, తిండి విషయంలో వాళ్లు అత్యంత వివేకంతో వ్యవహరించారన్నది నెదర్లాండ్స్‌కు చెందిన ఈ 'స్లీప్ సైంటిస్ట్' వాదన. వ్యాయామం ఉండటం, తిండిలో చక్కెర లేకపోవడం అనే రెండు కారణాల వల్ల వాళ్లకు ఇట్టే నిద్రపట్టేది. ఆ రెండూ రివర్సు కావడం వల్ల ఇప్పుడు నిద్ర కరవవుతోంది.

# విధాన రచనలో స్త్రీల భాగస్వామ్యమేది?



స్వాతంత్ర్యంకోసం భారతావని చేస్తున్న పోరాటంలో స్త్రీ పురుషులందరూ భాగస్వాములు కావాలని మహాత్ముడు పిలుపిచ్చినప్పుడు తరతరాలుగా తమను ఇంటికే పరిమితం చేసిన సామాజిక సంకెళ్లను తెంచుకుని మహిళలు ముందడుగు వేశారు. పరాయి పాలకుల దాష్టీకాలను ఖండిస్తూనే దేశీయంగా సమాన హక్కులకోసం, సమన్యాయంకోసం వారు గళమెత్తారు. స్వతంత్ర భారతాన్ని ప్రగతి పథంలోకి నడిపించే కృషిలోనూ స్త్రీలకు సమాన అవకాశాలు లభించాలని రాజ్యాంగ పరిషత్తు సభ్యులు రేణుకా రే, హంసా మెహతా తదితరులు ఆకాంక్షించారు. బాధ్యతాయుతమైన నాయకత్వ స్థానాల్లోకి మహిళలు ఎంత ఎక్కువగా వస్తే అంత అధికంగా వారి సామాజిక ఆర్థిక స్థితిగతుల్లో మేలిమి మార్పులు వస్తాయని, అంతిమంగా అవి భారతావని సమ్మిళిత ప్రగతికి ఆలంబనలవుతాయని వారు ఆశించారు. అందుకే రాజకీయ రంగంలో మహిళల ప్రవేశం అవసరం కాదు అనివార్యమని సంవిధాన సభలోనే పూర్ణిమా బెనర్జీ తేల్చిచెప్పారు. స్వేచ్ఛా భారత తొలినాళ్లలో ఉదయించిన ఈ స్వప్నాలేవీ ఈనాటికీ సాకారం కాలేదు. దేశ గమనాన్ని నిర్దేశించే రాజకీయాల్లో స్త్రీల భాగస్వామ్యం ఆశించిన స్థాయిలో పెరగలేదు. ఈ పరిస్థితుల్లో నిన్న తిరుపతిలో ఆరంభమైన జాతీయ మహిళా సాధికార సదస్సు వికసిత భారతావనిని ఆవిష్కరించుకునే బృహత్ యజ్ఞంలో మహిళలే కీలక పాత్రధారులని ఉద్ఘాటించింది. ఇటువంటి భేటీల తీర్మానాల్లో కనిపించే ఘనసంకల్పాలు ఆచరణ రూపం దాల్చినప్పుడే నిజమైన స్త్రీ సాధికారతా సాధనకు దారులు విశాలమవుతాయి. మెక్సికో, న్యూజిలాండ్, స్వీడన్, నార్వే, ఫిన్లాండ్, దక్షిణాఫ్రికా వంటి దేశాల దిగువసభల్లో మహిళల ప్రాతినిధ్యం 45శాతం అంతకు మించి ఉంది. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఖ్యాతిగడించిన ఇండియాలో మాత్రం అందుకు భిన్నమైన దుస్థితి నెలకొంది. తొలి లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీలుగా గెలిచినవారిలో మహిళలు 4.5శాతమైతే ఇన్నేళ్లలో ఆ సంఖ్య దాదాపు 14శాతానికే చేరింది. దిగువ సభల్లో స్త్రీల వాటా పరంగా 190 దేశాల్లో ఇండియా 148వ స్థానంతో సరిపెట్టుకుంటోంది. ఆర్థిక కార్యకలాపాల్లో స్త్రీల భాగస్వామ్యం, విద్యార్జన, రాజకీయ ప్రాతినిధ్యం తదితరాల ఆధారంగా గణించే లింగ సమానత్వ సూచీలోనూ 148 దేశాల నడుమ భారత్ 131వ స్థానానికి పరిమితమైంది. ఇక దేశవ్యాప్తంగా నాలుగు వేల మందికి పైబడిన ఎమ్మెల్యేలలో మహిళల వాటా పట్టుమని తొమ్మిది శాతమే! ఇంటా బయటా స్త్రీలు చవిచూసే చేదు అనుభవాల గురించి వారికి తెలిసినంతగా పురుషులకు తెలియదు. స్త్రీల అభివృద్ధిని వెనక్కిలాగుతున్న వ్యవస్థాగత, సామాజిక సమస్యలకు సరైన పరిష్కారాలు సత్వరం లభించాలంటే విధాన రచనలో మహిళల ప్రాతినిధ్యం పెరిగి తీరాలి! స్థానిక సంస్థల్లో స్త్రీలకు 33శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగాన్ని సవరించారు. కొన్ని రాష్ట్రాలైతే పంచాయతీరాజ్ సంస్థల్లో మహిళలకు సగం స్థానాలు ప్రత్యేకిస్తున్నట్లు భుజాలు చరచుకొంటున్నాయి. కానీ, ఆయా పదవులను చేపట్టిన స్త్రీలలో ఎంతమంది స్వతంత్రంగా పనిచేయగలుగుతున్నారు? చాలాచోట్ల మహిళా నేతలను వెనక్కినెట్టి వారి కుటుంబసభ్యులే పెత్తనం చలాయిస్తున్నారు. ఇదేమి ప్రజాస్వామ్యం? లోక్‌సభ, రాష్ట్రాల శాసన సభ ఎన్నికల్లో టిక్కెట్లు దక్కించుకుంటున్న కొద్దిమంది స్త్రీలలోనూ ఎక్కువశాతం రాజకీయ కుటుంబాల నుంచి వస్తున్నవారే. అట్టడుగు వర్గాలకూ అభివృద్ధి ఫలాలు అందాలంటే విభిన్న నేపథ్యాలకు చెందినవారు చట్టసభల్లోకి అడుగుపెట్టాలి. ఆ మేరకు పాలనలో మహిళలు క్రియాశీలక భూమిక పోషించే విధంగా పార్టీలన్నీ చేయూతనందించాలి. మహిళా సాధికారత పట్ల వాటి నిబద్ధతకు ఇదే పరీక్ష!

# అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

**- పి జి ఆర్ ఎస్ కు 334 అర్జీలు.**

**అనంతపురం సెప్టెంబర్ 15,అనంత జనశక్తి న్యూస్**



జిల్లా లోని సుదూర ప్రాంతాల నుండి తమ సమస్యలు పరిష్కారం అవుతాయని అర్జీదారులు ఎంతో ఆశతో ప్రజా సమస్యల పరిష్కారవేదికకార్యక్రమమునకు వస్తారని అర్జీదారుడు సంతృప్తిచెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ శివ నారాయణన్ శర్మ ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) ప్రజా సమస్యలపరిష్కారకార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తోపాటు అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డిఆర్ఓ మలోలా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రామకృష్ణారెడ్డి, రామ్మోహన్, మల్లికార్జునుడు, వ్యవసాయశాఖఅధికారిఉమామహేశ్వరమ్మ హాజరై ప్రజల నుండి 334 దాకా ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ శివ నారాయణన్ శర్మ మాట్లాడుతూ..ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీతగడువులోపుతప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలనుపరిష్కరించాలన్నారు మండల స్థాయి అధికారులు ఆయాశాఖలద్వారా స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.చాలావరకుకొన్ని మండలాలలో రెవెన్యూ, మునిసిపల్, డి ఆర్ డి ఏ, వ్యవసాయ శాఖ, డ్వామా తదితర శాఖలలో అర్జీలు పెండింగ్ లో ఉన్నందున వాటిని పారదర్శకంగా పరిష్కార మార్గాల చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి అర్జీదారులు పెన్షన్ల మంజూరు, ఇంటి స్థలాలు, రేషన్ కార్డులు మంజూరు, భూ సమస్యల పరిష్కారం తదితర అంశాలతో కూడిన వినతులను సమర్పించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీలో 'బీసీ' సత్తా

**- సత్ఫలితాలిచ్చిన మెగా డీఎస్సీ ఉచిత కోచింగ్**
**- బీసీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో ఆన్ లైన్, ఆఫ్ లైన్ శిక్షణ**
**- 241మంది బీసీ అభ్యర్థులు టీచర్లగా నియామకం**
**- సివిల్ సర్వీసెస్ కోచింగ్ తోనూ ప్రభుత్వ ఉద్యోగులుగా మరికొందరు**
**- ప్రభుత్వ ఉద్యోగాలుగా బీసీ యువతే లక్ష్యం : మంత్రి సవిత**

**అమరావతి సెప్టెంబర్ 15,అనంత జనశక్తి ప్రతినిధి**



బీసీ నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకున్న సత్ఫలితాలిస్తున్నాయి. వివిధ పోటీ పరీక్షల నిమిత్తం బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా డీఎస్సీ, సివిల్స్ కోచింగ్ ను వెనుకబడిన తరగతుల నిరుద్యోగ యువతకు కూటమి ప్రభుత్వం శిక్షణ అందజేసింది. ఈ శిక్షణతో తాజాగా నిర్వహించిన డీఎస్సీ సహా పలు ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షల్లో బీసీ నిరుద్యోగ అభ్యర్థులు సత్తా చాటారు. కూటమి ప్రభుత్వం అందజేసిన శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ, 238 మంది టీచర్ పోస్టులు సాధించగా, బ్యాంకు, పోలీసు సహా ఇతర ప్రభుత్వ పోస్టులను కూడా బీసీ అభ్యర్థులు సాధించారు. 2024 జూన్ లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బీసీలకు వెన్నుదన్నుగా నిలిచింది. ముఖ్యంగా బీసీ యువతను ఉన్నత స్థానాల్లో నిలపాలన్న లక్ష్యంతో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యలో బీసీ స్టడీ సర్కిల్ ద్వారా మెగా డీఎస్సీ, సివిల్స్ సర్వీసెస్ కు ఉచిత కోచింగ్ అందజేసింది. 16,347 టీచర్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహణ చేపట్టింది. అత్యధిక ఉపాధ్యాయ పోస్టులను బీసీ నిరుద్యోగ యువత సాధించాలన్న లక్ష్యంతో బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా అన్ని జిల్లా కేంద్రాల్లోనూ ఉచిత కోచింగ్ సెంటర్లు ప్రారంభించింది. జిల్లా కేంద్రానికి సుదూరంలో ఉండే మహిళలు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేసుకునే వారి సౌలభ్యం కోసం ఆన్ లైన్ ద్వారా కూడా ఉచిత డీఎస్సీ శిక్షణ అందజేసింది. ఇలా ఆన్ లైన్, ఆఫ్ లైన్ ద్వారా 6,470 మందికి బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా మెగా డీఎస్సీ సన్నద్ధతకు ఉచిత శిక్షణ అందజేశారు. సివిల్ సర్వీసెస్ కు కూడా 83 మంది బీసీ అభ్యర్థులకు కూటమి ప్రభుత్వం ఉచిత శిక్షణ అందజేసింది. రాష్ట్ర స్థాయిలో విజయవాడలోని గొల్లపూడి బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో ఉచిత శిక్షణ అందజేసింది.

**241 మంది టీచర్లగా బీసీ బిడ్డలు...**

బీసీ యువత అత్యధిక ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలన్న సంకల్పంతో నిర్వహించిన ఉచిత డీఎస్సీ, సివిల్ సర్వీసెస్ శిక్షణ ఎంతో దోహదం చేసింది. బీసీ స్టడీ సర్కిళ్ల ఉచిత శిక్షణ కేంద్రాల ద్వారా 1,674 మందికి, ఆన్ లైన్ లో ద్వారా మరో 4,774 మందికి.. మొత్తం 6,470 మందికి ఉచిత శిక్షణ డీఎస్సీ శిక్షణ అందజేశారు. వారిలో 241 మంది బీసీ అభ్యర్థులు టీచర్లగా ఎంపికయ్యారు. కర్నూల్ నుంచి 36, అనకాపల్లి నుంచి 40, నెల్లూరు నుంచి 17, కృష్ణా నుంచి 10 మంది బీసీ అభ్యర్థులు టీచర్లగా ఎంపికయ్యారు. ఈస్ట్ గోదావరి నుంచి ఆరుగురు, చిత్తూరు నుంచి ఎనిమిది, పల్నాడు నుంచి ముగ్గురు, కడప నుంచి 12 మంది ఉపాధ్యాయులుగా నియమితులయ్యారు. పార్వతీపురం మన్యం, బాపట్ల, నంద్యాల నుంచి ఒక్కొక్కరు, అనంతపురం, ఏలూరు, శ్రీకాకుళం నుంచి ఏడుగురు చొప్పున, అన్నమయ్య, కోనసీమ నుంచి ముగ్గురు చొప్పున టీచర్ పోస్టులకు ఎంపికయ్యారు. గుంటూరు నుంచి 12 మంది, కాకినాడ నుంచి నలుగురు, ఎన్టీఆర్ జిల్లా నుంచి ఆరుగురు, ప్రకాశం నుంచి ఎనిమిది మంది గురువులుగా ఎంపికయ్యారు. సత్యసాయి జిల్లా నుంచి ఇద్దరు, తిరుపతి నుంచి 13 మంది, విశాఖపట్నం నుంచి అయిదుగురు, విజయనగరం నుంచి 14 మంది, వెస్ట్ గోదావరి 12 మంది బీసీ అభ్యర్థులుగా టీచర్లగా బాధ్యతలు చేపట్టనున్నారు.

**సత్ఫలితాలిచ్చిన సివిల్ సర్వీసెస్ కోచింగ్**

మెగా డీస్సీతో పాటు సివిల్ సర్వీసెస్ కోచింగ్ కూటమి ప్రభుత్వం అందజేసింది. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఈ కోచింగ్ వల్ల కూడా బీసీ నిరుద్యోగ యువత ఎంతో లబ్ధిపొందింది. కేవలం అయిదు నెలల పాటు సాగిన ఈ కోచింగ్ వల్ల గ్రూప్ 2 మెయిన్స్ కు 12 మంది, ఆర్.ఆర్.బి లెవల్ 1కు పది మంది, ఎఫ్.ఆర్.వో ప్రిలిమ్స్ కు ఇద్దరు, మెయిన్ కు ఒకరు అర్హత సాధించారు. ఆరుగురు అభ్యర్థులు పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. ఆర్.ఆర్.బి లోకో పైలట్ గా మరో అభ్యర్థి ఎంపికయ్యాడు. బెల్, గేట్ లో ఒక్కొక్కరు అర్హత సాధించారు. ఎస్.ఐ ప్రిలిమ్స్ ఎగ్జామ్ లో మరో అభ్యర్థి విజయం సాధించాడు. ఇలా సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్ ను బీసీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకున్నారు.

**ప్రభుత్వ ఉద్యోగులుగా బీసీ యువత**

**అత్యధిక ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీ యువత స్థిరపడాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం. ఇందుకోసం ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీ, సివిల్ సర్వీసెస్ కోసం బీసీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ నిర్వహించాం. ప్రభుత్వ సంకల్పాన్ని బీసీ యువత నిజం చేస్తూ, 241 మంది ఉపాధ్యాయులుగా నియమిమతులయ్యారు. సివిల్ సర్వీసెస్ కోచింగ్ వల్ల కూడా కొందరు బీసీ అభ్యర్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఇదే స్ఫూర్తితో బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేలా బీసీ నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వనున్నాం. బీసీ నిరుద్యోగ యువతకు డీఎస్సీ, సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్ ఇచ్చినందుకు కేంద్ర ప్రభుత్వం ఏపీ బీసీ సంక్షేమ శాఖకు స్కోచ్ అవార్డు అందజేసింది.**

# పిటీషన్లు పునారవృతం కాకుండా చూడండి



**- విచారణ జరిపి వెంటనే బాధితులకు న్యాయం చేయండి. జిల్లా ఎస్పీ.**

**పుట్టపర్తి రూరల్: సెప్టెంబర్ 15**
**అనంత జన శక్తి న్యూస్:**

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 60,ఫిర్యాదులు. ఫిర్యాదులను చట్ట పరిధిలో విచారించి సత్వరమే బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పి ఎస్ సతీష్ కుమార్ అధికారులకు ఆదేశించారు.జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్లో మాట్లాడి బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారించి న్యాయపరమైనటువంటి వాటికి సత్వరమే న్యాయం చేయాలని ఆదేశించడంతో పాటు ఫిర్యాదులు పునరావతం కాకుండా చూడాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కుటుంబ కలహాలు, భూ తగాదాలు, సైబర్ మోసాలు, వ్యాపారల పేరుతో మోసాలు , తదితర వంటి సమస్యలపై ఈ రోజు మొత్తం 60, ఫిర్యాదులు అందజేశారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు , పుట్టపర్తి డిఎస్పి విజయ్ కుమార్, మహిళా పిఎస్ స్టేషన్ డిఎస్పి ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి నాపై చూపిన విశ్వాసానికి... కృతజ్ఞుడిగా ఉంటా

**- బీజేపీ నిజాయితీ కార్యకర్తకు గుర్తింపు**
**- గొట్లూరు సహకార సొసైటీ డైరెక్టర్గా బీజేపీ కార్యకర్త గొడ్డిటి వెంకటేష్ రాయల్ ఎంపిక**
**- సాధారణ కార్యకర్తకు బిజెపి ఇచ్చే అరుదైన గౌరవం.**
**- మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ కగ్గోలు హరీష్ బాబు.**

**ధర్మవరం రూరల్ సెప్టెంబర్ 15,**
**అనంత జనశక్తి న్యూస్ :**



గొట్లూరు గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ కట్టుబాటుతో పనిచేస్తున్న సామాన్య కార్యకర్త గొడ్డిటి వెంకటేష్ రాయల్ కి గొట్లూరు సహకార సొసైటీ డైరెక్టర్ పదవి లభించింది. వెంకటేష్ గత కొన్ని సంవత్సరాలుగా బీజేపీలో నిజాయితీగా, అంకితభావంతో పార్టీ బాధ్యతలు నిర్వర్తిస్తూ ప్రజల సమస్యలకు అండగా నిలుస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఆయనకు పార్టీ తరపున కొత్త పదవి అవకాశం లభించడం పట్ల గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ బాధ్యతను తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ వెంకటేష్ మాట్లాడుతూ..... రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు లు నాపై చూపిన విశ్వాసానికి ఎల్లప్పుడూ కృతజ్ఞుడిగా ఉంటాను. సహకార సొసైటీ డైరెక్టర్గా నాకప్పగించిన బాధ్యతను నిజాయితీగా నిర్వర్తిస్తాను అని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు, కొత్తగా నియమితుడైన వెంకటేష్ రాయల్ ని సన్మానించి, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ పట్ల ఆయన కృషి, క్రమశిక్షణను హరీష్ బాబు అభినందించారు.

# జిల్లాకు కొత్తగా 6,57,248 క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రైస్ కార్డులు ప్రభుత్వం నుంచి సరఫరా



**- జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ**

**అనంతపురం, సెప్టెంబర్ 15 :అనంత జనశక్తి న్యూస్**

జిల్లాకు కొత్తగా 6,57,248 క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రైస్ కార్డులు ప్రభుత్వం నుంచి సరఫరా చేయడం జరిగిందని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తెలిపారు. సోమవారం అనంతపురం నగరంలోని అశోక్ నగర్ లో సచివాలయ ఉద్యోగుల ద్వారా కార్డుదారుల ఇంటి వద్దనే వారికి సంబంధించిన క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రైస్ కార్డులను జాయింట్ కలెక్టర్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ జిల్లాలోని అన్ని మండలాల్లో ఈరోజు ప్రారంభమైందన్నారు. స్మార్ట్ రైస్ కార్డులను సంబంధిత గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా కార్డుదారుల ఇంటి వద్దనే పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్మార్ట్ రైస్ కార్డులను పంపిణీ చేయాలని అర్బన్ తహసీల్దార్, సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్లను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. స్మార్ట్ రైస్ కార్డులను కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ వెంకటేశ్వర్లు, అర్బన్ తహసీల్దార్ హరికుమార్, సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్ భాష, సచివాలయ ఉద్యోగులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా మెగా రక్తదాన శిబిరం... విజయవంతం



**- మంత్రి సత్య కుమార్ యాదవ్ జన్మదినోత్సవం సందర్భంగా ధర్మవరం లో మెగా రక్తదాన శిబిరం.**
**- సత్యన్నసేన ఆధ్వర్యంలో ఎన్డీఏ కార్యాలయంలో ఘనంగా రక్తదాన శిబిరం.**
**- రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు.**
**మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ కగ్గోలు హరీష్ బాబు, సత్తన్న సేన ప్రతినిధులు.**

**ధర్మవరం రూరల్ సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్ :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ జన్మదినోత్సవం సందర్భంగా ధర్మవరం పట్టణంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా, సత్యన్నసేన ఆధ్వర్యంలో మరియు ధర్మవరం ఎన్డీఏ కార్యాలయం ప్రాంగణంలో సోమవారం ఉదయం మెగా రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో వందలాది మంది కార్యకర్తలు, యువతీ యువకులు, సామాజిక సేవా నిబద్ధత కలిగిన ప్రజలు పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం ద్వారా అనేక ప్రాణాలను రక్షించే అవకాశం లభించిందని, రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నామని సత్యన్నసేన ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మరియు సత్యన్న సేన ప్రతినిధులు మాట్లాడుతూ......"రక్తదానం అనేది ప్రాణదానం. మంత్రివర్యులు శ్రీ సత్య కుమార్ యాదవ్ స్ఫూర్తితో సత్యన్నసేన చేస్తున్న ఈ సేవా కార్యక్రమాలు సమాజానికి దోహదపడుతున్నాయి. ధర్మవరం ప్రజలు ఇంత ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయం. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టనున్నాం" అని పేర్కొన్నారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన ఈ రక్తదాన శిబిరం ధర్మవరం పట్టణంలో ఒక గొప్ప సేవా యజ్ఞంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించిన వారు మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు, సత్యన్నసేన ప్రతినిధులు బాలు, విక్రమ్ పాల్గొన్నారు.

# స్వామి సొమ్ముకు దొంగలు పడ్డారు.

**- శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ చోరీ.**
**- స్వామికి సొమ్ము నిచ్చేది పోయి, స్వామి సొమ్మునే ఉడయించిన ఘనులు.**

**ధర్మవరం రూరల్ సెప్టెంబర్ 15,**
**అనంత జనశక్తి న్యూస్:**



పట్టణంలోని సిద్దయ్య గుట్టలో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ 2 వ సారి దొంగతనము నకు గురైంది. ఆలయ కమిటీ అధ్యక్షురాలు సంకారపు జయ శ్రీ, ఉపాధ్యక్షులు పుట్లూరు నరసింహులు మాట్లాడుతూ....... గతంలో హుండీని పగలగొట్టి, అందులో డబ్బులు కూడా దొంగతనం చేయడం జరిగిందని, తర్వాత ఆ దొంగ తెలివిగా తన దగ్గర ఉన్న బీగమును వేసి వెళ్లిపోయాడు అని తెలిపారు. మామూలుగా 15 రోజులకు ఒకసారి ఉండి లెక్కింపు చేయడం జరుగుతుండేదని తెలిపారు. కొద్దిరోజుల తర్వాత చూడగా బేగం తేడా ఉండడంతో తిరిగి నూతన బీగమును వేయడం జరిగిందన్నారు. హుండీ దొంగతనమునకు గురికావడం జరిగిందని తెలిపారు. హుండీలో బీగాన్ని పగలగొట్టి, సొమ్ముతో పరారయ్యాడని తెలిపారు. అనంతరం చోరీ జరిగిన విషయాన్ని తెలుసుకొని దాన్ని పరిశీలించగా హుండీలో డబ్బు దొం గతనానికి గురైందని గుర్తించడం జరిగిందన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి లెక్కింపు జరుగుతుండేదని, దాదాపుగా 3000 రూపాయల వరకు వచ్చేదని తెలి పారు. రెండవసారి కూడా హుండీ దొంగతనంకు గురి కావడం జరిగిందన్నారు. దీంతో ఆలయ కమిటీ వారు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. రాత్రిపూట గస్తీ ఉండేలా చూడాలని సిఐను కోరడం జరిగిందన్నారు.

# ఎయిడ్స్ వ్యాధి అవగాహన ప్రచార రథం ప్రారంభం



**అనంతపురం, సెప్టెంబర్ 15 :అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో రెండు నెలలపాటు నిర్వహించే ప్రచార కార్యక్రమంలో భాగంగా ఎల్ఈడి డిస్ ప్లే కలిగిన ప్రచార వాహనాన్ని జిల్లాకు పంపటం జరిగింది. ఎయిడ్స్ వ్యాధి అవగాహన ప్రచార రథం వాహనాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డా.ఈబి.దేవి నగరంలోని వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ ఈ వాహనాన్ని జన సమ్మర్థ ప్రదేశాలలో నిలపాలని, హెచ్.ఐ.వి. ప్రభావిత ప్రాంతాలలో వినియోగించాలని తెలిపారు. జిల్లా లెప్రసి, ఎయిడ్స్ మరియు క్షయ నియంత్రణ అధికారి డా.అనుపమ జేమ్స్ మాట్లాడుతూ ఏపిఎస్ఎసిఎస్ అధికారుల ఆదేశాల మేరకు ఈ వాహనాన్ని రోజుకు 68 ప్రాంతాల్లో నిలిపి, హెచ్.ఐ.వి./ఎయిడ్స్, సుఖవ్యాధులు, కౌమార ఆరోగ్యం, మాదక ద్రవ్యాల దుర్వినియోగం తదితర అంశాల పట్ల అవగాహన కల్పించేందుకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించటం జరుగుతుందని, ఆ మేరకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డెమో త్యాగరాజు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకట రత్నం, సూపర్వైజర్ జివి.రమణ, సిబ్బంది మురళి, నారాయణ స్వామి, సి పి ఓ రమణ, సిబ్బంది నరేష్ బాబు, రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రిషి పాఠశాలలో ఇంజనీర్ల దినోత్సవ వేడుకలు



**ధర్మవరం, సెప్టెంబరు 15 అనంత జనశక్తి న్యూస్....**

పట్టణంలోని రిషి పాఠశాలలో ఇంజనీర్ల దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సోమవారం స్థానిక కాలేజ్ సర్కిల్లో ఉన్న అబ్దుల్ కలాం విగ్రహానికి రిషి పాఠశాల విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డీన్ భాస్కరరెడ్డి, ప్రిన్సిపల్ కరుణ్ స్వరూప్ సింగ్ మాట్లాడుతూ... ఇంజనీర్లు దేశాభివృద్ధికి వెన్నెముక లాంటివారన్నారు. అబ్దుల్ కలాం స్ఫూర్తితో సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఏఓ రవీంద్ర, వైస్ ప్రిన్సిపల్ కళ్యాణి, ఏఓ రంగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కులాలను అడ్డుపెట్టుకుని రెచ్చగొట్టే రాజకీయాలు చేస్తే సహించం

- డిప్యూటి సీఎం పవన్ పై ఇష్టమొచ్చినట్టు వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేదిలేదు.
- జగన్ రెడ్డి, పేర్నినానీ, రోజాలపై చిలకం మండిపాటు



**ధర్మవరం, సెప్టెంబరు 15 అనంత జనశక్తి న్యూస్.....**

కులాలను అడ్డుపెట్టుకుని రెచ్చగొట్టేలా రాజకీయాలు చేస్తే ఊరుకునేది లేదంటూ ఖబడ్దార్ అంటూ జగన్ రెడ్డి, పేర్నినాని, రోజాలపై జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక జగన్ రెడ్డి, రోజా,పేర్నినానిలు ఇష్టం వచ్చినవిధంగా అసభ్యపదజాలంతో తిటిస్తున్నారని ఇదిఇలాగే కొనసాగితే సహించేదిలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక రోజ మహిళ అయి సభ్యత, సంస్కారం మరచి ఇష్టం వచ్చినట్టు మాట్లాడటం చూస్తుంటే సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. రోజాకు పవన్ కల్యాణ్ పై విమర్శలు చేసే స్థాయి లేదని, నీవు జబర్దస్ వంటి కార్యక్రమాలు చేసుకోవడానికే సరిపోయేదనిరాజకీయాలకు తరముకావని ఎద్దేవాచేశారు. పేర్నినాని చూస్తే ఇతని నోటికి హద్దేలేదన్నారు. ప్రజలు చిగొట్టి ఓడించినా బుద్ధిరాలేదన్నారు. అసలు వైసీపీ, మంత్రులు, ఎమ్మెల్యేలు పవన్ కల్యాణ్ పై అసభ్యపదజాలంతో దూషిస్తే కట్టడి చేయాల్సిన పోయి కులాలను మతాలను ఇంకా రెచ్చగొట్టండి అనే రీతిలో ఫోన్లో నీవు ఎలా పరామర్శిస్తావంటూ జగన్రెడ్డిపై మండిపడ్డారు. వైసీపీ హయాంలో ఏనాడైనా ఒక మీటరు రోడ్డు వేశావా, ఐదేళ్లు కబ్జాలు, దోపిడీలు, దౌర్జన్యాలు, ప్రశ్నించేవారిపై కేసులు నమోదు చేయించడం వంటి చేయడం సరిపోయిందని విమర్శించారు. అందుకే ప్రజలు 11సీట్లకు పరిమితం చేసి ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేసిన జగన్రెడ్డికి బుద్ధిరాలేదని ఆయన ధ్వజమెత్తారు. నీవు ఐదేళ్లు చేయని అభివృద్ధి కేవలం ఏడాదిలోనే కూటమి ప్రభుత్వంలో జరిగిందన్నారు.

# శివాలయాలలో ప్రత్యేక పూజలు

**యాడికి , సెప్టెంబర్ 15,అనంత జనశక్తి న్యూస్ :**



మండల కేంద్రంలోని భైరవ కొండపై ఉన్న శివాలయంలోను, అయ్యప్ప స్వామి దేవాలయంలోను ఉన్న కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలోను, భోగలింగేశ్వరస్వామి దేవాలయంలోను,ఉన్నత పాఠశాల వెనుక ఉన్న శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలోను,కోనలో ఉన్న రామలింగేశ్వరస్వామి దేవాలయంలోను,పలు శివాలయాలలోను సోమవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. శివునికి అభిషేకాలు చేసి,వివిధ పూలమాలతో అలంకరించారు.అర్చనలు చేసి,హారతులను సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివున్ని దర్శించి,టెంకాయలను సమర్పించారు.కరుణించవయ్యా........భోలా శంకర అని వేడుకొన్నారు.భక్తులకు తీర్థ ప్రసాదాలను అందచేశారు. వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటి సభ్యులు,భక్తులు పాల్గొన్నారు.

# పెండింగ్ డి ఏ లు, ఐఆర్ వెంటనే ప్రకటించాలి

- ఉద్యోగస్తుల, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం చేయకపోవడం దురదృష్టకరం.
- 12వ పిఆర్సి వెంటనే ప్రకటించి 30% ఐ. ఆర్ ఇవ్వాలి.
- ఉద్యోగస్తులకు పెండింగ్లో ఉన్న బకాయిలను వెంటనే ఇవ్వాలి.
- ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సానే రవీందర్ రెడ్డి, కే. బలరాముడు.



**ధర్మవరం రూరల్ సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్:**

ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ ఉద్యోగ ఆర్థిక ఆర్థికేతర సమస్యల పరిష్కారం కొరకుఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర శాఖ పిలిపిచ్చిన నిరసన వారం లో భాగంగా సోమవారం నాడు ధర్మవరం జోన్ పరిధిలోని ఏపీటీఎఫ్ శాఖల ఆధ్వర్యం లో ధర్మవరం పాత తాలూకా కేంద్రమైన రెవిన్యూ డివిజనల్ (ఆర్డీవో) కార్యాలయం వద్దు నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం పాల్గొన్న ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సానే రవీందర్ రెడ్డి, కే బలరాముడు మాట్లాడుతూ..... ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు కాలం పూర్తి అయినా ఉపాధ్యాయ, ఉద్యోగస్థులు సమస్యలు పరిష్కారం చేయక పోవడం దురదృష్టంకరం అన్నారు. 12 వ పిఆర్సి వెంటనే ప్రకటించి, 30% ఐ ఆర్ ఇవ్వాలి అని, పెండింగ్ లో ఉన్న నాలుగు డి ఎ వెంటనే ప్రకటించాలి అని, సి పి ఎస్ రద్దు చేసి ఓ పి ఎస్ అమలు చేయాలి. అన్ని రకాల పెండింగ్ బకాయిలను చెలించాలి. ఈ హెచ్ ఎస్ పరిమితిని 25 లక్షలకు పెంచాలి అసిస్టెంట్ బుక్స్ విధానం రద్దు చేయాలి అని,మెమో 57 ప్రకారం 2003 డిఎస్సి ఉపాధ్యాయులకు ఓపియస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్మవరం మండల పట్టణ శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శివానంద, ఈశ్వరయ్య, గోపి, అంజి నాయక్, బత్తలపల్లి మండల అధ్యక్షులు గోపాల్ మాట్లాడుతూ.... అన్ని వర్గాలకు న్యాయంచేస్తున్న ఉద్యోగస్తుల సమస్య లు పరిష్కారం చేయక పోవడం అన్యాయం అన్నారు. వెంటనే సమస్య లు పరిష్కారం చేయాలి ని లేకపోతే దశలవారీగా ఉద్యమం చేస్తామన్నారు. అనంతరం ధర్మవరం ఆర్డిఓ గారికి సమస్యతో కూడిన వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసులు, తిప్పన్న, శ్రీనివాసులు, వాసు కుమార్, శంకర్ నారాయణ, బాలయ్య,హేమంత్, అమనుల్లా, ఓబులేష్, నాగ శేఖర్, చెన్నుడు, షణ్ముఖ, జగదీష్, సుదర్శన, కుళ్లాయప్ప, మల్లికార్జున, రమేష్ నాగరాజు,వెంకటేష్, శ్రీనివాస్ రెడ్డి, పెద్దోబులేష్, శేఖర్, వెంకట రాముడు, రామాంజనేయులు, వేణు మరియు ఏపీటీఎఫ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి తిరిగి చేసే సేవలు, సర్వేలనుండి విముక్తి ఇవ్వాలి



**ధర్మవరం, సెప్టెంబరు 15 అనంత జనశక్తి న్యూస్.....**

ఇంటింటికి తిరిగి చేసే సేవలు, సర్వేల నుంచి విముక్తి ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యకార్యచరణ కమిటి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఇన్చార్జ్ కమిషనర్ సాయికృష్ణకు కమిటి సంఘం నాయకులు చేపట్టబోయే సన్నాహక కార్యక్రమాలను వినతిపత్రం రూపంలో అందజేశారు.

ఈ సందర్భంగా గ్రామవార్డు సచివాలయ జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ఆదివారం జోనల్ స్థాయి సమావేశంలో వివిధజిల్లాల నాయకులు ఉద్యోగులు, ప్రస్తావించిన అంశాలకు అనుగుణంగా రాష్ట్ర ఐక్యకార్యచరణ కమిటి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల ప్రయోజనార్థం కొన్ని ముఖ్యమైన అంశాలను సమావేశం అనంతరం చర్చించామన్నారు.ఇందులో భాగంగా ప్రభుత్వం అన్ని శాఖల అదికారులతో చర్చలు జరిపే వరకు ఈనెల 16వతదీ నుంచి డోర్ టు డోర్ నిలిపివేస్తున్నామన్నారు. మంగళ, బుధవారాల్లో మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీలకు వినతితపత్రాలు అందజేయుట, 18,19,20 తేదీలలో మండలస్థాయి నుంచి డివిజన్ జిల్లాస్థాయి అధికారులకు కూడా వినతిపత్రాలు అందజేయడం జరుగుతుం దన్నారు.22న సోమవారం కలెక్టరేట్ జరిగే గ్రీవెన్స్ లో పిర్యాదులు అందజేయడం,23న సర్వేలు నిలిపివేయడం జరుగుతుందన్నారు. 30వతేదీ వరకు జరిగే నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. అక్టోబరు 1వతేదీన పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని కూడా ఆపేస్తున్నామన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు.

# నవ్యాంధ్రప్రదేశ్ ప్రైవేటు మెడికల్ లేబరేటరీ ప్రొఫెషనల్ అసోషియేషన్ ఏర్పాటు



**ధర్మవరం, సెప్టెంబరు 15 అనంత జనశక్తి న్యూస్.....**

నవ్యాంధ్రప్రదేశ్ ప్రైవేటు మెడికల్ లేబరేటరీ ప్రొఫెషనల్ అసోషియేషన్ ఏర్పాటును మంగళగిరిలో ఆదివారం ఏర్పాటుచేసినట్టు అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు హరిబాబు తెలిపారు. ఈ సం దర్భంగా సినీప్రముఖులు డాక్టర్ గౌతంరాజు, సంఘం సభ్యులు అసోషియేషన్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ....20వేల నుం చి 25వేలవరకు మెడికల్ లేబరుటరీలను ఒకే వేదికపై తీసుకునివచ్చి వారి సమస్యలను పరిష్కరించాలని నిర్ణయించామన్నారు. ప్రతి టెక్నీషియన్ కి భీమాభద్రతకల్పించాలని, ఆరోగ్యశ్రీలో భాగస్వామ్యం కల్పిస్తే ప్రైవేటు లేబోరేటరీ కుటుంబాలకు జీవనోపాధి పొందే అవకాశం ఉంటుందని విజ్ఞప్తిచేశారు. అంతకు మునుపు నవ్యాంధ్రప్రదేశ్ ప్రైవేటు మెడికల్ లేబరేటరీ ప్రొఫెషనల్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా హరిబాబు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా సత్యసాయిజిల్లా ధర్మవరం కు చెందిన దినేష్ బాబును రాష్ట్ర ఈసీ మెంబరుగా ప్రకాశ్, రవిలను ఎంపికచేయడం జరిగిందన్నారు.

# ఎన్టీఆర్ వైద్యసేవల విషయంలో వైసీపీ దుష్ప్రచారం చేస్తోంది

- ప్రభుత్వం పేదల వైద్యాన్ని మరింత చేరువ చేస్తోంది.
- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో పరిటాలశ్రీరామ్

**ధర్మవరం, సెప్టెంబరు 15 అనంత జనశక్తి న్యూస్**



ఎన్టీఆర్ వైద్యసేవల విషయంలో ప్రభుత్వం పై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ పరిటాలశ్రీరామ్ సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని మొత్తం 10 మందికి రూ.9.95లక్షల విలువ చేసే చెక్కులను లబ్దిదారులకు పరిటాలశ్రీరామ్ సోమవారం అందజేశారు. చెక్కులు తీసుకున్న లబ్దిదారులు సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక కృతజ్ఞతలుతెలిపారు. అనంతరం పరిటాలశ్రీరామ్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ వైద్యసేవలు అందక ప్రైవేటు ఆస్పత్రులలో చికిత్స పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారిని సీఎంఆర్ఎఫ్ ద్వారా ముఖ్యమంత్రి ఆదుకుంటున్నారన్నారు. అయితే గత కొన్ని రోజులుగా మెడికల్ కళాశాలల నిర్మాణాలు, ఎన్టీఆర్ వైద్యసేవలు విషయంలో దుష్ప్రచారాన్నినమ్మవద్దన్నారు.మెడికల్ కళాశాలలతో పాటు ఎన్టీఆర్ వైద్యసేవలను ఎక్కడా ప్రైవేటు పరం చేయడంలేదన్నారు.

# పెద్దపేటలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన తహసిల్దార్

**యాడికి , సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్ :**



మండల పరిధిలోని పెద్దపేట గ్రామంలో సోమవారం తహసిల్దార్ ప్రతాప్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు,వీఆర్వో దామోదర్ నాయుడు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమం ను నిర్వహించారు.ఈ సందర్భంగా హశీల్దార్ ప్రతాప్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు లు మాట్లాడుతూ నూతన స్మార్ట్ కార్డులు ప్రజలకు గతంలో కంటే ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. రేషన్ సరుకులు స్మార్ట్ కార్డు ల ద్వారా సులభంగా పొందవచ్చు అని,స్మార్ట్ కార్డులలో లబ్ధిదారుల పేర్లు తప్పు దొర్లి ఉంటే, లేదా అందని వారు తహసిల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని లబ్ధిదారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపేట స్టోర్ డీలర్ చంద్రమోహన్ నాయుడు, మండల కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు, వేలూరి రంగయ్య, మాజీ ఎంపిటిసి దడియాల ఆదినారాయణ, తాంద్ర విక్రమ్, కోడూరు నీలకంఠ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్యుల్లో ఒకే ఒక్కడు డా. కొల్లూరి !

- భారతదేశ ప్రథమ రాష్ట్రపతి డా. రాజేంద్ర ప్రసాద్ జాతీయ సేవా ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్న డా. కొల్లూరి

**పెడన సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్**



పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి (ఆప్స్) కొల్లూరి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు (కేసిటి) వ్యవస్థాపకులు గౌరవ డాక్టరేట్ అవార్డు గ్రహీత డా. కొల్లూరి సత్యనారాయణ (చిన్నా) కు మరొక అరుదైన అత్యున్నత గౌరవం భారత దేశ ప్రథమ రాష్ట్రపతి డా. రాజేంద్ర ప్రసాద్ జాతీయ సేవా పురస్కారం ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్నారు. విశాఖపట్నంకి చెందిన దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ సంస్థ స్థాపించి 37 సంవత్సరాలు విశాఖ రత్న కళాపరిషత్ సంస్థ స్థాపించి 27 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ఒరిస్సా రాష్ట్రాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రతిభావంతులను గుర్తించి వివిధ అవార్డులను అందజేశారు. డా. కొల్లూరి కరోనా కష్టకాలంలో ప్రజలకు అందించిన అనేక విశిష్ట సేవలను గుర్తించిన నిర్వాహకులు డా. కొల్లూరికి భారత దేశ ప్రథమ రాష్ట్రపతి డా. రాజేంద్ర ప్రసాద్ జాతీయ సేవా ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపిక చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య సామాజిక వర్గంలో సేవా రంగంలో భారత దేశ ప్రథమ రాష్ట్రపతి డా. రాజేంద్ర ప్రసాద్ జాతీయ సేవా ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్న ఒకే ఒక్కడు డా. కొల్లూరి కావడం ఆర్యవైశ్యులు ఎంతో గర్వించదగ్గ విషయం. దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ విశాఖ రత్న కళాపరిషత్ సంస్థల వారు విశాఖపట్నం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం నందు నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి పైడా విద్యాసంస్థల చైర్మన్ పైడా కృష్ణప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసిన

ఈ కార్యక్రమంలో సినీ దర్శకులు దుగ్గివలస దివాకర్ డాక్టర్ యు సూర్యనారాయణ దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ విశాఖ కళాపరిషత్ వ్యవస్థాపకులు పీఏ భాస్కరరావు ప్రతిభ క్రీడ అండ్ సంస్కృతిక ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి అడవి రాజు తదితరులు డా. కొల్లూరి ని దుశ్శాలువ వస్త్ర కిరీటంతో సత్కరించి ప్రశంసా పత్రంతో పాటు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా పెన్ పవర్ దినపత్రిక ఎడిటర్ మామిడాల శ్రీనివాస రావు ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ సేవా కార్యక్రమాల కమిటీ చైర్మన్ మామిడి వెంకట వరప్రసాదరావు కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం అధికార ప్రతినిధి చిట్టూరి పశుపతినాథ్ బాబు కృష్ణాజిల్లా ఆర్యవైశ్య యువజన విభాగం ఉపాధ్యక్షులు చిలకల బాలాజీ పెడన మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దేసు శ్రీనివాస్ పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి కే టీ మురళీకృష్ణ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొల్లూరి రాజా ఆర్యవైశ్య యువజన నాయకులు ఇమ్మడి మంగమోహన్ కేసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన అధ్యక్షురాలు కొమ్మూరి విజయదుర్గ పెడన పట్టణ శ్రీ వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు తమ్మన లక్ష్మీ తాయారు తదితరులు డా. కొల్లూరికి అభినందనలు తెలియజేశారు.

## తాడిమర్రి మండలంలో రెవెన్యూ సమస్యల
# పరిష్కారంలో నిర్లక్ష్యం

- నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లిన పరిటాల శ్రీరామ్
- బాధితుల సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదని శ్రీరామ్ నిలదీత



**ధర్మవరం సెప్టెంబర్ 15,అనంత జనశక్తి న్యూస్**

తాడిమర్రి మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యంపై ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులు మండల పరిధిలోని భూ సమస్యల పరిష్కారం బాధితులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. కొందరు వీఆర్ఓలు తహసీల్దార్ పేరు చెప్పి.. దాట వేస్తుండగా తహసీల్దార్ కార్యాలయంలో కూడా సరైన సమాధానం లేకపోవడంతో పలువురు బాధితులు శ్రీరామ్ వద్దకు వెళ్లారు. దీనిపై ఫోన్ ద్వారా సమస్య వివరించిన పట్టించుకోకపోవడంతో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న గ్రీవెన్స్ కు శ్రీరామ్ బాధితులతో కలసి వెళ్లారు. తహసీల్దార్ వద్దకు వెళ్లిన బాధితుల ఆవేదనను వినిపించారు. కొన్ని ఉదాహరణలను కూడా చూపిస్తూ.. ఎందుకు వీటిని పరిష్కరించడం లేదన్నారు. సమాధానం దాట వేస్తున్న వీఆర్ఓలను కూడా అధికారులు పిలిపించారు. వారు ఒకరిపై ఒకరు చెప్పుకోవడంతో బాధితులు, శ్రీరామ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తాతల కాలం నుండి ఉన్న భూమిని ఇతరుల పేరు మీదకి మార్చడం.. ఆస్తులను తగ్గించడం లాంటివి చేశారన్నారు. అసలు తమ ప్రమేయం లేకుండా రికార్డులు ఎలా మారుస్తారని బాధితులు నిలదీశారు. దీనిపై తహసీల్దార్ అసలు పట్టించుకోవడం లేదని ఆయన ముందే చెప్పారు. శ్రీరామ్ మాట్లాడుతూ న్యాయమైన వాటిని కూడా పరిష్కరించడానికి నెలల తరబడి తిప్పడం సరైంది కాదని.. ఇక నుంచి ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలయాపన చేయడం సరైంది కాదన్నారు.

## జిల్లా కేంద్రం పుట్టపర్తిలో నిర్వహించే సేవా పక్షోత్సవాలు – 2025
# విజయవంతం చేయండి



**పుట్టపర్తి రూరల్:సెప్టెంబర్:15**
**అనంత జనశక్తి న్యూస్:**

ఈరోజు శ్రీ సత్యసాయి జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో పుట్టపర్తి టౌన్ అధ్యక్షులు కళ్యాణ్ కుమార్ ఆధ్వర్యంలో సేవా పక్షోత్సవాలకు సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణ గౌడ్ జిల్లా అధికార ప్రతినిధి, సేవ పక్షోత్సవాల టౌన్ కన్వీనర్ జ్యోతి ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 17వ తేదీ తేదీ నుంచి అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు ఈ సేవా పక్షోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని, ముఖ్యంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడం మోడీ గారి డాక్యుమెంట్రీ ప్రదర్శన, పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ గారి జీవిత చరిత్ర మరియు ఆత్మ నిర్భర్ భారత్ పై సెమినార్లను మరియు స్వదేశీ వస్తువుల ప్రచారం నిర్వహించడం గురించి ప్రజలకు తెలియజేయాలని తీర్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సునీల్ వైట్ల, బీజేపీ సీనియర్ నాయకులు కొండమరాజు బాలగంగాధర్, జిల్లా కోశాధికారి సురేంద్రబాబు జిల్లా కార్యదర్శి కుసుమ జయరాం, జిల్లా కార్యవర్గ సభ్యులు సోకే రామాంజనేయులు గాయత్రి యాదవ్ , ఐటీ సెల్ జిల్లా కన్వీనర్ భాస్కర్ పట్టణ ప్రధాన కార్యదర్శులు నారాయణ లక్ష్మీనారాయణ నాయక్, రామాంజినాయక్, భరత్ పుట్టపర్తి రూరల్, బుక్కపట్నం మండల అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, మహమ్మద్ రఫీ, చెన్నప్ప , తదితర బిజెపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఇంజినీరింగ్ రంగంలో సర్ మోక్షగుండం
# విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయం

- తెదేపా నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు

**విజయవాడ రూరల్ సెప్టెంబర్ 15,**
**అనంత జనశక్తి న్యూస్**



తమ మేధోశక్తితో మానవ మనుగడకు ఎన్నో ఫలాలను అందించిన ఘనత ఇంజనీర్లదేనని టిడిపి నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం ఇంజనీర్స్ డే సందర్భంగా దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఇంజనీర్లందరికీ దేవినేని ఉమా శుభాకాంక్షలు తెలియజేశారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినమైన (సోమవారం)సెప్టెంబర్ 15ను పురస్కరించుకొని, ఆయన జ్ఞాపకార్థం ఇంజనీర్స్ డే జరుపుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.గొల్లపూడి కార్యాలయంలో స్థానిక నేతలతో కలసి మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశ ఆర్థికాభివృద్ధి, భారతావని ప్రగతికి బలమైన పునాదులు నిర్మించారని దేవినేని ఉమా కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ మీద మమకారంతో హైదరాబాద్‌లో మూసి నది మునక ప్రాంతాలకు రక్షణగా సివిల్ ఇంజినీరింగ్‌తో నిర్మాణాలు చేపట్టారన్నారు. భారతీయ ఇంజనీరింగ్ రంగానికి పితామహుడుగా అభివర్ణించవచ్చు అని, తన నైపుణ్యాలతో, ఇంజనీరింగ్ పరిజ్ఞానంతో దేశాన్ని అభివృద్ధివైపు అడుగులు నడిపించిన నవభారత నిర్మాతల్లో ఒకరన్నారు. విశ్వేశ్వరయ్య చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 1955లో భారతరత్న ప్రదానం చేసి సత్కరించిందన్నారు. విశ్వేశ్వరయ్య ఈ దేశానికి చేసిన సేవలకు గాను 1968లో తన పుట్టిన రోజును జాతీయ ఇంజనీర్ల దినోత్సవం(National Engineers Day)గా ప్రకటించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో సర్ ఆర్థర్ కాటన్, డా.కె.ఎల్.రావు, శ్రీరామకృష్ణయ్య వంటి ప్రముఖ ఇంజనీర్ల జయంతులను రాష్ట్ర పండుగలుగా నిర్వహించేలా చర్యలు చేపట్టారని ఈ సందర్భంగా గుర్తు చేసారు. నేటి భారతీయ సమాజంలో ఉన్న నవ యువ ఇంజనీర్లు సమాజంలో ఉన్న సమస్యలకు ఇంజనీరింగ్ రంగం ద్వారా పరిష్కారం వెతికి దేశం ముందుంచాలని సూచించారు. అప్పుడే విశ్వేశ్వరయ్య ఆశయాలు, కలలు సాకారమవుతాయి. ఇంజనీర్స్ డేకి అర్థముంటుందన్నారు.

## ఏపీ మహిళల ఆర్థిక సాధికారత లో
# ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ముందంజ

- మహిళా అభివృద్ధికి దేశానికి ఏపి రోల్ మోడల్ గా నిలుస్తుందని భావిస్తున్నా.
- మహిళల విద్య, ఆరోగ్యం, వ్యాపారారంగం మరియు డిజిటల్ చేర్పు కోసం "తిరుపతి పార్లమెంటరీ మరియు శాసనసభ కమిటీ తొలి మహిళా జాతీయ సదస్సు తీర్మానం" ఆమోదం ఒక చరిత్రాత్మకం .
- పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర అసెంబ్లీలో అద్భుత ప్రసంగాలపై సోషల్ మీడియాలో చూసి ప్రత్యేకంగా అభినందించిన కేరళ మహిళా ప్రజాప్రతినిధులు.
- తిరుపతిలో జరిగిన తొలి పార్లమెంటరీ మరియు శాసనసభ కమిటీల జాతీయ సదస్సులో




**పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి వెల్లడి.**

**పుట్టపర్తి : సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్**

మహిళా సాధికారత లో ఆంధ్రప్రదేశ్ లో కొనసాగుతున్న కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో దేశంలోనే రాష్ట్రం ఎంతో ముందంజలో ఉందని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. తిరుపతిలో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ పార్లమెంటరీ మరియు శాసనసభ కమిటీల తొలి జాతీయ సదస్సులో సోమవారం ముగింపు సదస్సులో పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి అక్కడికి విచ్చేసిన మీడియాతో మాట్లాడారు. మహిళా సాధికారతలో రాజకీయ ఆర్థిక సామాజిక విద్య వైద్య రంగాల్లో ఆంధ్రప్రదేశ్ దేశానికి రోల్ మోడల్ గా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిలుపుతారని విశ్వాసం నమ్మకం తమకు ఉందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు. మహిళల సాధికారత కోసం స్థిరమైన ఆర్థిక సాధికారత ఎంతో అవసరం అన్నారు. ఈ సందర్భంగా "తిరుపతి తీర్మానం" ఆమోదించబడిందని చరిత్రలో ఈ జాతీయ సదస్సు ఇది మైలురాయిగా నిలిచిపోతుందని తెలిపారు.ఎంతో
చారిత్రాత్మకంగా మహిళా సాధికారతకు అంకితమైన మహిళల సాధికారత అనేది కేవలం సామాజిక అవసరం మాత్రమే కాకుండా ఆర్థిక అవసరమని తెలిపారు.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఏపీలో మహిళల ఆరోగ్యం, విద్య, నైపుణ్యాలు, వ్యాపారా రంగంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా రాష్ట్రంలో అపారమైన మానవ వనరులను వెలికి తీయగలదని, బలమైన సామాజికఆర్థిక అభివృద్ధి నమూనాను కూటమి ప్రభుత్వం నిర్మించగలదని భావిస్తున్నట్లు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు. అనంతరం పలు రాష్ట్రాల మహిళా ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆ రాష్ట్రాల్లో మహిళలకు అమలవుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా కేరళ రాష్ట్ర మహిళా ప్రజాప్రతినిధులతో ప్రత్యేకంగా ఈ విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు. కేరళలో విద్యాభ్యాసం చేసి అక్కడే పుట్టి పెరిగి ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో పుట్టపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహిస్తున్న పల్లె సింధూర రెడ్డిని వారు ప్రత్యేకంగా అభినందించారు. పుట్టపర్తి నియోజకవర్గ ప్రజల సమస్యల పైనే కాకుండా అనేక అంశాలపై అసెంబ్లీలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అద్భుతంగా మాట్లాడిన అంశాలను సోషియల్ మీడియా ద్వారా చూసామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూరను కేరళ మహిళా ప్రజాప్రతినిధులు ప్రశంసిస్తూ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## సురక్ష వెహికల్ ద్వారా
# సైబర్ నేరాలపై అవగాహన

-జిల్లా ఎస్పీ ఆదేశాలతో విద్యార్థుల్లో చైతన్యం

**రాయదుర్గం సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్**

జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ ఆదేశాల మేరకు... డి.హీరేహాళ్ మండల కేంద్రంలోని కె.జి.బి.వి, బిసి హాస్టల్ మరియు జడ్పీ ఉన్నత పాఠశాలలలో ఈరోజు సైబర్ నేరాలు- అనర్థాలపై పోలీసులు అవగాహన చేపట్టారు. "సురక్ష" LED డిస్ప్లే బొలేరో వాహనాన్ని ఆయా గ్రామాలు మరియు పాఠశాలలకు తీసికెళ్లి నేరాలపై ప్రొజెక్టర్ ద్వారా వీడియోలు చూయిస్తూ ప్రజలు/విద్యార్థులను అప్రమత్తం చేశారు. గుడ్ టచ్ & బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు, సైబర్ నేరాలు( డిజిటల్ అరెస్టు, పార్ట్ టైం జాబ్ ఫ్రాడ్స్, APK ఫైల్ ఫ్రాడ్, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ )... రోడ్డు ప్రమాదాలు నియంత్రణ ( హెల్మెట్ / సీట్ బెల్టు ధరించడం, తదితర రోడ్డు భద్రతా నియమాల పాటింపు) ...గంజాయి, మాదక ద్రవ్యాలు, అనర్థాలపై అవగాహన చేశారు.




## పేరం స్వర్ణలత ని పరామర్శించిన మండల కన్వీనర్ సంజీవరాయుడు



**యాడికి, సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్:**

మండల వైకాపా కన్వీనర్ ,తూట్రాలపల్లి సర్పంచు సంజీవరాయుడు సోమవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలత ని పరామర్శించారు.
హైదరాబాద్ లో బ్రెయిన్ సర్జరీ చేయించుకుని తాడిపత్రి లోని తన నివాసంలో వైఎస్ఆర్ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలత విశ్రాంతి తీసుకుంటున్నారు.ఈ విషయంను తెలుసుకోని మండల వైకాపా కన్వీనర్ , తూట్రాలపల్లి సర్పంచు సంజీవరాయుడు వైఎస్ఆర్ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలత ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, త్వరగా కోలుకోవాలని కోరారు.ఈయన తో పాటు పెద్దవడుగురు మండల వైస్సార్సీపీ కన్వీనర్ ఎద్దుల శరబరెడ్డి ,భీముని పల్లి సర్పంచు రామచంద్ర రెడ్డి,రామక్రిష్ణ రెడ్డి, కేశవరెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

## స్టార్ ప్యారడైజ్ హైస్కూల్ లో ఘనంగా ఇంజనీర్స్ డే



**యాడికి , సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రంలో ఉన్న స్టార్ ప్యారడైజ్ హైస్కూల్ లో సోమవారం ఇంజనీర్స్ డే ను ఘనంగా నిర్వహించారు.ఇంజనీరింగ్ విభాగంలో అద్భుతాలను సృష్టించిన ప్రఖ్యాత ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి ని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా పాఠశాల మేనేజ్ మెంట్ నాగేంద్ర మాట్లాడుతూ భారతదేశ సాంకేతిక నైపుణ్యాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన మహనీయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని తెలిపారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజనీర్స్ డే నిర్వహించుకుంటామని తెలిపారు. ఆయన స్ఫూర్తితో విద్యార్థులు మంచి క్రమశిక్షణతో ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో అత్యున్నత స్థాయిలో రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శశినేత్ర, పరమేష్,అమరావతి, కుమారి పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. ఫోటో: మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

## జిల్లా కుర్ణి చేనేత సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక



**అనంతపురం, సెప్టెంబర్ 15 : అనంత జనశక్తి న్యూస్**

నగరంలోని దేవాంగ భవనంలో సోమవారం కుర్ణి కుల సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లాలోని ఆత్మకూరు, కళ్యాణదుర్గం, కణేకల్లు, డి.హీరేహాళ్, ఉరవకొండ, ధర్మవరం, హిందూపురం, గుంతకల్లు తదితర ప్రాంతాలను కుర్ణి కులస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సమావేశం అనంతరం జిల్లా కుర్ణి చేనేత సంక్షేమ సంఘం కమిటీని ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా కునే బసవరాజు, బండ రాజప్ప, జిల్లా అధ్యక్షులుగా బండ రఘు, ఉపాధ్యక్షులుగా కూన ప్రహ్లాద, అనప బాలాజీ, కార్యదర్శిగా బుట్ట తిప్పేస్వామి, సంయుక్త కార్యదర్శిగా బుదూర్ శివశంకర్, కోశాధికారిగా రోడ్డ మహదేవ్ ప్రసాద్, బుదూర్ నీలకంఠలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు.

## ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ ఆకస్మిక తనిఖీ



- ప్రయోగశాలలో ఎరువులు మరియు విత్తనాల ఫలితాల పరిశీలన.
- సత్యసాయి జిల్లా వ్యవసాయ సంచాలకులు శ్రీరామ్ నాయక్.

**ధర్మవరం రూరల్ సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్:**

పుట్టపర్తి శ్రీ సత్యసాయి జిల్లా వ్యవసాయ అధికారి శ్రీరామ్ నాయక్ మరియు సహాయ వ్యవసాయ సంచాలకులు ధర్మవరం లక్ష్మణ నాయక్, ధర్మవరం మార్కెట్ యార్డ్ లోని ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ సందర్శించి తనిఖీ చేయడం జరిగింది. ప్రయోగశాలలో ఎరువుల మరియు విత్తనాల ఫలితాలను పరిశీలించడం జరిగింది. ఏఈఓ లు వీరాంజినేయులు మరియు జగదీష్ ప్రయోగ విదానం జిల్లా వ్యవసాయ అధికారి కి వివరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎరువులు విత్తనాల పరీక్షలను గడువు లోపల పూర్తి చేసి ఫలితాలను సమర్పించ వలసిందిగా సూచించడం జరిగింది .ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ముస్తాఫా ,ఏవోలు జగదీష్ వీరాంజి పాల్గొనడం జరిగింది.

# ఎక్సైజ్ కమీషనర్ గా రాహుల్ దేవ్ శర్మ కు అదనపు బాధ్యతలు



**అమరావతి, సెప్టెంబర్ 15:**
**అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎక్సైజ్ శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సీనియర్ ఐపీఎస్ అధికారి రాహుల్ దేవ్ శర్మకు ఎక్సైజ్ కమీషనర్ గా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫలితంగా రాహుల్ దేవ్ శర్మ ఇకపై డైరెక్టర్, ఎక్సైజ్ & ప్రొహిబిషన్; మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్; కమిషనర్, డిస్టిలరీస్ & బ్రూవరీస్ హోదాలలో అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. ఈ తాత్కాలిక ఏర్పాట్లు తదుపరి ఆదేశాలు వచ్చే వరకు కొనసాగుతాయని ప్రభుత్వం ప్రకటించింది.

# సరిపుటి రమణ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**అనంతపురం సెప్టెంబర్ 15,అనంత జనశక్తి న్యూస్**

జీసెస్ నగర్ నందు స్మార్ట్ రేషన్ కార్డులను క్లస్టర్ ఇంచార్జ్ సరిపూటి రమణ ఆధ్వర్యంలో పంపిని చేయడం జరిగింది ఈ కార్యక్రమం కు ముఖ్య అతిధులు గా జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఎమ్మార్వో హరి పాల్గొన్నారు ఈ కార్యక్రమం లో రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణ రాయల్ మురళి గాజుల ఆదేన్న రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేష్ మాజీ కార్పొరేటర్లు బల్లా పళ్ళవి సీసాల శీను జిల్లా అధికార ప్రతినిధి నారాయణ స్వామి యాదవ్ మాజీ కో అప్షన్ మెంబర్ కృష్ణ కుమార్ మున్వర్ యూనిట్ ఇంచార్జ్ రజాక్ ఎన్.బి.కె నారాయణ స్వామి చెర్లోపల్లి రామకృష్ణ లక్ష్మి సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి లాగ రేషన్ కార్డుల పైన చిన్న పిల్లల స్కూల్ బ్యాగ్ ల పైన చివరి కి బెల్ట్ పైన ఎక్కడ పడితే అక్కడ తన బొమ్మలు వేసుకొని ప్రచారం చేసుకో కుండా ప్రజలకు ఉపయోగపడే విధంగా పాలన చేస్తూ ఇది మంచి ప్రభుత్వం అనే విధంగా చంద్రబాబు నాయుడు పేరుతెచుకున్నారు అన్నారు

# రాష్ట్ర టూరిజం శాఖ డైరెక్టర్ గా ఎన్నికైన ఈ జయప్ప కు ఘన సన్మానం



**లేపాక్షి సెప్టెంబర్ 15 అనంత జనశక్తి న్యూస్**

తెలుగుదేశం పార్టీలో లేపాక్షి పంచాయితీ సర్పంచ్ గా గెలుపొంది తరువాత టిడిపి మండల పార్టీ కన్వీనర్ గా బాధ్యతలు స్వీకరించి అప్పటినుంచి నుంచి ఇటు ప్రజలలో అటు పార్టీ కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొని మంచి నాయకునిగా పేరు తెచ్చుకొని స్థానిక ఎమ్మెల్యే కు లేపాక్షి మండలంలో నమ్మకమైన వ్యక్తిగా అత్యంత సన్నిహితుడుగా ఉండడంతో అతని సేవలను గుర్తించి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర టూరిజం శాఖ డైరెక్టర్ గా ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని మండల టిడిపి నాయకులు పేర్కొన్నారు .ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఈడిగ జయప్ప కు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. భారీ కేకును కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన తహసిల్దారు



**రాయదుర్గం , సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్ :**

గుమ్మగట్ట మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయం నందు సోమవారం తహసిల్దార్ రజా క్ వలి నూతన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేచారు.ఈ సందర్భంగా తహశీల్దార్ రజాక్ వలి, డిప్యూటీ తహశీల్దార్, విజయలక్ష్మి మాట్లాడుతూ నూతన స్మార్ట్ కార్డులు ప్రజలకు గతంలో కంటే బాగా ఉపయోగపడతాయని తెలిపారు. రేషన్ సరుకులు స్మార్ట్ కార్డు ల ద్వారా సులభంగా పొందవచ్చు నని,స్మార్ట్ కార్డులలో లబ్ధిదారుల పేర్లు తప్ప లు ఉంటే, లేదా మార్పులు, కార్డులు అందనివారు తహసిల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని లబ్ధిదారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టోర్ డీలర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. గుమ్మఘట్ట మండల పరిధిలోని పూలకుంట గ్రామం నందు గుమ్మగట్ట మండల డిప్యూటీ తహసిల్దార్ విజయలక్ష్మి తమ రెవెన్యూ సిబ్బందితో లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పూలకుంట, గౌనుకుంట డీలర్లు కార్డుల యజమానులు పాల్గొన్నారు.

# వైద్య కళాశాలలు ప్రైవేటుకి – ప్రభుత్వ విద్యార్థుల ఆరోగ్యం గాలికి: చంద్రశేఖర్ యాదవ్



**అనంతపురం అర్బన్ 15 , అనంత జనశక్తి న్యూస్**

కూటమి ప్రభుత్వంలో,ప్రభుత్వ హాస్టళ్లలో శానిటేషన్ సరిగా లేకపోవడం,నాణ్యతలేని ఆహారం,వాతావరణ మార్పుల వలన విద్యార్థులకి ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని దీని ఫలితంగా అనారోగ్య సమస్యలు,చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్లు,శ్వాస సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయని సరైన టాయిలెట్లు,శుభ్రమైన నీరు,సరైన గాలి ప్రవాహం వంటి మౌలిక అవసరాల లోపం వలన ఇవి ఎక్కువగా కనిపిస్తున్నాయని వీటన్నిటి ఫలితంగా చర్మ మరియు దంత సమస్యలు వస్తున్నాయని, శ్వాస సంబంధ సమస్యలు మరియు డయేరియా, మలేరియా, టైఫాయిడ్ లాంటి వ్యాధులు ప్రబలిస్తున్నాయని ప్రభుత్వ హాస్టల్స్లో ఎమర్జెన్సీ మెడిసిన్ కూడా లేని పరిస్థితి కూటమి ప్రభుత్వంలో దాపురించిందని,నాణ్యమైన ఆహారాలు ఇవ్వకపోవడం వల్ల పోషకాలు లోపించి అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని వైయస్సార్ విద్యార్థి విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్ అనంతపురం కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ మలోలాకి సమస్యను తెలియజేశారు.కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు దోమ తేరలు లేకపోవడం,అధిక జనసాంద్రత,మరియు వాతావరణ కాలుష్య ప్రాంతం,అపరిశుభ్ర ఆహార తయారీ,మౌలిక సదుపాయాల లోపం,సిబ్బంది కొరత మరియు పర్యవేక్షణ లేకపోవడం జరుగుతుందని తెలియజేసారు. ప్రభుత్వం తరఫున విద్యార్థులకు ఆరోగ్యం గురించి జాగ్రత్తలు వహించాలని వైస్సార్ విద్యార్థి విభాగం తరపున విజ్ఞప్తి చేసారు. ప్రతి నెల రెండు పర్యాయాలు డాక్టర్లు ప్రభుత్వ హాస్టళ్లలో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని,రక్త పరీక్షలు నిర్వహించాలి. అనీమియాని అధిగమించడానికి ఐరన్ టాబ్లెట్స్ పంపిణీ చేయాలని,సీజనల్ ప్రభావం వల్ల ప్రబలుతున్న వ్యాధులను అరికట్టాలని,అందుకోసం ప్రత్యేకంగా వైద్య సిబ్బందిని నియమించాలని,ప్రతి ప్రభుత్వ హాస్టళ్లలో మందులను ఏర్పాటు చేయాలని. ,ప్రభుత్వ స్కూళ్లలో కచ్చితంగా ఆరోగ్య పరీక్షలు చేయాలని,కూటమి ప్రభుత్వం మొద్దు నిద్ర లేచి విద్యార్థుల ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ రాయల్, నగర అధ్యక్షుడు కైలాష్,నగర ప్రధాన కార్యదర్శులు అశోక్ రాయల్, నరేందర్ రెడ్డి,రాహుల్ రెడ్డి,లోకేష్,సాయి,నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు

## ఎస్పీ రత్నా శాంతి భద్రతల విషయంలో
# ఎంతో అద్భుతంగా పనిచేశారు

- సత్యసాయి పుట్టపర్తి జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని ఫ్రెండ్లీ పోలీస్ గా గుర్తింపు తీసుకొచ్చారు.
- బదిలీపై వెళ్తున్న సత్యసాయి పుట్టపర్తి జిల్లా ఎస్పీ రత్నా ను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి.



**పుట్టపర్తి సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్**

సత్య సాయి పుట్టపర్తి జిల్లా ఎస్పీగా శ్రీమతి రత్న ఎంతో అద్భుతంగా నిక్కచ్చిగా నిస్వార్థంగా నిజాయితీగా విధులను నిర్వర్తించారని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కొనియాడారు. సత్య సాయి పుట్టపర్తి జిల్లా ఎస్పీగా పనిచేసిన శ్రీమతి రత్న బదిలీపై వెళ్తున్న సందర్భంగా సోమవారం ఎస్పీ క్యాంపు కార్యాలయం లో ఎస్పీ రత్నాని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందించి సత్యసాయి బాబా మెమెంటో ను బహకరించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ , సత్య సాయి పుట్టపర్తి జిల్లా ఎస్పీగా శ్రీమతి రత్న పని చేసిన ఈ 15 మాసాల్లో శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ లేకుండా విధులు నిర్వహించారని కొనియాడారు. సత్య సాయి జిల్లాలో ఎలాంటి హింసాత్మక సంఘటనలు జరగకుండా రౌడీయిజం ఫ్యాక్షనిజం వంటి నిర్మూలనకు సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న పోలీస్ యంత్రాంగాన్ని వెన్నంటి నిలిచి పెండ్లి పోలీస్ గా ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. మహిళలపై నేరాలు, గృహింస, పిల్లలపై ఆకృత్యాలు, నేర సంఘటనలు పూర్తిగా తగ్గాయని ఇందుకు జిల్లా ఎస్పీ రత్న నేతృత్వంలో జిల్లా పోలీస్ యంత్రాంగం ఎంతో అద్భుతంగా విధులు నిర్వర్తించారని పేర్కొన్నారు. అదే విధంగా గత నెలలో కొత్తచెరువు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,మంత్రి నారా లోకేష్ పర్యటన సందర్భంగా ఇలాంటి సంఘటనలు జరగకుండా ఎంతో ప్రశాంతంగా నిర్వహించిన ఎస్పికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రభుత్వం ఎక్కడ బాధ్యతలు అప్పగించినా నిస్వార్ధంగా ,ఎంతో నిజాయితీగా తమ బాధ్యతలు నిర్వహిస్తారనే విశ్వాసం ఉందని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు. మాజీమంత్రితోపాటు పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి నాయకులు పుట్టపర్తి పట్టణ టిడిపి కన్వీనర్ బోయ రామాంజనేయులు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రత్నప చౌదరి , ఓబులేసు, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఒలిపి శ్రీనివాసులు కొత్తచెరువు టిడిపి కన్వీనర్ రామకృష్ణ బుక్కపట్నం టిడిపి కన్వీనర్ మల్ రెడ్డి, గంగాధర్ , మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నంజప్ప, టిడిపి మాజీ కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి మంగళవారం ఇండస్ట్రీ డే

- రూ.10లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపిన ప్రభుత్వం
- జిల్లాలో పెట్టుబడి పెట్టే ప్రతి పారిశ్రామికవేత్తతోనూ స్వయంగా మాట్లాడండి
- క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను తక్షణం పరిష్కరించండి
- జీఎస్డీపీలో పారిశ్రామిక రంగానిది 44 శాతం వాటా
- ఈ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- కలెక్టర్లకు పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ సూచన



**అమరావతి సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్**

జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ గ్రీవెన్స్ డే లాగానే ప్రతి మంగళవారం ఇండస్ట్రీడే కార్యక్రమం నిర్వహించాలని పరిశ్రమల శాఖ కార్యదర్శి డాక్టర్ ఎన్. యువరాజ్ జిల్లా కలెక్టర్లకు సూచించారు. రాష్ట్ర పారిశ్రామిక రంగానికి సంబంధించి ఆయన సచివాలయంలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో ప్రజంటేషన్ ఇచ్చారు. రాష్ట్ర జీఎస్డీపీలో 44 శాతం వాటా పారిశ్రామిక రంగమే అందిస్తోందన్నారు. జిల్లాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలు, సంస్థలతో జిల్లా కలెక్టర్లు స్వయంగా సంప్రదింపులు జరిపి క్షేత్ర స్థాయిలో వారికి ఎదురవుతున్న సమస్యలు తెలుసుకుని వాటిని తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమలు స్థాపించాలంటే ఎవరికైనా భూమి చాలా ముఖ్యమని, పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూ సేకరణకు జిల్లా కలెక్టర్లు అత్యంత ప్రాధాన్యమివ్వాలన్నారు. ప్రభుత్వ భూములు లభ్యత లేనిచోట ప్రైవేటు భూములు సేకరించాలంటే వారితో మాట్లాడి ల్యాండ్ పూలింగ్ విధానంలో భూసేకరణ చేపట్టాలన్నారు. భూ సేకరణ విషయంలో జిల్లా కలెక్టర్లు సంక్లిష్టంగా కాకుండా కొంత సరళీకృతంగా పనిచేయాలన్నారు. ఆయా జిల్లాల్లో ప్రతి ప్రాజెక్టు గ్రౌండింగ్ అవ్వడానికి ఒక కాలపరిమితి పెట్టుకుని ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల్లో ప్రతి ఎకనామిక్ హబ్‌కు ఒక జిల్లా అధికారిని నియమించి, ఆ ఎకనామిక్ హబ్‌లో ఎదురవుతున్న సవాళ్లు, సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాల్లో పరిశ్రమలు రావాలంటే అక్కడ కలెక్టర్లు ఎలా పనిచేస్తున్నారనేది చాలా ముఖ్యమన్నారు. ఎంఎస్ ఎంఈలపైన కూడా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా ఆర్థికాభివృద్ధికి ఊతమిచ్చేవి ఎంఎస్ ఎంఈలేనని తెలిపారు.

**రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం**

కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక జూన్ 2024 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో రూ.10,06,799 కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించి 122 ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిచ్చిందని వెల్లడించారు. ప్రస్తుతమున్న 30 క్లస్టర్లు, రాబోయే 20 క్లస్టర్లకు సంబంధించి లక్ష ఎకరాలకు పైగా ఖాళీ స్థలాలు గుర్తించామన్నారు. జిల్లా కలెక్టర్లందరూ ఈ భూసేకరణకు సంబంధించి ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. రాష్ట్రంలో ఐదు చోట్ల డిఫెన్స్ క్లస్టర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విశాఖపట్నంశ్రీకాకుళం జిల్లాల మధ్య 3 వేల ఎకరాల్లో నావల్ క్లస్టర్, ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో 3 వేల ఎకరాల్లో మిస్సైల్, అమ్యూనిషన్ క్లస్టర్, కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 3 వేల ఎకరాల్లో అన్ మ్యాన్డ్ సిస్టమ్ క్లస్టర్, అనంతపురం జిల్లా మడకశిరలేపాక్షి మధ్య 45వేల ఎకరాల్లో ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్ క్లస్టర్స్,ప్రకాశం జిల్లా దొనకొండలో 4 వేల ఎకరాల్లో ఎయిర్‌క్రాఫ్ట్ విడిభాగాల తయారీ క్లస్టర్ ఏర్పాటు కాబోతున్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోపే కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర పారిశ్రామిక రంగానికి సంబంధించి 50కిపైగా ప్రాజెక్టులకు అనుమతిచ్చిందని వెల్లడించారు. వీటిపైన కూడా జిల్లా కలెక్టర్లు ఎక్కువ దృష్టి సారించాలని సూచించారు.

# జిల్లా పోలీస్ పిజిఆర్ఎస్ కు 121 పిటీషన్లు

- జాప్యం లేకుండా చట్టపరిధిలో పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్

**అనంతపురం సెప్టెంబర్ 15,అనంత జనశక్తి న్యూస్**

జిల్లా పోలీసు కాన్ఫరెన్స్ హాలులో (సోమవారం) "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం)" కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ పి.జగదీష్ నిర్వహించారు.ప్రజల సమస్యలను నేరుగా విని, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను స్వీకరించారు,కుటుంబ కలహాలు, అత్తారింటి వేదింపులు, రస్తా తగాదాలు, తదితర సమస్యలపై ఫిర్యాదులు



అందజేసిన పిటీషనర్లు,ఎస్పీ ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, చట్టపరిదిలో "సత్వర న్యాయం అందించాలి – ఆలస్యం చేయరాదు" అని ఆదేశించారు. చట్టపరమైన చర్యలు తీసుకున్న వెంటనే వివరాలతో కూడిన నివేదికలను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని సూచించిన జిల్లా ఎస్పీ జిల్లా ఎస్పీ తో పాటు డీసీఆర్బీ సి.ఐ హరినాథ్ పిజిఆర్ఎస్ కార్యక్రమంలో పాల్గొన్నారు

# బాలికా చైతన్యం దిశగా మిషన్ శక్తి సంకల్ప




**కొత్తచెరువురూరల్ : సెప్టెంబర్:15**
**అనంత జన శక్తి న్యూస్:**

చదువుతోనే అమ్మాయిల భవితకు భద్రత లభిస్తుందని బాలికల్లో చైతన్యం దిశగా మిషన్ శక్తి సంకల్ప అవగాహన లక్ష్యమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ అయ్యగారి రజిత అన్నారు. పుట్టపర్తి సీడీపీఓ జయంతి ఆదేశాల మేరకు ఐసిడిఎస్ సూపర్వైజర్ అయ్యగారి రజిత,భారతి దేవి ఆధ్వర్యంలో కొత్తచెరువు మండలం మిషన్ శక్తి, మిషన్ వాత్సల్య, బేటీ పడావో బచావో సంకల్ప అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు.ముఖ్య అతిథిగా సిడిపివో జయంతి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ఆడపిల్లను బతకనిద్దాం! ఆడపిల్లను చదవనిద్దాం!! తల్లి గర్భంలోనే ఆడపిల్లని చిదిమేస్తున్నారు అలాంటి సమాజం నుంచి ఆడపిల్లలకు రక్షణ కల్పించాలి. ఆడపిల్లలకు చదువు ఎంతో అవసరం చదువు తోనే తనకు భద్రత లభిస్తుంది. ఎదుగుతూనే ఏది మంచి స్పర్శ, ఏది చెడు స్పర్శ తెలుసుకుని నో చెప్పడం నేర్చుకోవాలన్నారు. ఫోక్సో,చైల్డ్ లేబర్,బాలల హక్కులు చట్టాలులపై అవగాహన కల్పించారు. బాలికలు అత్యవసర సమయాల్లో సమయస్ఫూర్తితో మెలగాలని గట్టిగా అరిచి సహాయాన్ని కోరడంతో పాటు , చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్లు 1098,112,100, 114,181 కు ఫోన్ చేసి సహాయం పొందాలన్నారు. గట్టిగా సంకల్పించుకుంటే సాధ్యం కానిది ఏది లేదని పట్టుదలతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకున్నాకే వివాహం గురించి ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ అయ్యగారి రజిత, భారతీదేవి తో పాటు బాలికల ఉన్నత పాఠశాల హెచ్ ఎమ్ , కౌన్సిలర్ వనజాక్షి, సమతా ఎన్ జి వో సభ్యురాలు సునిత, కొత్త చెరువు అంగన్వాడీ కార్యకర్తలు షర్మిల, ఉమాదేవి, శ్రీదేవి,సరస్వతి పాల్గొన్నారు.




# యూరియా వాడకం తగ్గిస్తే ప్రోత్సాహకాలు





- హాస్టళ్లకు కొత్త లుక్ రావాలి... హాస్టళ్ల నిర్మాణాలకు, మరమ్మతులకు నిధులిస్తాం
- యువత ఉపాధి కోసం జాబ్ మేళాలు నిర్వహించండి
- త్వరలో శాశ్వత కుల ధృవపత్రాలు
- విద్యా రుణాలపై వడ్డీ భారం తగ్గించేలా త్వరలో కొత్త పథకం
- ప్రాంతాల మధ్య అభివృద్ధిలో పోటీ
- తొలిరోజు కలెక్టర్ల కాన్ఫరెన్సులో సీఎం చంద్రబాబు

**అమరావతి, సెప్టెంబర్ 15: అనంత జనశక్తి న్యూస్**

సంక్షేమం అంటే దానం కాదు... సాధికారతకు మార్గం సంక్షేమం అంటే పేదలకు చేసే దానం కాదు... వారి అభివృద్ధికి, సాధికారతకు మార్గం అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు అన్ని మార్గాలను వినియోగించుకుందామని చెప్పారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలోని ఐదో బ్లాకులో జరిగిన తొలి రోజు కలెక్టర్ల కాన్ఫరెన్సులో భాగంగా ప్రభుత్వ ఫ్లాగ్ షిప్ ప్రోగ్రామ్‌లు, సూపర్ సిక్స్ పథకాల అమలు, డ్వాక్రా, మెప్మా గ్రూపుల పనితీరు వంటి అంశాలపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. సంక్షేమం - అభివృద్ధి రంగాలకు సమతూకంగా నిధులు ఖర్చు చేస్తున్నాం. మూలధన వ్యయం కూడా చేస్తూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నాం. ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ పథకం, తల్లికి వందనం అందరికీ అందించాం. లబ్ధిదారులకు సాయం అందే విషయంలో తలెత్తే చిన్నచిన్న లోటుపాట్లను కలెక్టర్లు సరిదిద్దాలి. మెగా డీఎస్సీ ద్వారా యువతకు 16,347 ఉద్యోగాలు వచ్చాయి. ఇప్పటికే 6 వేలకు పైగా పోలీసు విభాగంలో ఉద్యోగాలిచ్చాం. ప్రభుత్వ విభాగాల్లో ఖాళీలను గుర్తించి భర్తీ చేస్తాం. ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక గిరిజన యువతకే ఉద్యోగాలు ఇచ్చేలా ఉన్న జీవో3ను సుప్రీం కోర్టు రద్దు చేసింది. దీనిపై ఏం చేయాలనే అంశంపై ఆలోచన చేస్తున్నాం. అలాగే ప్రైవేటు రంగంలోనూ జాబ్స్ వచ్చేలా పెట్టుబడులు ఆకర్షిస్తున్నాం. జిల్లాల్లో యువతకు ఉద్యోగాలు వచ్చేలా జాబ్ మేళాలు ఏర్పాటు చేయాలి." అని ముఖ్యమంత్రి వివరించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం స్త్రీ శక్తి విజయవంతమైంది. ఈవీ బస్సులతో ఖర్చు తగ్గుతుంది. కమర్షియల్ కాంప్లెక్సుల నిర్మాణం, కార్గో ద్వారా ఆర్టీసీ ఆదాయం సమకూర్చుకోవచ్చు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పథకం ద్వారా ఏటా రూ.33 వేల కోట్ల వ్యయం చేస్తున్నాం. అక్టోబరు 1వ తేదీన 3 లక్షల మంది ఆటో డ్రైవర్లకు రూ.15 వేల ఆర్థిక సాయం చేస్తాం." అని చంద్రబాబు పేర్కొన్నారు.

**అన్ని వర్గాలకూ అండగా...**

వడ్డెర్లకు క్వారీల్లో రిజర్వేషన్లు పెట్టడంతో పాటు సీనరేజీలో మినహాయింపు ఇస్తాం. ఇమామ్, మౌజన్లకు కూడా గౌరవవేతనం ఇస్తున్నాం. విజయవాడలో హజ్‌హౌస్ త్వరలోనే పూర్తి అవుతుంది. హజ్ యాత్రికులకు రూ.1 లక్ష ఆర్థిక సాయం చేస్తున్నాం. మసీదుల నిర్వహణకు నెలకు రూ.5 వేలు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నాం. కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినాన్ని రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహిస్తున్నాం. అన్నిదేవాలయ ట్రస్ట్ బోర్డుల్లోనూ బ్రాహ్మణులకు చోటు కల్పించాం. నిర్మాణ రంగంలో వర్కర్ల సంక్షేమం కోసం కూడా బోర్డు ఏర్పాటు చేస్తున్నాం. శాశ్వత కుల ధృవీకరణ పత్రం కూడా త్వరలోనే జారీ చేస్తున్నాం. అల్లూరి సీతారామరాజు పేరును భోగాపురం ఎయిర్ పోర్టుకు పెడతాం. కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు కల్పించాం. తోట చంద్రయ్య, అమర్నాథ్ గౌడ్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యలపై విచారణకు ఆదేశించాం. మత్స్యకారుల సేవలో భాగంగా వేట నిషేధ సమయంలో రూ.20 వేలు ఇస్తున్నాం. ఎవరికీ అన్యాయం జరక్కుండా ఎస్సీ వర్గీకరణను కూడా విజయవంతంగా పూర్తి చేశాం. డ్రైవర్ల సాధికారిక సంస్థ ఏర్పాటు చేసే అంశం పరిశీలిస్తున్నాం. నాయీ బ్రాహ్మణులకు రూ.25 వేల చొప్పున వేతనం ఇస్తున్నాం. అర్చకులకు గౌరవ వేతనం రూ.15 వేలకు పెంచాం. వేద విద్యార్థులకు రూ.3 వేలు ఇస్తున్నాం. జర్నలిస్టులకు ఇళ్లస్థలాల కేటాయించే అంశంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం. అసంపూర్తిగా ఉన్న కాపు భవనాలను పూర్తి చేసేలా కార్యాచరణ చేస్తున్నాం. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారిని ఆదుకునేందుకు కార్యాచరణ చేపట్టాం. రజకులకు దోబీ ఘాట్లు, షెడ్లు, ఇస్త్రీ చేయడానికి ఆధునిక మౌలిక వసతులు కల్పించాలి. 200 యూనిట్లు హ్యాండ్లూమ్‌కు, 500 యూనిట్లు పవర్ లూమ్స్ ఉన్నవారికి ఉచితంగా విద్యుత్ ఇస్తున్నాం." అని ముఖ్యమంత్రి వివరించారు.

**విద్యార్థికి చేయూత-వైద్యానికి భరోసా**

"పాఠశాలల్లో ఉన్న వసతులతో 10 తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా చూడాలి. ఉన్నత విద్య చదువుకునే విద్యార్థులకు కేంద్రం నుంచి పావలా వడ్డీ కింద ఎంతైనా రుణం తీసుకునే అవకాశం ఉంది. ఆ వడ్డీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించేలా విధానాలను రూపొందించండి. సంక్షేమ హాస్టళ్లను కలెక్టర్లు తప్పని సరిగా సందర్శించాలి. విద్యార్థులకు ఇచ్చే ఆహారం, నీరు, వారికిచ్చే దుప్పట్లు, మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాలి. అన్ని సంక్షేమ హాస్టళ్ల పునర్నిర్మాణానికి ఎంత వ్యయం అవుతుందో అంచనా వేయండి. అవసరమైతే రాత్రి పూట నిద్ర చేసి అక్కడ పరిస్థితుల్ని మార్చండి. ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లను మెరుగుపర్చేందుకు నిధులు కొరతలేదు. ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లల్లో చదివే విద్యార్థులు ఐఐటీ, ఐఐఎం వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో సీట్లు సాధించేలా మరింత కృషి చేయాలి. ఇప్పటికే హాస్టళ్లల్లో చదువుకున్న విద్యార్థులు ప్రతిష్టాత్మక సంస్థల్లో సీట్లు సాధిస్తున్నారు. ఆ సంఖ్య మరింత పెరగాలి. ఆ దిశగా కలెక్టర్లు ఫోకస్ పెట్టాలి. గతంలో చాలా మంది అధికారులు ఏజెన్సీ ప్రాంతాల్లో పని చేసేందుకు ఉత్సాహం చూపేవారు. ఎస్ఆర్ శంకరన్ లాంటి వారు దానికి ప్రత్యక్ష ఉదాహరణ. శంకరన్ వంటి వారిని నేటి తరం కలెక్టర్లు ఆదర్శంగా తీసుకోవాలి. కలెక్టర్లు తమ టాలెంట్‌తో కొత్త పంథాలో పాలన చేపట్టాలి. యూనివర్సల్ హెల్త్ సర్వీసుల కింద రూ.2.5 లక్షల భీమా రాష్ట్రంలో ప్రజలందరికీ వర్తిస్తుంది. జన ఔషధి కింద జనరిక్ మెడిసిన్స్ కూడా అందుబాటులోకి తీసుకువచ్చాం. 9 గంటల పాటు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. పీ4 మరో గేమ్ చేంజర్ కార్యక్రమం. వాలంటరీగానే అంతా ముందుకు వస్తున్నారు. బలవంతం ఉండదు. పీ4, డ్వాక్రా, మెప్మాను ఇంటిగ్రేట్ చేసి ముందుకు వెళ్లండి. డ్వాక్రా, మెప్మా, పీ4 లాంటి కార్యక్రమాలతో ఇచ్చిన చేయూతతో ఏ మేరకు జీవన ప్రమాణాలు పెరిగాయో చూడాలి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, వర్గాల్లో తలసరి ఆదాయం పెంచేందుకు కృషి చేయాలి." అని చంద్రబాబు వెల్లడించారు.

**ప్రాంతాల మధ్య పోటీ ఉండాలి...**

**అభివృద్ధి పరుగులు పెట్టాలి**

**"అభివృద్ధిలో ఉత్తరాంధ్ర దూసుకెళ్తోంది. ఉత్తరాంధ్రతో రాయలసీమ పోటీ పడుతోంది. ఉత్తరాంధ్రలో ఆర్సెలార్ మిట్టల్, టీసీఎస్, గూగుల్ వంటి సంస్థలు వస్తున్నాయి. రాయలసీమలో లేపాక్షి నుంచి ఓర్వకల్లు వరకూ పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తాయి. శ్రీసిటీతో పాటు తిరుపతి కేంద్రంగానూ పరిశ్రమలు వస్తున్నాయి. టూరిజం సర్క్యూట్ల ఏర్పాటు ద్వారా ఆర్థిక ఎకోసిస్టం ఏర్పాటు అవుతుంది. ఎంఎస్ఎంఈలను కూడా ప్రోత్సహించేలా పాలసీలను తీసుకువచ్చాం. పోర్టులు, ఎయిర్ పోర్టులు కూడా వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం. గ్రీన్ ట్యాక్స్‌ను కూడా రద్దు చేశాం. సీ-వీడ్ కల్చర్‌ను లాజికల్‌గా తీసుకెళ్తే పెద్దఎత్తున ఆర్థిక లబ్ధి చేరే అవకాశం ఉంటుంది. బయోఫ్యూయెల్ సహా వివిధ రకాలుగా సీ-వీడ్ వినియోగం పెరిగింది. అవసరమైతే దాని కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేద్దాం." అని ముఖ్యమంత్రి చెప్పారు.**





# మానవీయ కోణంలో పని చేయండి... క్షేత్ర స్థాయిలో పర్యటించండి

- డబుల్ ఇంజిన్ సర్కార్.... డబుల్ డిజిట్ గ్రోత్
- వారసత్వ ఆస్తులను ఆక్రమించే వాళ్ల ఆటలు కట్టించాలి
- జీఎస్టీ సంస్కరణల ఫలాలు అందరికీ అందాలి
- నాలుగో కలెక్టర్ల కాన్ఫరెన్స్ తొలి రోజు సమావేశంలో సీఎం దిశా నిర్దేశం
- కొత్తగా నియమితులైన కలెక్టర్లకు ప్రజల తరపున అభినందనలు తెలిపిన సీఎం

**అమరావతి, సెప్టెంబర్ 15: అనంత జనశక్తి న్యూస్**

"కలెక్టర్లు, అధికారులు మానవీయ కోణంలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. ఆఫీసులో కూర్చొని పేపర్ మీద చూస్తే అంతా చక్కగా ఉంటుంది.. సవ్యంగానే కన్పిస్తుంది. క్షేత్ర స్థాయిలో పర్యటించాలి. వాస్తవాలు గ్రహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. సచివాలయంలోని ఐదో బ్లాకులో సోమవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్స్ ప్రారంభం అయింది. తొలి రోజున వివిధ అంశాలపై చర్చించారు. జిల్లాల్లో ప్రగతి, సంక్షేమఅభివృద్ధి కార్యక్రమాల అమలుపై సమీక్షించడంతో పాటు... కేటగిరీల వారీగా శాఖలపై సీఎం సమీక్షించారు. లాజిస్టిక్స్, ఇన్ఫ్రా, స్వచ్ఛాంధ్ర, సర్క్యులర్ ఎకానమీ వంటి అంశాలపై చర్చించారు. సూపర్ సిక్స్, పీ4 అమలు వంటి అంశాల అమలు ఏ విధంగా జరుగుతున్నాయోననే అంశాన్ని కలెక్టర్లకు వివరించారు. నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని, అలాగే జీఎస్డీపీ గ్రోత్ వంటి అంశాలపై సీఎం దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."కొత్తగా నియమితులైన కలెక్టర్లకు ప్రజలు, కేబినెట్ తరపున శుభాభినందనలు. కలెక్టర్లు తమను తాము నిరూపించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రధాని, సీఎం తర్వాత కలెక్టర్లే అత్యంత కీలకమైన వ్యక్తులు. జిల్లా రూపు రేఖల్ని మార్చటంలో వారిదే ప్రధాన బాధ్యత. ప్రభుత్వం రూపొందించిన విధానాలను సక్రమంగా అమలు చేసేది కలెక్టర్లే. సీఎస్, డీజీపీల నుంచి క్షేత్రస్థాయి వరకూ సరైన వ్యక్తి సరైన చోట ఉండాలనే లక్ష్యంతో నియమాకాలు చేశాం. అన్ని కోణాల్లో ఆలోచించి ఎమ్మెల్యేల అభ్యర్థుల ఎంపిక, కేబినెట్ కూర్పు చేశాం. అదే తరహాలో సమర్థులైన వారి కోసం కలెక్టర్ల పోస్టింగులు చేపట్టాం. దీనికి అనుగుణంగా పని చేయాలి. మంచి పేరు తెచ్చుకునేలా కలెక్టర్లు పని చేయాలి. పని తీరు చక్కగా ఉన్నవాళ్లను నేను ఎప్పుడూ మార్చలేదు. ప్రభుత్వం అందించే సేవలన్నిటిలోనూ సంతృప్త స్థాయే కొలమానం అవుతుంది. సంక్షేమఅభివృద్ధి కార్యక్రమాలకు ఎంతటి ప్రాధాన్యం ఇస్తారో... శాంతి భద్రతల విషయంలో కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలి. ఇక్కడ పని చేసిన అధికారులు ఆర్బీఐ లాంటి సంస్థలకు వెళ్లారు. నేను అధికారులకు పూర్తిగా సపోర్ట్ అందిస్తాను. కానీ విఫలమైతే మాత్రం కఠినంగానే నిర్ణయాలు తీసుకుంటా. కలెక్టర్ల సదస్సు కొత్త ట్రెండ్‌ను సృష్టించాలని కోరుతున్నాను." అని సీఎం చెప్పారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యత మాది... మీది "ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని అమలు చేస్తున్నాం. అందరినీ సాధికారిత దిశగా నడిపిస్తామని చెప్పిన హామీని విశ్వసించే ఎన్డీఏ కూటమికి 94 శాతం స్ట్రైక్ రేట్ ఇచ్చారు. సంపద సృష్టించి ఆదాయాన్ని పెంచి సంక్షేమం అమలు చేస్తామని చెప్పాం. కలెక్టర్లు, అధికారులు ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలి. చెప్పినట్టుగా సూపర్ సిక్స్‌ను సక్సెస్ చేశాం. దేశంలోనే అతిపెద్ద సంక్షేమ పథకం పెన్షన్లు. 64 లక్షల మంది లబ్ధిదారులకు పెన్షన్ ఇస్తున్నాం. తల్లికి వందనం ద్వారా చదువుకునే ప్రతి విద్యార్థికి ఆర్థిక సాయం చేస్తున్నాం. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలకు వెళ్లే పరిస్థితులు వచ్చాయి. ఉచిత బస్సు అమలు చేయలేమని కొందరు విమర్శించారు. కానీ స్త్రీశక్తి పథకం సక్సెస్ అయింది. 50 శాతం మహిళల్ని వంటింటికే పరిమితం చేస్తే వారి శక్తియుక్తులు వృధా అవుతున్నాయి. రాష్ట్రాభివృద్ధికి మహిళా శక్తి కీలకం. ఉచిత బస్సు ప్రయాణంస్త్రీశక్తి పథకం ఆర్థిక వ్యవస్థలో చాలా మార్పు తెస్తుంది. పథకం అమలు తర్వాత 90 శాతం మేర ఆర్టీసీలో ఆక్యుపెన్సీ పెరిగింది. ఆర్టీసీ అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలుపుతున్నా. దీపం2 పథకం ద్వారా ఏడాదికి ఉచితంగా 3 సిలిండర్లు ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ ద్వారా మొదటి విడతలో రూ.7 వేలు ఇచ్చాం. ఆటో డ్రైవర్లకు కూడా రూ.15 వేలను అక్టోబరు 1 తేదీన ఇస్తాం. సమాజంలోని అన్ని వర్గాలకూ అవకాశాలు రావాలి... ప్రతిఫలాలు అందాలి. గతంలో గడ్డు పరిస్థితుల్లో ఉన్న రాయలసీమ... ఇప్పుడు కోనసీమతో సమానంగా ఉంది. రాయలసీమలో డ్రిప్ ఇరిగేషన్ లాంటి విధానాలతో సమర్థనీటి నిర్వహణ ద్వారా మంచి ఫలితాలు సాధించాం. పట్టిసీమతో డెల్టాలో వాడే కృష్ణానీటిని పొదుపు చేసి శ్రీశైలం ద్వారా రాయలసీమకు నీళ్లు ఇవ్వగలిగాం. ప్రస్తుతం హంద్రీనీవా ప్రధాన కాలువను 100 రోజుల్లో పూర్తి చేసి కుప్పం వరకూ కృష్ణా నీళ్లు తీసుకెళ్లాం. గోదావరిలో వేలాది టీఎంసీల నీళ్లు సముద్రంలోకి వృధాగా పోతున్నాయి. సమర్థ నీటి నిర్వహణతో రిజర్వాయర్లు నింపాం. వాణిజ్య పంటల విషయంలోనూ సరైన సమయానికి నిర్ణయాలు తీసుకుని లాభం వచ్చేలా చేయాలి." అని సీఎం వివరించారు.

**జీఎస్టీ సంస్కరణలపై క్షేత్రస్థాయి ప్రచారం**

"వారసత్వంగా వచ్చిన ఆస్తులను వివాదాలను సృష్టించి కాజేసే పరిస్థితి నుంచి మార్చాలి. గతంలో భూ వివాదాలను సృష్టించారు. రెవెన్యూ వ్యవస్థను చిన్నాభిన్నం చేశారు. దీన్ని సరి చేయాలి. రిజిస్ట్రేషన్ పత్రాలను ట్యాంపర్ చేయకుండా ఉండేలా రూపొందించే విధానం ఉండాలి. ఇక జీఎస్టీ రెండో దశ సంస్కరణల ఫలాలు ప్రజలందరికీ అందేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి. దీనిపై ఒక నెలపాటు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. దేశంలోనే అతి తక్కువ లాజిస్టిక్స్ వ్యయం ఏపీలో ఉండాలి. జాతీయ, రాష్ట్ర రహదారులపై గుంతలు ఉండటానికి వీల్లేదు. మానవ వనరుల నైపుణ్యంపై కూడా దృష్టిసాధించాలి. స్వచ్ఛభారత్, సర్క్యులర్ ఎకానమీ కూడా మనకు కీలకం అవుతుంది. కాలుష్య రహిత పర్యావరణం ఉండాలి. ఐటీ సేవల్లో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలి. ఆదాయార్జన శాఖలు మరింత సమర్థవంతంగా పని చేయాలి. హెల్తీ, వెల్తీ, హ్యాపీతో పాటు ఈజ్ ఆఫ్ లివింగ్ ముఖ్యమైన అంశం కావాలి." అని చంద్రబాబు చెప్పారు.

**విజన్ డాక్యుమెంటే... భగవద్గీత, ఖురాన్, బైబిల్**

"డబుల్ ఇంజన్ సర్కార్ డబుల్ డిజిట్ గ్రోత్ ఉండాలన్న లక్ష్యంతోనే పని చేస్తున్నాం. 2047 వరకూ 15 శాతం వృద్ధి రేటు సాధించాలన్న లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. ప్రస్తుతం వృద్ధిరేటు 10.5 శాతం ఉంది. ఈ ఏడాది తలసరి ఆదాయాన్ని రూ.3.47 లక్షలకు తీసుకెళ్లాలని ప్రయత్నిస్తున్నాం. 2029 నాటికి రూ.29 లక్షల జీఎస్డీపీ లక్ష్యం. అప్పటికి రూ.4.67 లక్షల తలసరి ఆదాయం లక్ష్యంగా మనం పని చేయాలి. భారత్ నెంబర్ 1 కావాలన్న ఆకాంక్షతోనే ప్రధాని మోదీ పని చేస్తున్నారు. భారత ఆర్థిక వ్యవస్థ 11వ స్థానం నుంచి 4 స్థానానికి చేరుకుంది. మరో 22 ఏళ్లలో స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తి అవుతుంది. ఆ సమయానికి భారత్ కూడా అగ్రస్థానానికి చేరుకుంటుంది. కేంద్రం 2047 వికసిత్ భారత్ ప్రణాళిక తయారు చేస్తే... ఏపీ 2047 స్వర్ణాంధ్ర విజన్ రూపొందించింది. ఇది అధికారులందరికీ భగవద్గీత, బైబిల్, ఖురాన్ కావాలి. భారత్ అభివృద్ధికి తోడుగా ఆంధ్రప్రదేశ్ కూడా అగ్రస్థానానికి ఎదగాలి." అని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. కలెక్టర్ల సమావేశంలో మంత్రులు, సీఎస్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రానికి 41,170 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించిన కేంద్రం

**- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి**

**అమరావతి, సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్**



రాష్ట్రానికి 41,170 మెట్రిక్ టన్నుల యూరియా వివిధ పోర్టుల ద్వారా చేరుకోనుందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సోమవారం కేంద్రం పలు రాష్ట్రాలకు యూరియాను కేటాయించిన సందర్భంగా రాష్ట్రానికి అధిక ప్రాముఖ్యతను ఇస్తూ 41,170 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించిందని మంత్రి అన్నారు. అందులో భాగంగా కృష్ణపట్నం పోర్ట్ ద్వారా 11,605, కాకినాడ పోర్ట్ ద్వారా 18,765 , మ్యాంగళూరు పోర్ట్ ద్వారా 2700, జైగడ్ పోర్ట్ ద్వారా 8100 మెట్రిక్ టన్నుల యూరియా ఈ నెల 16 నుండి 18 వ తేదీలోపు రవాణా జరుగుతుందని వెల్లడించారు. ఈ కేటాయింపుతో రైతులకు వెసులుబాటు లభిస్తుందని , రైతులకు ఎరువుల కొరత లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని, రాష్ట్రంలో ఇప్పటికే సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ రాష్ట్రానికి అధిక మొత్తంలో యూరియాను కేటాయించేలా చర్యలు చేపడుతున్న సీఎం చంద్రబాబునాయుడు కి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మంత్రి అచ్చెన్న అన్నారు.వైసీపీ కావాలనే యూరియా సరఫరాపై అబద్ధాలు ప్రచారం చేస్తోందని మంత్రి తీవ్రంగా విమర్శించారు. రైతులను భయపెట్టి రాజకీయ లాభాలు పొందాలన్న ప్రయత్నం విజయవంతం కాదని ఆయన హితవు పలికారు. రైతు సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం అన్ని విధాల కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. వైసీపీ నేతలు రైతుల సమస్యలపై కన్నెత్తి చూడరని, నేడు తప్పుడు ప్రచారాలతో రైతాంగాన్ని తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులు నమ్మకం కోల్పోయిన పార్టీగా వైసీపీ మిగిలిపోయిందని, వారి నాటకాలకు రైతాంగం మోసపోరని స్పష్టం చేశారు.

# విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



**యాడికి, సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్ :**

మండలంలోని రాయలచెరువు గ్రామంలో ఉన్న లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ ఇంజనీర్స్ డే సందర్భంగా రాయలచెరువులోని సివి రమణారెడ్డి స్కూల్లో మోక్షగుండం విశ్వేశ్వరయ్య గురించి సోమవారం వ్యాసరచన పోటీలు, వాకృత్వ నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ లయన్స్ అధ్యక్షుడు మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చాలా గొప్ప మనిషి అని, దేశానికి ఎన్నో సేవలు చేశారన్నారు .ప్రపంచం గర్వించదగ్గ ఇంజనీర్ అని, 1955 లో సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య కి భారతరత్న అవార్డు రావడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు , ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి సత్యకుమార్ యాదవ్ ధర్మవరం పర్యటన రద్దు

- కలెక్టర్ల కాన్ఫరెన్స్ కారణంగా మంత్రివర్యుల పర్యటన రద్దు – హరీష్ బాబు
- రాష్ట్ర అధికారిక కార్యక్రమాల వలన ధర్మవరం పర్యటన వాయిదా
- సత్యకుమార్ యాదవ్ షెడ్యూల్ మార్పులు – ధర్మవరం పర్యటన రద్దు

**ధర్మవరం రూరల్ సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్ :**




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ రేపటికి నిర్ణయించబడిన ధర్మవరం పర్యటన కార్యక్రమం రద్దు అయినట్లు మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో మంగళవారం జరగబోయే కలెక్టర్ల కాన్ఫరెన్స్ మరియు ఇతర ముఖ్యమైన అధికారిక కార్యక్రమాల వలన మంత్రి షెడ్యూల్‌లో మార్పులు చోటుచేసుకున్నాయని ఆయన చెప్పారు. ఈ కారణంగా మంత్రి ధర్మవరం పర్యటన రద్దయిందని వివరించారు. ధర్మవరం ప్రజల పట్ల మంత్రి ఎల్లప్పుడూ ప్రత్యేక శ్రద్ధ చూపుతూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారని, త్వరలోనే మరో తేదీని ఖరారు చేసి ధర్మవరం పర్యటన నిర్వహించనున్నారని హరీష్ బాబు తెలిపారు.

# డీఎస్సీ అభ్యర్థులారా నిరుత్సాహపడొద్దు.. అవకాశాలు మళ్లీ తలుపుతడతాయ్..

ఏపీ డీఎస్సీ తుది జాబితాలో చోటు దక్కించుకున్న అభ్యర్థులందరికీ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులుగా కొత్త ప్రయాణాన్ని ఆరంభించి భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దే శక్తి ఇప్పుడు మీ చేతుల్లోనే ఉందంటూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ''ఒక బలమైన నాయకత్వం ఏం చేయగలదో, ఏం సాధించగలదో చూపేందుకు ఈ మెగా డీఎస్సీ ఒక నిదర్శనం.ఐదేళ్ల అనిశ్చితి తర్వాత కేవలం 150 రోజుల్లో మెగా డీఎస్సీని విజయవంతంగా పూర్తి చేయడం.. చంద్రబాబు నాయుడు గారి దార్శనిక నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం చూపిన నిబద్ధతకు ఒక ఉదాహరణగా నిలుస్తుంది. ఇది కేవలం ఎంపిక మాత్రమే కాదు, ఇది ఆంధ్రప్రదేశ్ విద్యా భవిష్యత్తుకు ఒక కొత్త అధ్యాయం'' అన్నారు.


ఏపీలో యువతకు అండగా నిలిచిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై ఏటా డీఎస్సీ ఉంటుందనే ఆయన హామీ.. వేలాది మంది అభ్యర్థులకు కొత్త ఆశలు నింపిందన్నారు. ''ఈసారి అవకాశం రాని అభ్యర్థులు నిరుత్సాహపడకుండా మరింత కృషితో, ప్రేరణతో ముందుకు సాగాలి. మీ సమయం వస్తుంది. అవకాశాలు మళ్లీ తలుపు తడతాయి'' అని పేర్కొన్నారు.





# వెన్నునొప్పి తగ్గడానికి 10 నిమిషాల్లో చేసే 4 సులభమైన యోగా ఆసనాలు

కంప్యూటర్ల ముందు ఎక్కువసేపు కూర్చునే వారికి లేదా స్క్రీన్లకు అతుక్కుపోయి ఉండే వారికి వెన్నునొప్పి, కండరాల పట్టివేత చాలా సాధారణ సమస్యలుగా మారాయి. అయితే, రోజుకు కేవలం 10 నిమిషాలు వెచ్చిస్తే నిజంగా మార్పు వస్తుందా? యోగా, మొబిలిటీ కోచ్ రూబెన్ డి మోంటే తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో ఒక వేగవంతమైన, ప్రభావవంతమైన రోజువారీ కదలికల (మొబిలిటీ) దినచర్యను పంచుకున్నారు. ఇది కండరాల ఒత్తిడిని తగ్గించడానికి, శరీరాన్ని తేలికపరచడానికి, వెన్నెముక ఆరోగ్యానికి మద్దతు ఇవ్వడానికి ఉపయోగపడుతుంది.



"మొబిలిటీని ఎప్పుడూ విస్మరించవద్దు. కదలిక లేకపోతే ఎంత బలం ఉన్నా వృథా. రోజులో కొన్ని నిమిషాలైనా దీనిపై వెచ్చిస్తే మీరు చాలా మార్పును చూస్తారు. మీరు బరువులు ఎత్తుతున్నప్పుడు, పరిగెత్తేటప్పుడు లేదా రోజువారీ పనులు చేసుకుంటున్నప్పుడు మొబిలిటీ మీ శరీరాన్ని తేలికపరుస్తుంది. గాయాలను నివారిస్తుంది. సులభంగా కదలడానికి సహాయపడుతుంది. దీన్ని మీ దినచర్యలో తప్పనిసరి భాగంగా చేసుకోండి." అని రూబెన్ మార్చి 18న తన పోస్ట్‌లో రాశారు. ఇప్పుడు ఆయన సూచించిన 10 నిమిషాల మొబిలిటీ దినచర్యను చూద్దాం.





1. వెన్నెముక కదలికల డ్రిల్స్

ఈ సున్నితమైన కదలికలు వెన్నెముక, ముఖ్యంగా నడుము భాగం, మధ్య వెన్నెముక భాగాలను రిలాక్స్ చేయడానికి ఉద్దేశించినవి. ఎక్కువసేపు కూర్చోవడం వల్ల ఈ భాగాలు తరచుగా బిగుసుకుపోతుంటాయి. క్యాట్-కౌ స్ట్రెచ్‌లు లేదా స్పైనల్ వేవ్స్ వంటి సాధారణ, రిథమిక్ కదలికలు వెన్నెముక కీళ్లను మేల్కొల్పుతాయి.

2. డౌన్‌వర్డ్ డాగ్

ఈ క్లాసిక్ ఆసనం యోగా చేసేవారికే కాదు. ఇది శరీరం మొత్తానికి శక్తివంతమైన స్ట్రెచ్‌ను అందిస్తుంది. ఇది వెన్నెముకను సాగదీస్తుంది. హామ్‌స్ట్రింగ్‌లను రిలాక్స్ చేస్తుంది. భుజాలను తెరుస్తుంది. నడుము భాగంపై ఒత్తిడిని తగ్గిస్తుంది. దీన్ని ఒక్క నిమిషం పాటు ఆచరించినా తక్షణ ఉపశమనం లభిస్తుంది.

3. థొరాసిక్ మొబిలిటీ వర్క్

థొరాసిక్ స్పైన్ (వీపు పైభాగం) తరచుగా నిర్లక్ష్యం చేయబడుతుంది, కానీ మంచి భంగిమకు, నొప్పి లేకుండా కదలడానికి ఇది చాలా కీలకం. రూబెన్ సూచించిన వ్యాయామాలలో థొరాసిక్ రొటేషన్లు, వాల్ యాంగిల్స్ వంటివి ఉంటాయి. ఇవి కదలికల పరిధిని పెంచడానికి, వంగి కూర్చోవడాన్ని తగ్గించడానికి సహాయపడతాయి.


4. గ్లూట్ స్ట్రెచ్‌లు

బిగుసుకుపోయిన గ్లూట్ కండరాలు నడుము, తుంటిపై ఒత్తిడిని కలిగిస్తాయి, దీనివల్ల అసౌకర్యం కలుగుతుంది. ఈ దినచర్యలోని ఈ భాగం సీటెడ్ పిజియన్ లేదా ఫిగర్-ఫోర్ స్ట్రెచ్ వంటి లోతైన, నిర్దిష్ట స్ట్రెచ్‌లతో గ్లూట్స్, చుట్టుపక్కల కండరాలలో ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడుతుంది.


ఈ దినచర్య చేయడానికి మీకు ఎటువంటి ఖరీదైన పరికరాలు లేదా జిమ్ సభ్యత్వం అవసరం లేదు. కేవలం ఒక మ్యాట్, మీ రోజులో 10 నిమిషాల సమయం, మీ శరీరం కోసం ప్రతిరోజూ ప్రయత్నించాలనే తపన ఉంటే చాలు.



# కిడ్నీలు ఆరోగ్యంగా లేకపోతే కనిపించే సంకేతాలు



అంతర్జాతీయ నెఫ్రాలజీ సొసైటీ ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 850 మిలియన్ల కంటే ఎక్కువ మందికి ఏదో ఒక రూపంలో కిడ్నీ వ్యాధి ఉంది. అంతేకాదు, ప్రపంచవ్యాప్తంగా దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి (క్రానిక్ కిడ్నీ డిసీజ్) పురుషులలో 10.4 శాతం, మహిళలలో 11.8 శాతం మందికి ఉంది. దీనికి తోడు, మన వేగవంతమైన జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు కూడా కిడ్నీ ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. అందుకే, మీ కిడ్నీ పనితీరు ఆరోగ్యంగా ఉందో లేదో తెలుసుకోవడం, లేకపోతే దాన్ని మెరుగుపరచడానికి అవసరమైన చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యం. అపోలో క్లినిక్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ నిశ్చయ్ బి, ఎండీ, డీఎం (నెఫ్రాలజీ, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్) మాట్లాడుతూ, కిడ్నీ పనితీరు ఆరోగ్యంగా ఉందో లేదో తెలుసుకోవడానికి లక్షణాలు, కిడ్నీ ఆరోగ్యం ఎందుకు ముఖ్యమో వివరించారు.




## కిడ్నీ ఫెయిల్యూర్ లక్షణాలు ఏమిటి?

డాక్టర్ నిశ్చయ్ ప్రకారం కిడ్నీ వ్యాధి ప్రారంభ దశల్లో సాధారణంగా ఎటువంటి లక్షణాలు కనిపించవు. "దీనికి కారణం ఏమిటంటే, కిడ్నీ పనితీరు గణనీయంగా తగ్గినప్పటికీ శరీరం తరచుగా దానిని తట్టుకోగలదు. ఇతర సమస్యల కోసం చేసే సాధారణ రక్త లేదా మూత్ర పరీక్షల సమయంలోనే కిడ్నీ వ్యాధి తరచుగా అనుకోకుండా బయటపడుతుంది. కిడ్నీ దెబ్బతినడం తీవ్రంగా మారే వరకు లక్షణాలు కనిపించకపోవచ్చు. అందుకే ముందుగా గుర్తించడం చాలా ముఖ్యం. కిడ్నీ వ్యాధి చివరి దశల వరకు కూడా లక్షణాలు స్పష్టంగా, నిర్దిష్టంగా ఉండవు" అని ఆయన వివరించారు. ముందుగా గుర్తించినట్లయితే, మందులు, క్రమం తప్పకుండా పర్యవేక్షించడం ద్వారా వ్యాధి ముదరకుండా నివారించవచ్చని నెఫ్రాలజిస్ట్ పేర్కొన్నారు.


జాగ్రత్తగా గమనించాల్సిన స్వల్ప లక్షణాలు:
ఎక్కువగా అలసటగా ఉండటం
ఆకలి మందగించడం
కళ్ళ చుట్టూ వాపు రావడం
చర్మం పొడిగా, దురదగా ఉండటం
మూత్ర విసర్జనలో మార్పులు

"ఈ లక్షణాలను సులభంగా విస్మరించవచ్చు, కాబట్టి అవగాహన, ముందుగా గుర్తించడం కీలకం. చివరి దశలలో కూడా లక్షణాలు అస్పష్టంగానే ఉండవచ్చు" అని ఆయన తెలిపారు.




## సాధారణంగా కనిపించే లక్షణాలు:

బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం
శరీరంలో నీరు చేరడం వల్ల చీలమండలు, పాదాలు లేదా చేతులలో వాపు
ఊపిరి ఆడకపోవడం
అలసట
మూత్రంలో రక్తం రావడం
తరచుగా మూత్ర విసర్జన, ముఖ్యంగా రాత్రిపూట
నిద్ర పట్టకపోవడం (నిద్రలేమి)
చర్మం దురద
కండరాల తిమ్మిర్లు
వికారం
తలనొప్పులు



కిడ్నీ ఆరోగ్యం ఎందుకు ముఖ్యం?

మన కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతూ, "కిడ్నీలు రక్తం నుండి వ్యర్థాలు, అదనపు ద్రవాలను వడపోయడంలో మాత్రమే కాకుండా, రక్తపోటును నియంత్రించడంలో, ఎలక్ట్రోలైట్ సమతుల్యతను నిర్వహించడంలో, ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి అవసరమైన హార్మోన్లను ఉత్పత్తి చేయడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయి." అని డాక్టర్ నిశ్చయ్ వివరించారు.





# సౌత్ జోన్ ఓటమి.. దులీప్ ట్రోఫీ విజేతగా సెంట్రల్ జోన్

దేశవాళీ క్రికెట్‌లో ప్రతిష్ఠాత్మకమైన దులీప్ ట్రోఫీని సెంట్రల్ జోన్ కైవసం చేసుకుంది. ఫైనల్‌లో సౌత్ జోన్‌ను చిత్తు చేసింది. సౌత్‌జోన్ నిర్దేశించిన 65 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని సెంట్రల్ జోన్ నాలుగు వికెట్లను కోల్పోయి ఛేదించింది. రజత్ పటీదార్ నాయకత్వంలో వరుసగా రెండో టైటిల్‌ను నెగ్గినట్లు అయింది. ఇంతకుముందు ఐపీఎల్ 18వ ఎడిషన్ టైటిల్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ జట్టుకు సారథ్యం వహించిన క్రికెటర్ రజత్ పటీదార్.

**అక్కడే అడుగులు..**

తొలుత బౌలింగ్ ఎంచుకున్న సెంట్రల్ జోన్ అందుకు తగినట్టుగానే సౌత్ జోన్‌ను కట్టడి చేసింది. బౌలర్ల దెబ్బకు తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (31) టాప్ స్కోరర్. సారాన్ష్ జైన్ 5, కుమార్ కార్తికేయ 4 వికెట్లు తీశారు. అనంతరం సెంట్రల్ జోన్ తన తొలి ఇన్నింగ్స్‌లో 511 పరుగులు చేసింది. యశ్ రాథోడ్ (194) భారీ శతకంతోపాటు కెప్టెన్ రజత్ (101) సెంచరీ బాదాడు. సారాన్ష్ జైన్ (69), డానిష్ మాలెవార్ (53) విలువైన అర్ధశతకాలు చేశారు. అంకిత్ శర్మ 4, గుర్జప్‌నీత్ సింగ్ 4.. నిదీశ్, కౌషిక్ చెరో వికెట్ తీశారు.

**పుంజుకున్నా సరిపోలేదు..**

తొలి ఇన్నింగ్స్‌లో 362 పరుగులు వెనకబడిన సౌత్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం దూకుడు పెంచింది. అంకిత్ శర్మ (99), ఆంద్రూ సిద్దార్థ్ (84), స్మరన్ రవిచంద్రన్ (67) హాఫ్ సెంచరీలు చేశారు. దీంతో 426 పరుగులు చేయగలిగింది. చివరికి సెంట్రల్ జోన్ ముంగిట కేవలం 65 పరుగులనే టార్గెట్ ఉంచింది.

## టీమ్‌ఇండియాకు హ్యాట్సాఫ్.. నాకైతే
# మాటలు రావడం లేదు: షోయబ్ అక్తర్



ఆసియా కప్‌లో ఇప్పుడు పాకిస్థాన్ క్రికెటర్లకు భారత ప్లేయర్లు కరచాలనం చేయకపోవడం హాట్ టాపిక్‌గా మారింది. పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా మంచి వేదికపై పాక్‌కు బుద్ధి చెప్పినట్లు అయిందని టీమ్‌ఇండియా అభిమానులు సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో పాక్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ టీమ్‌ఇండియాపై ప్రశంసల వర్షం కురిపిస్తూనే.. రాజకీయాలతో క్రీడలకు ముడిపెట్టొద్దని కోరాడు. అద్భుత విజయం సాధించిన భారత్‌ను అభినందించాడు.

"నాకు మాటలు రావడంలేదు. ఇలాంటి పరిస్థితి చూడాల్సి వస్తుందని అనుకోలేదు. తీవ్రంగా బాధించింది. ఏం చెప్పాలో కూడా తెలియడంలేదు. విజయం సాధించిన టీమ్‌ఇండియాకు హ్యాట్సాఫ్. అయితే, ఇలాంటి వాటిని రాజకీయం చేయొద్దు. క్రికెట్‌ను దాంతో ముడిపెట్టొద్దు. ఇంతకుముందు వరకూ చాలా విషయాల గురించి మాట్లాడుకున్నాం. కరచాలనం పైనా ఏదొకటి చెప్పొచ్చు. ప్రతి ఇంట్లోనూ గొడవలు జరుగుతుంటాయి. వాటిని మరిచిపోయి ముందుకు సాగాలి. ఇది క్రికెట్. కరచాలనం చేసుకుంటే బాగుండేది" అని అక్తర్ వ్యాఖ్యానించాడు.

**ఏసీసీ ఎదుట పాక్ నిరసన?**

భారత క్రికెటర్లు తమకు షేక్‌హ్యాండ్ ఇవ్వకపోవడంపై ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఎదుట పాకిస్థాన్ అసంతృప్తి వ్యక్తంచేసినట్లు వార్తలు వస్తున్నాయి. దీనిపై నిరసన తెలియజేసినట్లు తెలుస్తోంది. అయితే, పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాక్‌తో మ్యాచ్ ఆడొద్దని భారత అభిమానులు డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. ఐసీసీ, ఏసీసీ నిబంధనలను గౌరవిస్తూ భారత్ ఆసియా కప్‌లో మ్యాచ్ ఆడింది. ఇదే విషయాన్ని సూర్యకుమార్ కూడా 'మేం కేవలం క్రికెట్ ఆడేందుకు మాత్రమే వచ్చాం' అంటూ స్పష్టం చేశాడు.

**పాక్ బ్యాటింగ్‌పై అక్రమ్ అసహనం**

కుల్‌దీప్ యాదవ్ బౌలింగ్‌లో తడబాటుకు గురైన పాకిస్థాన్ బ్యాటర్లపై ఆ జట్టు మాజీ క్రికెటర్ వసీమ్ అక్రమ్ అసహనం వ్యక్తం చేశాడు. సరిగ్గా చూడకుండానే ఆడేశారంటూ విమర్శించాడు. "కుల్‌దీప్ బంతి విసిరే విధానాన్ని పాక్ బ్యాటర్లు అస్సలు రీడ్ చేయలేదు. మ్యాచ్‌కు ముందు సునీల్ గావస్కర్‌తో ఓ చర్చా కార్యక్రమంలో మాట్లాడా. ఆయన ఒకటే చెప్పాడు 'బంతి కుల్‌దీప్ చేతి నుంచి పిచ్‌పై పడే వరకూ నిశితంగా పరిశీలించాలి. అప్పుడే ఎలా ఆడాలో తెలుస్తుంది. అది సాధ్యపడకపోతే అతడిని ఎదుర్కోవడం కష్టం' అని అన్నాడు. పాక్ బ్యాటర్లు మాత్రం ప్రతి రెండో బంతిని స్వీప్ షాట్ కొట్టేందుకు ప్రయత్నించారు. దానర్థం సరిగ్గా అంచనా వేయలేకపోయారని తెలుస్తుంది" అని అక్రమ్ వెల్లడించాడు.

# ప్లీజ్ ఈసారి 'బాయ్‌కాట్' చేయండి



నిన్నటివరకూ పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడొద్దని భారత అభిమానులు డిమాండ్ చేశారు. ఆసియా కప్‌లో పాక్‌తో పోరును టీమ్‌ఇండియా బాయ్‌కాట్ చేయాలంటూ సోషల్ మీడియా వేదికగా హోరెత్తించారు. అయితే ఐసీసీ, ఏసీసీ నిబంధనలకు లోబడి ఆడినట్లు బీసీసీఐ స్పష్టత ఇచ్చింది. ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ చిత్తు కావడంతో ఆ జట్టు ఫ్యాన్స్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈసందర్భంగా టీమ్‌ఇండియాకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేయడం గమనార్హం. ఆసియా కప్ లీగ్ స్టేజ్‌లో భారత్ - పాక్ తలపడ్డాయి. ఇప్పడీ విజయంతో టీమ్‌ఇండియా సూపర్-4కి వెళ్లినట్లే. ఒకవేళ పాక్ తన చివరి మ్యాచ్‌లో గెలిస్తే అప్పుడు ఆ జట్టు కూడా రెండో దశకు చేరుకుంటుంది. అప్పుడు కూడా ఇరుజట్లూ మరోసారి తలపడే అవకాశం ఉంటుంది. దీనిని దృష్టిలోపెట్టుకుని పాక్ అభిమానులు తమతో మ్యాచ్‌ను టీమ్‌ఇండియా బాయ్‌కాట్ చేయాలని కోరారు. లేకపోతే తమ టీమ్ ఫైనల్‌కు చేరుకోలేదని ఎద్దేవా చేశారు. కనీస పోటీ ఇవ్వకుండా ఓటమిపాలు కావడంతోనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు.

**మ్యాచ్ మధ్యలోనే జెర్సీ మార్చుకొని..**

భారత్ చేతిలో ఓటమి తప్పదని భావించిన ఓ పాక్ అభిమాని చేసిన పని ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. పాక్ జెర్సీ పైనే టీమ్‌ఇండియా జెర్సీని ధరించాడు. దీంతో సోషల్ మీడియాలో కామెంట్లు, మీమ్స్ పుట్టుకొచ్చాయి. మ్యాచ్ అనంతరం భారత అభిమాని ఒకరు పాక్ ఆటపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'పాక్ ఇంకాస్త ఎక్కువగా సాధన చేయాలి. లేకపోతే చిన్న జట్టుగా పడిపోవడం ఖాయం. స్పిన్ ట్రాక్‌పై టాస్ నెగ్గిన ఆ జట్టు బ్యాటింగ్‌ను ఎంచుకుంది. ఇక్కడ ఛేదన సులువు. ఆ మాత్రం తెలియకుండానే బరిలోకి దిగింది. ఇక్కడే పాక్ పెద్ద పొరపాటు చేసింది. ఇక ఫీల్డింగ్‌లోనూ దారుణం. బౌండరీలను ఆపడంలో విఫలమయ్యారు. భారత బ్యాటింగ్ అద్భుతంగా ఉంది. జట్టుగా కలిసికట్టు ఆటతీరుతో విజయం సాధించింది. అభిషేక్ శర్మ సూపర్ ప్లేయర్. నేను యూఎస్ఏ నుంచి మ్యాచ్‌ను చూసేందుకు వచ్చా" అని సదరు అభిమాని వెల్లడించారు.

## అదేమీ రూల్ కాదు..: షేక్‌హ్యాండ్‌పై
# పాక్‌కు బీసీసీఐ కౌంటర్!

ఆసియా కప్‌లో పాకిస్థాన్‌పై విజయం సాధించిన టీమ్‌ఇండియా ఆటగాళ్లు నేరుగా డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లిపోయారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కుల్‌దీప్ యాదవ్‌తోపాటు భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాత్రమే పోస్ట్ ప్రెజెంటేషన్ ఇంటర్వ్యూలో మాట్లాడారు. పాక్ నుంచి ఎవరూ రాలేదు. అయితే, తమతో టీమ్‌ఇండియా ఆటగాళ్లు కరచాలనం చేయకపోవడంపై ఏసీసీ వద్ద పాక్ ప్రతినిధులు నిరసన తెలిపారని.. ఫిర్యాదు చేసినట్లు వార్తలు వచ్చాయి. వీటికి కౌంటర్ ఇచ్చేలా భారత క్రికెట్ బోర్డు అధికారి స్పందించారు. పీటీఐతో మాట్లాడిన సదరు సీనియర్ అధికారి పాక్ ఫిర్యాదుకు విలువ లేదని వ్యాఖ్యానించారు.

"మీకు ఏదైనా సందేహం ఉంటే ఓసారి రూల్ బుక్‌ను చూసుకోండి. సరిగ్గా చదివితే.. అందులో ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లకు కరచాలనం ఇవ్వాలని ప్రత్యేకంగా ఏమీలేదు. అదంతా గుడ్‌విల్ మీద ఆధారపడి ఉంటుంది. స్నేహపూర్వకంగా ఉన్నప్పుడు చేస్తారు. అంతేకానీ, ఇదేమీ చట్టం కాదు. కాబట్టి, భారత క్రికెటర్లు ప్రత్యేకంగా వాళ్లతో కరచాలనం ఇవ్వాల్సిన అవసరం లేదు" అని అధికారి పేర్కొన్నారు.

ఆసియా కప్ ప్రారంభానికి ముందు ఎనిమిది జట్ల కెప్టెన్లతో ప్రెస్ కాన్ఫరెన్స్ జరిగింది. భారత్, పాక్ సారథులు సూర్యకుమార్, సల్మాన్ అఘా పక్కపక్కన కూర్చోలేదు. మధ్యలో అఫ్గానిస్థాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ ఉన్నాడు. పీసీ ముగిసిన తర్వాత సల్మాన్‌తో సూర్య కరచాలనం చేశాడు. ఏసీసీ అధ్యక్షుడిగా ఉన్న మోసిన్ ఖాన్‌తో షేక్ హ్యాండ్ ఇచ్చాడు. దీంతో భారత అభిమానుల నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైంది. దీంతో మ్యాచ్ రోజున టాస్ తర్వాత ఇచ్చే టీమ్ షీట్ల విషయంలోనూ స్పష్టమైన వ్యత్యాసం కనిపించింది.




## పాక్‌పై తొలి భారత క్రికెటర్‌గా రికార్డు..
# విరాట్‌ను వెనక్కి నెట్టిన అభిషేక్



సంచలనాలు సృష్టించే పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు టీమ్‌ఇండియా షాక్ ఇచ్చింది. లక్ష్యం చిన్నదైనా కాపాడుకొనేందుకు పాక్ చివరివరకూ పోరాడుతుంది. అయితే, ఆ టీమ్‌కు అవకాశం ఇవ్వకుండా భారత్ ఆధిపత్యంతో అదరగొట్టింది. అన్ని రంగాల్లోనూ పట్టుబిగించి విజయం సాధించింది. తొలుత బౌలింగ్‌లో విజృంభించిన భారత్ ప్రత్యర్థి పాక్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేసింది. అనంతరం స్టార్ పేసర్ షహీన్ బౌలింగ్‌ను ఎలా ఎదుర్కొంటుందా? అనే అనుమానాలను భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ పటాపంచలు చేశాడు. వచ్చీ రావడంతోనే దూకుడుగా ఆడేశాడు. ఈక్రమంలో ఓ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లిని వెనక్కి నెట్టాడు.

ఆసియా కప్ గ్రూప్ స్టేజ్‌లో పాకిస్థాన్‌పై భారత్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. పాక్ నిర్దేశించిన 128 పరుగుల లక్ష్యాన్ని టీమ్‌ఇండియా మరో 25 బంతులు మిగిలిఉండగానే ఛేదించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (31: 13 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) వేగంగా ఆడేశాడు. దీంతో పాక్‌పై పవర్ ప్లేలో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. ఇప్పటివరకు ఆ ఘనత విరాట్ పేరిట ఉండేది. దుబాయ్ వేదికగానే 2022లో విరాట్ కోహ్లి 29 పరుగులు చేశాడు. అదే ఏడాది రోహిత్ శర్మ కూడా 28 పరుగులు రాబట్టాడు. భారత్ తరఫున అభిషేక్ టాపర్ కాగా.. ఓవరాల్‌గా మాత్రం పాక్ మాజీ ఆటగాళ్లు నసీర్ జంషెడ్ (2012లో 34 రన్స్), ఇమ్రాన్ నజీర్ (2007లో 33 పరుగులు) ముందున్నారు.

భారత్-పాక్ మధ్య జరిగిన తొమ్మిది టీ20 మ్యాచుల్లో ఛేదనకు దిగిన జట్టు గెలవడం ఇది ఎనిమిదోసారి. న్యూయార్క్‌లో గత పొట్టి కప్‌లో మాత్రమే మొదట బ్యాటింగ్ చేసిన టీమ్ విజయం సాధించింది.

# 'పాక్‌తో ఆడటం భారత్ క్రికెటర్లెవరికీ ఇష్టం లేదు'

ఆసియా కప్‌లో పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడటం భారత క్రికెటర్లకు అస్సలు ఇష్టంలేదని మాజీ ఆటగాడు సురేశ్ రైనా వ్యాఖ్యానించాడు. బాయ్‌కాట్ చేయాలంటూ పెద్దఎత్తున డిమాండ్లు వచ్చినా టీమ్‌ఇండియా మాత్రం పాక్‌తో తలపడి అద్భుత విజయం సాధించింది. ఆ మ్యాచ్ ఫలితాన్ని పహల్గాం ఉగ్రదాడి బాధితులకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించిన సూర్యకుమార్ యాదవ్‌పై అభిమానుల నుంచి ప్రశంసల వర్షం కురుస్తోంది. అలాగే పాక్ ప్లేయర్లతో కరచాలనం చేయకుండా ఉండటం మంచిది అయిందన్న వ్యాఖ్యలు వినిపించాయి. అసలు ఆ జట్టుతో ఆడటమే మన క్రికెటర్లకు వ్యక్తిగతంగా ఇష్టం లేదని రైనా చెప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది.

"నేనొక విషయం కచ్చితంగా చెప్పగలను అనుకుంటున్నా. మీరు మన ఆటగాళ్లను వ్యక్తిగతంగా తమ అభిప్రాయాలను అడిగితే చెబుతారు. ఆసియా కప్‌లో పాక్‌తో ఆడాలని ఉందా? లేదా? అనే ప్రశ్నకు లేదనే బదులిస్తారు. బీసీసీఐ వల్లే వారు అంగీకరించారు. పాక్‌తో ఆడటం నన్ను బాధించింది. విజయం సాధించడం ఆనందమే కానీ.. అసలు ఆడకుండా ఉండుంటే ఇంకా బాగుండేది" అని సురేశ్ రైనా వ్యాఖ్యానించాడు.

**అప్పటి పాక్ జట్టు లాంటిది కాదు: గావస్కర్**

పాకిస్థాన్ టీమ్ నాణ్యతపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. తాను చూసిన అత్యంత చెత్త జట్లలో ఇదొకటిగా పేర్కొన్నాడు. "నేను పాక్ క్రికెట్‌ను 1960ల నుంచి గమనిస్తూనే ఉన్నా. చర్చిగేట్ స్టేషన్ నుంచి వాంఖడే మైదానానికి వెళ్లేటప్పుడు హనీఫ్ మహ్మద్ ఫొటోలు ఉండేవి. చాలా గొప్ప క్రికెటర్లు ఉండేవారు. ఇప్పుడు తొలిసారి పాక్ టీమ్ చాలా బలహీనంగా కనిపిస్తోంది" అని గావస్కర్ వెల్లడించాడు.



## నాతో పెళ్లి అని రాసేశారు



చైల్డ్ ఆర్టిస్టుగా ఇండస్ట్రీలోకి వచ్చిన మీనా అగ్ర కథానాయకుల సరసన నటించి స్టార్‌గా ఎదిగారు. తాజాగా ఆమె 'జయమ్ము నిశ్చయమ్మురా' కార్యక్రమానికి అతిథిగా హాజరై తన కెరీర్, పర్సనల్ లైఫ్ గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. స్టార్ హీరోలతో నటించిన జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కృష్ణ, రజనీకాంత్ ఇద్దరికీ తాను కూతురుగా, హీరోయిన్‌గా నటించినట్లు చెప్పారు. నటుడు జగపతి బాబు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఈ టాక్ షో 'జీ 5' లో స్ట్రీమింగ్ అవుతోంది. "చాలామంది నిర్మాతలు ఫ్లాప్‌లలో ఉన్నామని తక్కువ అమౌంట్‌తో సినిమా చేస్తున్నామని నన్ను సంప్రదించేవారు. నేను సరేనని అంగీకరించేదాన్ని. ఆ చిత్రాలు సూపర్‌హిట్ అయ్యేవి. తర్వాత నన్ను మర్చిపోయేవారు. ఎప్పుడూ ఇలానే జరిగేది. కెరీర్‌లో వరుస అవకాశాలు వస్తున్నప్పుడే పెళ్లి చేసుకున్నాను. ఆ తర్వాత పాప పుట్టిన రెండేళ్లకు మలయాళం సినిమా దృశ్యం కోసం నన్ను సంప్రదించారు. పాపను వదిలి వెళ్లలేక తిరస్కరించాను. వాళ్లు రిక్వెస్ట్ చేశారు. కథ రాసేటప్పుడు నన్ను దృష్టిలోపెట్టుకున్నట్లు తెలిపారు. వేరే వారితో సినిమా చేయలేమన్నారు. దీంతో అంగీకరించాను. మీరు (జగపతిబాబు) నాకు ఎప్పుడూ పోటీనే.. మీ పక్కన నేను వస్తుంటే నన్ను ఎవరూ చూసేవారు కాదు. అందరూ మిమ్మల్నే చూసేవారు" అంటూ మీనా సరదా సంగతులు పంచుకున్నారు. దివంగత నటి సౌందర్యతో తన అనుబంధాన్ని పంచుకొని మీనా ఎమోషనల్ అయ్యారు. ఆరోజు ఎన్నికల ప్రచారానికి సౌందర్యతో

## ఏడాది ఆఖర్లో ప్రేమ మొదలు




వైవిధ్యమైన సినిమాలు, యువతరం మెచ్చే సిరీస్‌లను ఎంచుకుంటూ ఆకట్టుకుంటోంది బాలీవుడ్ నాయిక అనన్య పాండే. ఆమె, కార్తిక్ ఆర్యన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'తూ మేరీ మై తేరా.. మై తేరా తూ మేరీ'. రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో సరికొత్త ప్రేమకథగా సమీర్ విద్వాన్స్ దీన్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటిస్తూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టింది చిత్రబృందం. "ఈ సంవత్సరం మీ చివరి రోజును మాతో పంచుకోబోతున్నారు. ఈ ఏడాది ముగుస్తుంది కానీ ప్రేమ మొదలవుతుంది. డిసెంబరు 31న థియేటర్లలోకి వస్తోందీ చిత్రం" అని వ్యాఖ్యల్ని జోడించింది. ఇందులో రూమిగా అనన్య, రే పాత్రలో కార్తిక్ కనిపించనున్నారు. కరణ్ జోహార్, అపూర్వ మెహతా సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



## బాలీవుడ్ పరిస్థితులు అప్పుడే అర్థమయ్యాయి

2000 సంవత్సరంలో మిస్ వరల్డ్ కిరీటాన్ని సొంతం చేసుకున్న అనంతరం నటి ప్రియాంక చోప్రా ఇండస్ట్రీకి వచ్చి స్టార్‌గా ఎదిగారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తాను సొంత నిర్మాణసంస్థను ప్రారంభించడానికి గల కారణాన్ని వెల్లడించారు. 2015లో తాను పర్పుల్ పెబుల్ పిక్చర్స్‌ను స్థాపించడానికి బాలీవుడ్ పరిస్థితులే కారణమన్నారు. "2000 సంవత్సరం మిస్ వరల్డ్ కిరీటం గెలుచుకున్న తర్వాత ఇండస్ట్రీలో ఆఫర్లు వచ్చాయి. హిందీ, తమిళ సినిమాల్లో నటించడం మొదలుపెట్టా. ఆ తర్వాత రెండేళ్లకు బాలీవుడ్ పరిస్థితులు అర్థమయ్యాయి. సినీనేపథ్యం లేకుండా ఇండస్ట్రీకి వచ్చినవారిని ఎంత చులకనగా చూస్తారో తెలుసుకొన్నాను. తరతరాలుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్నవారు స్టార్‌లుగా ఉన్నారు. అలాంటప్పుడు బయట నుంచి వచ్చినవారు పరిశ్రమలో కొనసాగడం అంత సులభం కాదు. కానీ, నేను ఎంతో కష్టపడి ఆఫర్లు అందుకొని సక్సెస్ అయ్యాను. ఏదైనా పట్టుదలతో ప్రయత్నించడం నా అలవాటు. నేను ఇబ్బందిపడినట్లు ఎవరూ పడకూడదనే ఉద్దేశంతో.. సినీ నేపథ్యం లేకుండా కొత్తగా ఇండస్ట్రీకి వచ్చేవారిని ప్రోత్సహించడానికే నిర్మాణసంస్థను స్థాపించాను" అని ప్రియాంక తెలిపారు. ప్రియాంక నిర్మాణసంస్థలో 2016లో సంతోశ్ మిశ్రా దర్శకత్వంలో వచ్చిన భోజ్‌పురి మొదటి సినిమాగా విడుదలైంది. ఆ తర్వాత ఆమె నటించిన పలు చిత్రాలు విడుదలై విజయాన్ని అందుకున్నాయి. ఇక ప్రియాంక సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం SSMB 29లో నటిస్తున్నారు. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా ఇది రూపొందుతోంది.

## రాజాసాబ్ పాటల ప్రయాణం




'ది రాజాసాబ్'తో సంక్రాంతి బరిలో సందడి చేయనున్నారు కథానాయకుడు ప్రభాస్. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని మారుతి తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ నిర్మిస్తోంది. ముగింపు దశలో ఉన్న ఈ సినిమా ఈ నెల 18నుంచి కేరళలో కొత్త షెడ్యూల్ ప్రారంభించుకోనుందని సమాచారం. దాదాపు వారం పాటు సాగే ఈ షెడ్యూల్‌లో ప్రభాస్‌పై ఓ పాట చిత్రీకరించనున్నారని.. దీనికి ప్రేమ్ రక్షిత్ మాస్టర్ నృత్యరీతులు అందిస్తారని తెలిసింది. ఇక దీని తర్వాత అక్టోబరులో గ్రీస్‌లో మరో షెడ్యూల్ మొదలు కానుందని.. అక్కడే మూడు పాటలు తెరకెక్కిస్తారని తెలుస్తోంది. రొమాంటిక్ హారర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమాలో ప్రభాస్ రెండు కోణాలున్న పాత్రలో కనువిందు చేయనున్నట్లు తెలిసింది. ఈ చిత్ర తొలి ట్రైలర్‌ను వచ్చే నెల 'కాంతార: చాప్టర్ 1' సినిమాతో పాటుగా విడుదల చేయనున్నారు. అలాగే మొదటి గీతాన్ని ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా అక్టోబరు 23న బయటకు వదలనున్నారు. ఈ సినిమా జనవరి 9న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి తమన్ సంగీతమందిస్తుండగా.. కార్తీక్ పళని ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

## యామి-ఇమ్రాన్ 'హక్'

'ధూమ్ ధామ్' చిత్రంతో ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకొచ్చి మంచి హిట్‌ని తన ఖాతాలో వేసుకుంది బాలీవుడ్ నటి యామీ గౌతమ్. ఆమె, ఇమ్రాన్ హష్మీ జంటగా ఓ చిత్రంలో నటిస్తున్నట్లు కొంత కాలంగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. సుపర్ణ్ వర్మ తెరకెక్కిస్తున్నారు. ఇప్పుడీ ప్రాజెక్టుకు సంబంధించిన మరో విషయం నెట్టింట్లో సందడి చేస్తుంది. తాజాగా ఈ సినిమాకు 'హక్' అనే పేరును ఖరారు చేసినట్లు, దీన్ని నవంబరు 7న విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. "ఈ చిత్రం మహిళల హక్కులకు మద్దతు ఇచ్చిన షా బానో వర్సెస్ అహ్మద్ ఖాన్ కేసు ఆధారంగా రూపొందించిన కోర్టు రూమ్ డ్రామా. ఇందులో ఇమ్రాన్ న్యాయవాదిగా కనిపించగా, యామి న్యాయం పోరాటం చేసే మహిళగా కనిపించనుంద"ని యామి సన్నిహిత వర్గాలు తెలిపాయి.

## ఇప్పుడు పాట పుట్టించడం కత్తి మీద సామే: శ్రీమణి



"కాల పరిమితిలేని అర్థవంతమైన సాహిత్య గీతాలతో ప్రేక్షకుల్ని రంజింపజేయడమే నా ధ్యేయం" అంటున్నారు గీత రచయిత శ్రీమణి. '100 పర్సెంట్ లవ్' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన ఆయన.. 'జులాయి', 'ఎవడు', 'అత్తారింటికి దారేది', 'తండేల్' ఇలా ఎన్నో విజయవంతమైన సినిమాలకు పాటలందించారు. "గీత రచయితగా చిత్రసీమలో 15ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకోనుండటం చాలా సంతృప్తినిస్తోంది. ప్రస్తుతం సాహిత్యపరంగా మంచి లోతైన భావాలతో కూడిన సన్నివేశాలున్న పాటలు నా దగ్గరకి వస్తున్నాయి. ఇటీవల వచ్చిన 'తండేల్'లోని "బుజ్జితల్లి..", "హైలెస్సో..", 'లక్కీ భాస్కర్'లోని "నిజమా కలా", "శ్రీమతి గారు" గీతాలకు చాలా మంచి పేరొచ్చింది. ఓ కథలోని అలాంటి బలమైన సందర్భాల్ని.. అంతే బలమైన భావాలతో నేను అర్థవంతంగా చెప్పగలనని నమ్మి నా దగ్గరకు ఆ పాటల్ని తీసుకొస్తున్న సంగీత దర్శకులు, దర్శక నిర్మాతలకు కృతజ్ఞతలు". "ఏ గీత రచయితకైనా ప్రతి పాట ఓ కొత్త సవాలే. ముఖ్యంగా గత ఐదేళ్లుగా శబ్ద సౌందర్యంలోనూ..దానికి అనుగుణంగా సాహిత్యంలోనూ మార్పులు కనిపిస్తున్నాయి. రీల్స్ ట్రెండ్ మొదలయ్యాక.. 'ఓ పాట వినగానే నచ్చేయాలి, ఇన్‌స్టంట్‌గా హిట్టవ్వాల'నే ధోరణి పెరిగింది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుంటూ ఓ పాట పుట్టించడం రచయితలందరికీ కత్తి మీద సామే. దీనికి తగ్గట్లుగా నన్ను నేను మార్చుకుంటూ..ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా ట్రెండీనెస్‌ను పట్టుకుంటూనే..నాదైన విలువల్ని కోల్పోకుండా పాటల్ని అందించే ప్రయత్నం చేస్తున్నా".

## అప్పుడు ఇడ్లీ తినడానికి కూడా డబ్బులు లేవు



ఇటీవలే 'కుబేర'తో ధనుష్ హిట్‌ను సొంతం చేసుకున్నారు. ఇప్పుడాయన స్వీయ దర్శకత్వంలో రానున్న సినిమా 'ఇడ్లీ కొట్టు'. అక్టోబర్ 1న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఆడియో లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఆ కార్యక్రమంలో ధనుష్ మాట్లాడుతూ తన చిన్నతనాన్ని గుర్తుచేసుకున్నారు. "నా చిన్నతనంలో రోజూ ఇడ్లీ తినాలనిపించేది. కానీ, అప్పుడు నా దగ్గర డబ్బులు లేవు. ఇప్పుడు డబ్బులు ఉన్నాయి.. కానీ, నా చిన్నతనంలో ఇడ్లీ తినేప్పుడు ఉన్న ఆనందం, రుచి ఇప్పటి రెస్టరంట్‌లలో ఉండడం లేదు. ఈ చిత్రం నిజజీవితం ఆధారంగా తెరకెక్కింది. ఎంతోమందికి స్ఫూర్తినిస్తుంది" అని తెలిపారు. ఇక ట్రోల్స్ చేసేవారి గురించి మాట్లాడుతూ.. "అసలు 'హేటర్స్' అనే కాన్సెప్టే లేదు. ఎందుకంటే అందరూ హీరోలందరి సినిమాలు చూస్తారు. ఎవరో 30 మంది ఒక టీమ్‌గా ఏర్పడి 300 ఫేక్ ఐడీలను క్రియేట్ చేసుకొని.. వారి మనుగడ కోసం కొందరు హీరోలపై కావాలని ద్వేషం వ్యక్తంచేస్తున్నారు. కానీ, ఆ 30 మంది కూడా సినిమా చూస్తారు. బయట కనిపించే దానికి రియాలిటీకీ చాలా తేడా ఉంటుంది" అని ధనుష్ చెప్పారు. ఇదే వేదికపై ఆయన మరో సినిమాను ప్రకటించారు. త్వరలోనే వెట్రిమారన్ దర్శకత్వంలో 'వడ చెన్నై' సీక్వెల్‌లో నటించనున్నట్లు తెలిపారు. ఇక ఇడ్లీ కొట్టు విషయానికొస్తే.. ఇందులో ధనుష్ సరసన నిత్యామేనన్ నటిస్తున్నారు. విజయవంతమైన 'తిరు' తర్వాత వీరిద్దరి కలయికలో రాబోతున్న చిత్రమిది. ఈ చిత్రంలో ప్రకాశ్‌రాజ్, షాలినీ పాండే తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. గ్రామీణప్రాంత నేపథ్యంలో రూపొందింది.



PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314